మంగళవారం
01 జనవరి
2019

పేజీలు 12
సంపుటి 1, సంచిక 283

www.vijayakranthinews.com

విజయ క్రాంతి

నిజం నిర్భయం నిష్పక్షం

హైదరాబాద్ | PUBLISHED SIMULTANEOUSLY FROM HYDERABAD, NIZAMABAD, KHAMMAM | VIJAYAKRANTHINEWS | రూ. 3.00



సోనాక్షి కొత్త అవతారం 11

ప్రతి పంటకూ డిమాండ్

- సంప్రదాయ సాగు పద్ధతుల్లో మార్పులు తేవాలి
- ఒకేరకమైన పంటలు వేయడం వల్ల లాభనష్టాలపై అధ్యయనం
- తెలంగాణలో వివిధ ప్రాంతాల్లో పంటల కాలనీలు
- ఫుడ్ ప్రాసెసింగ్‌పై ఉన్నతాధికారులతో సీఎం కేసీఆర్ సమావేశం



విజయక్రాంతి, హైదరాబాద్: రాష్ట్రంలో ఆహార, వ్యవసాయ రంగానికి సంబంధించిన పలు విషయాల్లో సరైన గణాంకాలు లేనందున రకరకాల సమస్యలు తలెత్తుతున్నాయని, వీటిని అధిగమించాల్సిన ఆవశ్యకత వుందని ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు అన్నారు. రైతుల సాంప్రదాయబద్ధమైన కొన్ని అలవాట్లలో కొంతమార్పు రావలసిన అవసరం వుందని, రైతులందరూ ఒకే రకమైన పంటలు వేయటం వల్ల జరిగే లాభనష్టాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని, రైతులను సంఘటిత పరచటం ద్వారానే గొప్ప ఫలితాలు సాధించవచ్చని సీఎం సూచించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఖచ్చితంగా పంటల కాలనీగా విభజించాలని, రైతు పండించే ప్రతి పంటకు డిమాండ్ లభించేలా చూడాలని, రాష్ట్రంలో నెలకొల్పబోయే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా ప్రభుత్వ పరంగా నమ్మకమైన, కల్తీరహిత బ్రాండెడ్ ఉత్పత్తులు జరగాలని, రైతులు నియంత్రణా విధానంలోనే పంటలు పండించాలని సీఎం కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ తీరుతెన్నులపై, భవిష్యత్తులో అవలంభించాల్సిన విధానాలపై, మహిళా సంఘాలను ఫుడ్ ప్రాసెసింగ్ ఉత్పత్తులలో భాగస్వాములను చేయటంపై, తెలంగాణలోని వివిధ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులకు సంబంధించి సోమవారం మధ్యాహ్నం ప్రగతిభవన్ లో ముఖ్యమంత్రి అధ్యక్షతన ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. వ్యవసాయ, ఉద్యానవన శాఖల మీద కోట్లాదిమంది అధారపడి వున్నారని, వారి ఆశయాలకు అనుగుణంగా ఆ శాఖలు పనిచేయాలని, దేశం మొత్తంలోనే ఉత్తమమైన వ్యవసాయ, ఉద్యానవన, ఫుడ్ ప్రాసెసింగ్, ఎగుమతులలో తెలంగాణ అగ్రభాగన వుండాలని సిఎం అన్నారు. రైతులను ఆదుకునే విషయంలోయావత్ దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలుస్తుందని సీఎం చెప్పారు.

పంటల మార్పిడిపై రైతులందరికీ అవగాహన: సీఎం

"రైతులందరూ ఒకే రకమైన పంట వేస్తే సమస్యలు తలెత్తుతాయి కనుక పంట మార్పిడి కొరకు వాళ్లకు అవగాహన కల్పించాలి. రైతుల సంప్రదాయబద్ధమైన కొన్ని అలవాట్లలో కొంత మార్పు రావాలి. అందరూ రైతులు ఒకే రకమైన పంట వేస్తే జరిగే లాభనష్టాలమీద చర్చ జరగాలి. ముల్కనూరు గ్రామం అనుభవాన్ని ఆదర్శంగా తీసుకోవాలి. అక్కడ సహకార పద్ధతిలో రైతులను సంఘటిత పరచడం ద్వారా గొప్ప ఫలితాలు సాధించడం జరిగింది. రైతులకు పలనా విధంగా నడుచుకుంటే లాభం కలుగుతుందని వ్యవసాయ శాఖాధికారులు నమ్మకం కలిగించగలిగితే బ్రహ్మాండమైన ఫలితాలు వస్తాయి. వ్యవసాయ ఆర్థిక శాస్త్రవేత్త అశోక్ గులాటిని ఢిల్లీలో కలిసి ఈ విషయాలలో వర్క్ షాప్ నిర్వహించాలని మన రాష్ట్రానికి ఆహ్వానించాను. త్వరలో ఆయన మన రాష్ట్రానికి వస్తారు" అని చెప్పారు సీఎం.

"రాష్ట్రాన్ని ఖచ్చితంగా పంట కాలనీలుగా విభజించాలి. రైతు పండించే పంటకు డిమాండ్ ఉండాలె. మన ఆహార అవసరాలేంటో తెలుసుకోవాలె. రైతాంగం ఏ పంటలు వేయడానికి అలవాటు పడ్డదో అర్థం చేసుకుని ఒకే సారి వాళ్లమీద మన అభిప్రాయాలను రుద్దకుండా అంచలంచలుగా పంట కాలనీల విషయంలో అవగాహన కలిగించాలె. గ్రామీణ ఆహార అవసరాలతో పాటు, నగరపట్టణ ప్రజల ఆహార అవసరాలకు తగు విధంగా ఉత్పత్తులు జరగాలె. కూరగాయలు, కొత్తిమీర, జీలకర్ర లాంటివి కూడా దిగుమతులు చేసుకోవడం దురదృష్టం. నగరాలపట్టణాల దరిదాపుల్లో కూరగాయల పెంపకం జరగాలె. వచ్చే వానకాలం కల్లా కాళేశ్వరం నీళ్లు వస్తాయి. కొత్త ఆయకట్టు వస్తుంది. రాబోయే రెండు సంవత్సరాల్లో నీటి పారుదల ప్రాజెక్టులన్నీ పూర్తయి కోటి ఎకరాలకు పైగా సాగునీరందుతుంది. భూగర్భ జలాలు పెరుగుతాయి. చెరువులు నిండుతాయి. ఈ నేపథ్యంలో ఎటువంటి భూమిలో ఎలాంటి పంట వేయాలో రైతులకు అవగాహన కలిగించాలె" అని అన్నారు సీఎం.

"ఎటువంటి రకమైన వ్యవసాయ ఉత్పత్తినైనా ప్రాసెస్ చేస్తే దాని ధర పెరుగుతుంది. ఉదాహరణకు మిరపకాయ నుండి కారంపొడి లేదా పసుపు కొమ్ముల నుండి పసుపు తీసుకోవచ్చు. ప్రస్తుత పరిస్థితుల్లో ఏ వస్తువు కొనాలన్నా కల్తీ అవుతున్నది. మనం గనక మార్కెట్లో ఒక బ్రాండ్ నేమ్ మన ఫుడ్ ప్రాసెసింగ్ ఉత్పత్తులకు అదీ ప్రభుత్వ పరంగా తయారైన వస్తువన్న నమ్మకం కలిగించాలె. దీనికొరకు ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమను ప్రారంభించాలె. మన ఆలోచనలను కార్యరూపంలో తీసుకుని వచ్చి అమలు పరచాలె. ఏ ప్రాంతంలో ఎన్ని ఫుడ్ ప్రాసెసింగ్, ఏ రకమైన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు వుండాలో నిర్ణయించాలె. మన రాష్ట్ర అవసరాలకు సరిపోను మిగిలినవి పక్క రాష్ట్రాల్లో, విదేశాలకు ఎగుమతి చేయాలె. ఈ యావత్ ప్రక్రియలో ఐకెపి మహిళా సంఘాలను భాగస్వాములను చేయాలి. ఎ మేరకు వీరిని భాగస్వాములను చేయవచ్చో అధ్యయనం చేయాలె. 130 కోట్ల ప్రజలున్న మన దేశం పెద్ద దేశీయ మార్కెట్. ఏ రాష్ట్రంలో ఏది పండదో దాన్ని విశ్లేషించి మన వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా వాటిని పండించగలగాలె. తద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ ఉత్పత్తులను తయారు చేయాలె. దేశ విదేశాల్లో అత్యుత్తమమైన ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ ఎక్కడుందో గుర్తించి అలాంటిది మన రాష్ట్ర వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఏర్పాటు చేసుకునే విషయం అధ్యయనం చేయాలె" అని చెప్పారు సిఎం.

" రైతులు నియంత్రిత విధానంలో పంటలు పండించేలా చూడాలి. ప్రతి కుంట భూమిలో ఏ విత్తనం పెడుతున్నామో వ్యవసాయ శాఖకు తెలవాలె. మంచి మేలు రకమైన విత్తనాలు రైతులకు ఇవ్వాలె. వ్యవసాయ విశ్వ విద్యాలయంలో తదనుగుణమైన పరిశోధనలు జరగాలె. అంతర్జాతీయ విపణిలో మన భారతదేశ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్ చేసుకోలేని పరిస్థితిలో వుండటం దురదృష్టకరం. దీన్ని అధిగమించటానికి ప్రయత్నం జరగాలె. ప్రతి గ్రామం ఆ గ్రామ ప్రజల అవసరాలు తీర్చే స్థాయిలో కూరగాయలు (తరువాయి 4లో)




123 ఎంపీ స్థానాలపై 'మోదీ మిషన్'

- వందరోజుల్లో 20 రాష్ట్రాలకు మోదీ
- జనవరిలో పలు రాష్ట్రాల్లో ప్రధాని విస్తృత పర్యటన
- జనవరి 4న మరోసారి మోదీ అసోం పర్యటన

విజయక్రాంతి, ఢిల్లీ: ఈమధ్య జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో అపజయంపై భారతీయ జనతాపార్టీలో అంతర్మథనం ప్రారంభమైంది. పరాభవ అవమానం నుంచి తేరుకుంటున్న బీజేపీ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విజయం కోసం ఇప్పటి నుంచే వ్యూహారచన చేస్తోంది. తక్కువ ప్రాబల్యం ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిపెడుతోంది. స్థానిక పార్టీలతో కూటములకు సిద్ధమవుతోంది. ప్రచారాల్లోనూ వేగం పెంచుతోంది. ముఖ్యంగా వచ్చే 100 రోజుల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ 20 రాష్ట్రాల్లో పర్యటించి బీజేపీను మరింత బలోపేతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు ప్రధాని మోదీ సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి ఇప్పటికే శ్రీకారం చుట్టారు. ఈ నెల 24, 25 తేదీల్లో ఒడిశా, అసోంలలో పర్యటించి బహిరంగ సభల్లో ప్రసంగించారు. జనవరి 4న మోదీ మరోసారి అసోంలో పర్యటించనున్నారు. ఐదో తేదిన ఒడిశాలోని మయూర్భంజ్‌లో బహిరంగ సభలో పాల్గొననున్నారు. అలా (తరువాయి 4లో)

సంక్రాంతి తర్వాత అమిత్ షా పర్యటన

- నెలాఖరులో మోడీ
- 11 నుంచి జాతీయ కౌన్సిల్



విజయక్రాంతి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికలకు బీజేపీ తెలంగాణ నాయకత్వాన్ని సంసిద్ధం చేయడానికి ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా రానున్నారు. సంక్రాంతి పండుగ అనంతరం ఆయన వచ్చే అవకాశాలున్నాయి. తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో బీజేపీ ఘోర పరాజయం పొందిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై సమీక్ష నిర్వహించడానికి డిసెంబర్ 24న షా రావాల్సి ఉండగా.. అప్పటి వరకూ రాష్ట్ర నాయకత్వం నియోజకవర్గాల వారీగా నివేదికలు సిద్ధం చేయలేదు. ఈ కారణంగా ఆయన పర్యటన వాయిదా పడింది. శాసనసభ ఎన్నికలకు పార్టీ ఇన్‌చార్జ్ వ్యవహరించిన జేపీ నడ్డా.. సమీక్ష నిర్వహించారు. సంబంధిత నివేదికను జాతీయ నాయకత్వానికి ఆయనే అందజేయనున్నారు. మే నెలలో లోక్‌సభ ఎన్నికలు జరుగనున్న (తరువాయి 4లో)

దిమాక్ ఖరాబ్





ఈవీఎంల ట్యాంపరింగ్‌పై హైకోర్టుకు వెళ్తాం

- రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి కుంతియా
- గోల్కొండ హోటల్లో కాంగ్రెస్ ముఖ్య నేతల సమావేశం

విజయక్రాంతి, హైదరాబాద్: తెలంగాణలో జరిగిన ఎన్నికల్లో ఈవీఎంల ట్యాంపరింగ్‌పై న్యాయ పోరాటం చేయాలని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నేతలు యోచిస్తున్నారు. ఈ విషయమై న్యాయ నిపుణులతో కాంగ్రెస్ పార్టీ నేతలు చర్చిస్తున్నారు. ముఖ్యంగా 31 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ నేతలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయం పాలైంది. ఈ పరాజయంపై (తరువాయి 4లో)

2019

పాఠకులకు, ప్రకటన కర్తలకు, ఏజెంట్లకు, శ్రేయోభిలాషులకు విజయక్రాంతి దినపత్రిక నూతన సంవత్సర శుభాకాంక్షలు

సీఎల్ రాజం, చైర్మన్/ ఎడిటర్

తలాక్ బిల్లుపై చర్చ లేకుండానే..

రాజ్యసభ వాయిదా

- సెలెక్ట్ కమిటీకి పంపాల్సిందేనంటూ విపక్షాల డిమాండ్
- జనవరి రెండుకు వాయిదా పడిన రాజ్యసభ

విజయక్రాంతి, ఢిల్లీ: ట్రిపుల్ తలాక్ బిల్లుపై చర్చ జరగకుండానే ప్రతిపక్షాల ఆందోళన, గందరగోళం మధ్య రాజ్యసభ వాయిదా పడింది. ఒకేసారి ముమ్మారు తలాక్ చెప్పి విడాకులివ్వడాన్ని నేరంగా పరిగణించేందుకు ఉద్దేశించిన నూతన బిల్లు సోమవారం రాజ్యసభ ముందుకు వచ్చింది. అయితే.. ప్రస్తుత రూపంలో ఉన్న బిల్లును అనుమతించేందుకు కాంగ్రెస్ సహా 10 విపక్షాలు నిరాకరించాయి. బిల్లును సెలక్షన్ కమిటీకి పంపించాల్సిందిగా ప్రతిపక్ష నేతలు డిమాండ్ చేశారు. బిల్లును మరింత పరిశీలించేందుకు సెలక్షన్ కమిటీకి పంపాల్సిందిగా (తరువాయి 4లో)



శుభోదయం

ఓం శ్రీ గురుభ్యోనమః

శ్రీ వికంబి నామ సంవత్సరం
దక్షిణాయణం
హేమంత ఋతువు
మార్గశిర మాసం

సూర్యోదయం	: ఉ. 06:46	కరణం	: బవ 13:18 భాలవ 25:28
సూర్యాస్తమయం	: సా. 05:52	రాహుకాలం	: సా. 03:04, 04:26
పక్షము	: కృష్ణ పక్షం	యమగండం	: ఉ. 09:34, 10:57
తిథి	: ఏకాదశి 25:28	వర్జ్యం	: మ. 02:33, 04:13
నక్షత్రం	: స్వాతి 08:44	అమృతకాలం	: మ. 12:31, 02:11
యోగం	: ధృతి 26:42		



సూక్తి సుధ

మీరంతా నిజమైన భారతీయులుగా మసలుకోవాలి. క్షణం సేపు కూడా భవిష్యత్తు పట్ల విశ్వాసాన్ని కోల్పోవద్దు.

-నేతాజీ సుభాష్‌చంద్రబోస్



తిరుప్పావై పాశురం-17



అమ్బరమే, తణ్ణీరే శోఱే అఱమ్శెయ్యుమ్
ఎమ్బెరుమాన్ ! నన్దగోపాలా! ఎళున్దిరాయ్,
కొమ్బనార్కెల్లామ్ కొళున్దే ! కులవిళక్కే
ఎమ్బెరుమాట్టి ! యశోదాయ్! అఱివుఱాయ్ !
అమ్బర మూడఱుత్తోఙ్గి యులగళన్ద
ఉమ్బర్ కోమానె ! ఉఱఙ్గాదెళున్దిరాయ్
శెమ్ పొర్కళ అడిచ్చెల్వా ! బలదేవా !
ఉమ్బియుమ్ నీయుముఱఙ్గేలో రెమ్బావాయ్

'వస్త్రాలనే, చల్లని నీరునే, అన్నాన్నే ధర్మబుద్ధితో దానం ఇవ్వు నంద గోపాలా! మా స్వామీ! మేల్కొను'

ప్రబ్బలి చెట్టువలె వంగిన శరీరంగల పడతులలో చిగురువంటి మా కులాన్న మంగళదీపం వంటిదానా? మా స్వామినీ! యశోదా! మేల్కొను.

ఆకాశ మధ్యమాన్ని భేదించి పెరిగి తన పాదాలతో లోకాలను కొలచిన నిత్యసూరి నాయకా! నిద్రింపక మేల్కొను.

ఎర్రని బంగారు కడియాన్ని పాదంకు ధరించిన ఐశ్వర్యశాలీ! బలరామా! నీవును మీ తమ్ముడును మేల్కొనాలి.

వస్త్రం అనగా భగవన్ముఖ వికాసం నొసంగు శేషత్వం, పరబ్రహ్మం, పరమాకాశం.

నీరు – భోగ్యతా బుద్ధి లేకుండుట – పారతంత్ర్యం పొందవలెనని శ్రద్ధ, విరజానదీ జలం.

అన్నం – భగవత్కైంకర్యం, నిష్కృష్ట ఆత్మస్వరూప జ్ఞానం, బ్రహ్మానుభవం

నందగోపాలం – ఆచార్యుడు

యశోద – మంత్రం



మంత్రాలలో విష్ణు షడక్షరి వాసుదేవ ద్వాదశాక్షరి అష్టాక్షరులు ముఖ్యులు. వాటిలో అష్టాక్షరి శ్రేష్ఠమైనది.

వామనుడు నారాయణ మంత్రార్థంను వివరించెను.

సర్వశూన్యవాదులు అగు వేదబాహ్యులను నిరసించి సర్వజగద్వ్యాపకమగు భగవత్తత్త్వం కలదని తన అస్తిత్వాన్ని అంతటా చూపింది వామనావతారం.

బలరామ పాదానికి తొడిగిన కడియం – భగవచ్ఛేషత్వం.

కడియం గల బలరాముని పాదం – భాగవత శేషత్వం.

– డా|| బాలుశర్మ పన్నాల (వేద పండితులు)

నేడు సఫల ఏకాదశి



మార్గమాసంలో కృష్ణపక్షంలో వచ్చే సఫల నామం గల ఏకాదశి రోజు విధిగా నారాయణుని పూజించాలని పండితులు అంటున్నారు. అందుచేత నాగులలో శేషనాగు, పక్షుల్లో గరుడపక్షి, దేవతల్లో శ్రీ కృష్ణ భగవానుడు, మనుష్యుల్లో బ్రాహ్మణుడు శ్రేష్ఠమైనట్టు ఏకాదశి శుభప్రదాయిని. ఏకాదశులలో సఫల ఏకాదశి ఫలప్రదమైంది. ఈ విధంగా సమస్త వ్రతాలలో ఏకాదశి తిథి శ్రేష్ఠమైనది. కాబట్టి సఫల ఏకదాశి రోజున ఫలాలతో విష్ణు మూర్తిని స్తుతించాలి. నారీఫలం(కొబ్బరికాయ), ఆకు, వక్కలు, నిమ్మపండు, దానిమ్మ పండు, రేగు ఫలాలతో దేవ దేవేశ్వరుడైన శ్రీహరిని పూజించాలి. ధూపదీపనైవేద్యాలు సమర్పించాలి. రాత్రి సమయాన నారయణుని నామజప తపాలను అందరితో కలిసి జాగరణ చేయాలి. జాగరణ చేసిన వచ్చే ఫలితం వేల సంవత్సరాల తపస్సుకు సమానం. ఈ సఫల ఏకాదశి వ్రతం చేసే వారికి శోకం కలుగదు.ఈ లోకంలో సుఖ భోగాలను అనుభవించి మరణానంతరం మోక్షాన్ని పొందుతారు. ఈ వ్రతం చేసిన వారి జన్మ ధన్యమవుతుంది. ఏకాదశి వ్రత మహిమను చదివినా, వినినా, రాజసూయ యజ్ఞ ఫలం లభిస్తుందని పూర్వికులు చెబుతున్నారు.

జరగవలసింది జరిగే తీరుతుంది



చాణక్యం

శ్లో|| తాదృశీ జాయతే బుద్ధి ర్వ్యవసాయోఽపి తాదృశః।
సహాయాస్తాదృశా ఏవ యాదృశీ భవతవ్యతా||

తన భవిష్యత్తు ఏమి కానున్నదో దానికి తగిన బుద్ధియే కలుగును. వ్యవసాయము (ప్రయత్నము, ఉపాయము) దానికి దగినట్లే ఉండును. సాయపడేది కూడా అలాగే సంభవించునని చాణక్య నీతి శాస్త్రంలోని తార్పర్యం. ఇంకనూ వివరించాల్సి వస్తే మనుష్యుడు వర్తమాన కాలంలో పూర్వజన్మ ఫలములను అనుభవించును. భాగ్యమేమిటంటే!

పూర్వజన్మ కృతం కర్మ తద్దైవమితి కథ్యతే||

పూర్వజన్మలో చేసిన కర్మఫలాలనే అదృష్టం, భాగ్యము అంటారు. కావలసినది ఏదైనా ఉంటే అది జరిగి తీరుతుంది. శ్రీరాముడు బుద్ధిమంతుడైనా బంగారులేడి వెంట పరుగెత్తెను. దీనికి మహానాటకంలోని ఒక శ్లోకంలో వివరించారు.

శ్లో|| అసంభవం హేమమృగస్య జన్మ తథాఽపి రామో లులుభే మృగాయ।
ప్రాయః సమాపన్న విపత్తికాలే ధియోఽపి పుంసాం మలినీ భవన్తి||

బంగారులేడి ఉండటమనేది అసంభవమని తెలిసి కూడా శ్రీరాముడు లోభగుణం కలవాడై బంగారులేడి వెంట బడెను. దీనివల్ల తెలిసినదేమంటే ఆపదలు కలిగే సమయంలో మనుషుల బుద్ధి మాలిన్యమై ఆలోచనాశక్తి కోల్పోతుంది. లక్ష్మణుడు కూడా అన్నతో ఇలా తన అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు. అన్నా! ఇది మారీచుని మాయవలె నాకు తోస్తున్నదని అని లక్ష్మణుడు చెప్పాడు. కానీ తమ్ముని మాట వినకుండా శ్రీరాముడు బంగారు లేడి వెంట బడుట జరుగవలసి వచ్చింది. దీని వలన జరగవలసింది తప్పక జరుగుతుంది. ఇంక వేరే విధంగా ఎలా జరుగుతుంది అని లక్ష్మణుడు తెలియచేస్తున్నాడు. చాణక్యుని నీతిశాస్త్రంలో ఇలా చెబుతోంది. పూర్వజన్మ సుకృతాన్ని అనుసరించి జరగవలసింది మంచి అయినా, చెడు అయినా జరిగి తీరుతుందని, ఇంతకు మించి మరేమీ జరగదంటున్నారు. చెడు జరిగేది రాసి పెట్టిం ఉంటే పరిస్థితులు కూడా అనుకూలంగా రాకుండా చెడుమార్పులు గోచరిస్తూ అలాగే ఉంటుంది తప్ప మరే మార్పులు గోచరమవదు. అది మంచి జరగవలసి ఉండినట్లయితే దీనికి సంబంధించిన ఫలితాలు కూడా అలాగే రూపుదాల్చుకుని మంచి పనులే జరుగుతాయి. వీటినే పూర్వజన్మలో చేసుకున్న పాపపుణ్యాలని అంటూంటారు.

పురాణ క్విజ్

తెలిసినవేంటో తేల్చుకోండి! తెలియనివన్నీ తెలుసుకోండి..

1. దేవకీదేవిగా జన్మించింది ఎవరు?
2. కశ్యప ప్రజాపతిని గోవులు కాచేవాడికి జన్మించమని శాపం ఇచ్చింది ఎవరు?
3. వామనుడు ఎవరికి రక్షకుడయ్యాడు?
4. ఉపనిషత్తులు ఎన్ని?
5. బుద్ధుని ధ్యానంలో మనసును దేనిపై కేంద్రీకరించాలి?
6. బ్రహ్మసూత్రాలను రాసిందెవరు?
7. దశావతారాల్లో కృష్ణావతారం ఎన్నోది?
8. శ్రీశైల శిఖరాన్ని చూస్తే ఏ ఫలం కలుగుతుంది?
9. తిరుమలలో స్వామి పుష్కరిణి ఎక్కడ నుంచి వచ్చింది?
10. కుశధ్వజుని కుమార్తె?

సమాధానాలు

1. అదితి
2. బ్రహ్మ
3. బలిచక్రవర్తి
4. 108
5. శ్వాస
6. వేదవ్యాసుడు
7. ఎనిమిదవది
8. పునర్జన్మ ఉండదు
9. వైకుంఠం
10. మాండవి




త్యాగంతో అమృతత్త్వం

గీత అనే పదాన్ని తిరగేసి చదివితే తాగీ అవుతుంది. బెంగాలీలో తాగీ అంటే త్యాగమని, గీతాసారం అంతా త్యాగమేనని. కేవలం త్యాగం ద్వారా మాత్రమే అమృతత్వం సిద్ధిస్తుందని ఉపనిషత్తులు ఘోషిస్తున్నాయి.

పూర్వం ఒక ఊరిలో ఒక సాధువుగారి ప్రవచనం పూర్తికాగానే అందరూ లేచి వెళ్లిపోయారట కానీ ఒక వ్యక్తి మాత్రం ఇంకా కూర్చునే ఉన్నాడు. ఆ సాధువు అతనిని 'ఏం నాయనా! ఏమైనా కావాలా?' అని అడిగారు. అప్పుడతడు 'స్వామీ! ఇందాకటి నుండి మీరు చెప్పినదంతా బాగానే అర్థం అయ్యింది కానీ అదేదో త్యాగం అని మాటిమాటికీ చెప్పారు. అంటే ఏమిటి స్వామీ?' అని అడిగాడు. అతని వాలకం చూస్తే పశువులుకాసే వాడిలాగా ఉన్నాడని, ఆ సాధువు అతనికి అర్థమయ్యే ఉదాహరణలతోనే విషయాన్ని వివరించాలని 'నీ దగ్గర రెండు ఆవులు ఉన్నాయనుకో, ఒక ఆవును ఎవరికైనా ఇచ్చేస్తావా?' అని అడిగారు. దానికతడు 'ఓ! తప్పకుండా ఇస్తాను స్వామీ!' అన్నాడు. కానీ అతని ముఖం చూస్తే ఇంకా పూర్తిగా విషయం అర్థం అయినట్లు అనిపించకపోవడంతో మళ్ళీ 'నీ దగ్గర రెండు గేదెలు ఉన్నాయనుకో, ఒక గేదెను ఎవరికైనా ఇచ్చేయగలవా?' అని అడిగారు. దానికి కూడా అతడు 'ఓ! తప్పకుండా ఇచ్చేస్తాను స్వామీ!' అన్నాడు. ఇక ఆ సాధువు మరింత ఉత్సాహంతో 'అలాగే నీ దగ్గర రెండు మేకలు ఉన్నాయనుకో, ఒక మేకను ఎవరికైనా ఇచ్చేస్తావా?' అని అడిగారు. వెంటనే అతడు కంగారుగా 'అలా ఎలా కుదురుతుంది స్వామీ? నేను ఇవ్వను' అన్నాడు. ఊహించని ఈ సమాధానంతో ఖంగుతిన్న ఆ సాధువు 'ఏం నాయనా! ఆవుని, గేదెని ఇవ్వడానికి ఆనందంగా ఒప్పుకున్నవాడివి చిన్న మేకను ఇమ్మంటే కుదరదంటావే?' అని అడిగారు. అందుకతడు 'మరి నా దగ్గర నిజంగానే రెండు మేకలున్నాయి స్వామీ! అందులో ఒకటి ఇచ్చేస్తే నేనేమైపోవాలి?' అని అడిగాడు.

మన త్యాగం కూడా ఇలాగే ఉంటుంది. మన దగ్గర లేనివి, ఉన్నా మనవి కానివి త్యాగం చెయ్యడానికి మనం బాగానే ఉత్సాహం చూపిస్తాం. కానీ మనదైన ఏ చిన్న విషయాన్ని కూడా మనం త్యాగం చేయలేం. త్యాగం అనగానే చాలామంది 'నా తను మన ధనాలను సర్వస్వాన్నీ త్యాగం చేయడానికి నేను ఎప్పుడూ సిద్ధమే' అంటూ ఉంటారు.



భగవద్గీతాసారం

అయితే ఇందులో తనువు మన సొంతం కాదు కదా! మన తల్లిదండ్రుల దగ్గర నుండి చెరో కణాన్ని తీసుకొని ముందుగా తల్లి అందించిన ఆహారం ద్వారా, ఆ తరువాత ఎందరో రైతులు పండించి అందించిన ఆహారం ద్వారా మన శరీరం ఇంతగా ఎదిగింది.

ఇక మనస్సు కూడా తనువుతో పాటుగా వచ్చినదే. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఇంకా సంఘంలో మనకు పరిచయమైన ప్రతివ్యక్తి నుండి కొంత కొంతగా జ్ఞానాన్ని, అనుభవాలను గ్రహిస్తూ ఇంతగా ఎదిగింది.

ఇక మనకున్న సంపద అంతా ఈ మనవి కాని తనువును, మనస్సును ఉపయోగించి సంపాదించుకున్నదే కదా. అయినా మనం పుట్టక ముందు మనవి కానివి, పోయేటప్పుడు మనతో తీసుకుపోలేనివి అయిన ఈ తను మన ధనాలను త్యాగం చేస్తే మనకు అమృతత్వం ఎలా సిద్ధిస్తుంది?

మరి జన్మజన్మలనుండి మనతో వచ్చేవి, మనకు మాత్రమే సొంతమైనవి ఏవి?

అవే విషయ వాసనలు, కర్మలు.

కేవలం వాటిని త్యాగం చేయడం ద్వారా మాత్రమే అమృతత్వాన్ని పొందగలం.

'అదేమిటండీ? విషయ వాసనలు అంటే అవి విషయాలకు సంబంధించినవి కదా? మన సొంతం ఎలా అవుతాయి?' అని మనకు సందేహం రావచ్చు. అయితే మనం 'రంపపు పొట్టు' అంటాం కదా! ఇది ఎక్కడ నుంచి వచ్చింది? దేనికి చెందినది? రంపానికి చెందినదైతే కాదు. చెక్క రంపానికి తనను తాను వశపరచుకోవడం ద్వారా ఆ చెక్కనుండి వచ్చిన పొట్టునే మనం రంపంపొట్టు అంటున్నాం. అలాగే విషయ వాసనలు కూడా విషయాల నుండి వచ్చినవి కావు. ఆ విషయాలకు మనను మనం వశపరచుకోవడం ద్వారా మనలో కలిగే వాసనలే విషయ వాసనలు. ఇవి మనలను జన్మజన్మలకు వెంటాడుతాయి, మళ్ళీ మళ్ళీ జన్మలకు కారణమవుతాయి. అందుకే వీటిని త్యాగం చేయటమంటే మనం విషయాలకు లొంగిపోకుండా ఉండగలగటమే. అలాగే కర్మలను త్యాగం చేయటమంటే ఏ పనీ చేయకుండా కూర్చోవటం కాదు. అలా కూర్చోవటం కూడా ఒక పనే కదా! అసలు కర్మ చేయకుండా ఉండటం ఏ ప్రాణికీ సాధ్యం కాదు. మరి మనం ఇందులో త్యాగం చేయగలిగినది ఏమిటి? అంటే, మనం కర్మ ఫలాన్ని త్యాగం చేయాలి. ముందుగా 'కర్మ చేసేది నేను కాదు, ఇది నాతో భగవంతుడు చేయిస్తున్నాడు' అనే విశ్వాసంతో కర్తృత్వ అహంకారం తొలగిపోతుంది. అలాగే 'ఈ కర్మద్వారా నేను పొందగోరేది ఏదీ లేదు. నాకు ఎప్పుడు ఏది అవసరమో అప్పుడు అది భగవంతుడే ప్రసాదిస్తాడు. నేను కేవలం ఆయన ఆజ్ఞతోనే ఈ కర్మ చేస్తున్నాను' అనే సర్వసమర్పణ భావనతో భోక్తృత్వ అహంకారం తొలగిపోతుంది. ఈ రెండూ తొలగిపోతేనే కర్మఫలాన్ని, విషయ వాసనలను త్యాగం చేయగలుగుతాం. అప్పుడే మనకు అమృతత్వం సిద్ధిస్తుంది.


-డా|| బాలుశర్మ పన్నాల (వేద పండితులు)

'అణో రణీయాన్, మహతో మహీయాన్'

ఈ ఉదయం పదిన్నర గంటలకు పట్నం నుండి శౌంఠి రామమూర్తిగారు, వారి భార్య, సోదరుడు, మరి కొందరు స్నేహితులతో వచ్చారిక్కడికి. వారు వచ్చేసరికి ఒక భక్తుడు ఏదో గ్రంథం చదువుతూ భగవంతులనిట్లా ప్రశ్నించాడు. "ఈ పుస్తకంలో 'అన్నము మనము తింటాము. అన్నము మనలను తింటుంది" అని రాశారే, అదెట్లా? మనం అన్నం తింటాం సరే, అన్నం మనలను తింటుందంటే ఏమిటి?" అని అడగటం, భగవాన్ మౌనం వహించటం జరుగుతున్నది. రామమూర్తి గారిదంతా గమనిస్తూ కూర్చున్నారు.

పది నిమిషాలు పలుకకుండా ఉండి తమ సోదరుడు భగవద్దర్శనాభిలాషి కావటమే తమ ఈ రాకకు కారణమనీ, పదేళ్ల క్రిందట ఒకసారి దర్శించితిననీ చెప్పి అంతకుముందే అక్కడి భక్తులడిగిన ప్రశ్నను పురస్కరించుకొని ఇట్లా మనవి చేశారు రామమూర్తిగారు.

'అన్నమువల్లనే (భోగ్యపదార్థముల సహాయం వల్లనే) సర్వ భూతములు ఉత్పత్తి స్థితిలయాదులను చెందుచుండుటవలన అన్నమే బ్రహ్మమంటారు. ఆ బ్రహ్మమే అంతటా ఆవరించి ఉంటుంది. అన్ని వస్తువులు దాని ప్రతిబింబం కావటం వల్ల, అన్నమని దానికే అనగా ఆ బ్రహ్మమునకే పేరు కాబట్టి ఆ అన్నం మనలను తింటుంది అని గదా అర్థం. ఇప్పుడు వీరడిగిన ప్రశ్నకిదే గదా జవాబు' అని వారంటే 'అవు'నన్నారు భగవాన్.



ఇంకా వారు సైన్సును బట్టి ఇంగ్లీషులోనే మాట్లాడారు. వారి తమ్ముడున్నూ కొంచెం సేపు ఆటంబాంబును గురించీ, ఇంకా ఏమేమో సైన్సు, సైన్సంటూ ఇంగ్లీషులోనే మాట్లాడారు. నాకేమో ఇంగ్లీషు రాదాయె. భగవాన్ మాత్రం తెలుగులోనే ప్రత్యుత్తరం చెప్పటం వల్ల తెలిసిందేదో రాస్తున్నాను. సైన్సు ప్రకారం వారు చెప్పినదంతా వినివిని 'అవునండీ, ఇదేదైనా తన్ను విడిచి లేదుగదా? తానున్న వెనుక అన్నీ ఉన్నవి. తాను లేనని ఎవరూ చెప్పరు. దేవుడు లేడనే నాస్తికుడైనా తాను న్నానని ఒప్పుకుంటాడు. అందువల్ల ఏది వచ్చిన తనలోనుంచే రావాలి. తనలోనే అణగాలి. ఏదైనా తనకు భిన్నంగా లేదు. 'అణోరణీయాన్, మహతో మహీయాన్' అన్న శ్రుతి వాక్యాన్ననుసరించి మహత్తుకు మహత్తుగా ఉండేది అదే. అణువులో అణువుగా ఉండేదీ అదేనన్నారు భగవాన్. 'ఈ అణువుకు, మహత్తుకు భేదం దేన్ననుసరించి వస్తుంద'దని ప్రశ్నించారు మూర్తిగారు. 'దేహాన్ననుసరించే వస్తుం'దన్నారు. 'మరి లోకంలో ఇన్ని రకాల శక్తులు గోచరిస్తాయే. ఒకదానిననుసరించి మరొకటిగా, అదేమీ?' అన్నారు వారు. 'మన స్సేనండి కారణం. ఆ మనస్సే ఇన్ని రకాల తోస్తుంది. అది పుట్టగానే అన్నీ పుడతాయి. పంచభూతాలో, భూతాల కవతల ఉండే శక్తులో, ఏమైనా సరే, ఆ మనస్సు పుడితే సరి, అన్నీ పుడతాయి, అది అణిగితే అన్నీ అణుగుతాయి. అన్నిటికీ అదే కారణం" అన్నారు భగవాన్.

-సూరి నాగమ్మ (శ్రీరమణాశ్రమ లేఖలు)

ధర్మ సందేహాలకు సమాధానాలు

హయగ్రీవుని గురించి తెల్పండి?

శ్రీ మహావిష్ణువు ఒక యుద్ధం చేసి అలసిపోయి పడుకొన్నాడు. ఆయన ధనుస్సు తాడు తెగి కంఠం తెగిపోయింది. దేవతలంతా ఆలోచించి 'అశ్వశిరస్సు'ను అతికించారు. 'హయగ్రీవుడు అనే రాక్షసుడు తన రూపంలో ఉన్నవారితోనే మరణిస్తానని' వరం పొందాడు. అందుకే శ్రీ మహావిష్ణువు హయగ్రీవునిలా అశ్వముఖం గల రూపాన్ని ధరించాడు. పై సంఘటన జరగడానికి మూలం ఇదే.

ఈ హయగ్రీవరూపంతో రాక్షస సంహారం చేసాడు మహావిష్ణువు. విద్యలకు అధిపతిగా హయగ్రీవుణ్ణి భావిస్తారు. శ్రీలలితా సహస్రనామ స్తోత్రం హయగ్రీవుడే అగస్త్యునికి చెప్పడం జరిగింది.



– డా|| పి.భాస్కరయోగి

చింతామణి దీక్షిత్

(జననం-సుమారు 1658)

వేద విజ్ఞానం

చింతామణి దీక్షిత్ పీష్వాల కాలంలో విఖ్యాతి చెందిన ఒక ఖగోళ శాస్త్రవేత్త. శక.1658లో జన్మించినట్లు, శక. 1733లో మరణించినట్లు తెలు స్తోంది. ఆ రోజుల్లో పీష్వాలు ఈయనకు రూ.125/–లు జీవనభృతిగా ఇచ్చేవారు. ఈయన సతారా నివాసి. సూర్యసిద్ధాంతానికి పట్టికలు కూర్చాడు. శక.1713లో 'గోళానంద' మనే గ్రంథం సంకలనం చేశాడు. ఇందులో వివిధ ఖగోళ పరిశీలనలకు ఉపయోగించే పరికరాల విశేషాలు ఉన్నాయి. దీని వివరాలు "వేద ప్రకరణ" అధ్యాయంలో విశదీకరింపబడ్డాయి. దీనికి యజ్ఞేశ్వర అనబడే బాబా జోషిరోడ్ వ్యాఖ్యానం రాయడం జరిగింది. చింతామణి వారసులు సతారాలో ఈనాటికి కూడ ఉన్నారు. ఈ రచయిత (దీక్షిత్) శక.1809లో చింతామణి దీక్షిత్ మనుమడైన భావుదీక్షిత్ సింప్లూకర్‌ను కలుసుకోవడం జరిగింది. ఆయన చెప్పిన వివరాలనుబట్టి, ఆ గ్రంథములో చెప్పిన విషయాలను బట్టి, పై అంశములు తెలియచేశాయి. ఇత్తడితో చేసిన గోళానంద పరికరము అతని వద్ద ఉన్నట్లు, ఆ పరికరము ప్రత్యక్ష పరిశీలనలు చేయడానికి వీలుగా సతారాలో దిక్కులు స్థిరీకరించినట్లు, అతను తెలియచేశాడు. గోళానందంలో చెప్పిన విషయాలను బట్టి, చింతామణి వత్స గోత్రీకుడు, తండ్రి పేరు వినాయకుడు, వీరి అసలు స్వస్థానం చిప్లూణ్.

భాగం-67

-డా|| రేమెళ్ల అవధానులు

ఓటరు లిస్టులో యువత పేర్లు నమోదు చేసుకోవాలి : ఎమ్మెల్యే

విజయక్రాంతి, అంబర్‌పేట్ : అర్హులైన యువకులు అందరూ తమ పేర్లను ఓటరు లిస్టులో నమోదు చేసుకోవాలని అంబర్‌పేట్ నియోజకవర్గం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. సోమవారం అంబర్‌పేట్ డివిజన్ య్యాహమద్‌నగర్‌లో ఓటరు నమోదు కార్యక్రమాని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేరు వెంకటేష్ పాల్గొని మాట్లాడుతూ ప్రజా స్వామ్యంలో ఓటు ఆయుధం అని దానిని సక్రమంగా వినియోగించుకునే బాధ్యత యువతపై ఉందన్నారు. కార్పొరేటర్ పులి జగన్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో యువతకు లభిస్తున్న ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు లవంగు ఆంజనేయు లు, మలేష్ యాదవ్, విజయ్‌గౌడ్, రామరావుయాదవ్, సిద్ధార్థముదిరాజ్, మహ్మద్ యాసిన్, జాకిబాబు, వెంకట్, విష్ణువర్ధన్, శ్రీనివాస్‌గుప్త, కాలేరు నాగరాజు, సురి, నూజు, మహేష్, మోసిన్, మహేష్, మల్లేషాంచారీ తదితరులు పాల్గొన్నారు.



సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్

విజయక్రాంతి, ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజక వర్గం కవాడిగూడ డివిజన్ జ్యోతినగర్, ఎల్ సి గూడ, వైఎస్ఆర్ పార్క్, మై స్పోరట్స్‌లో స్థానిక సమస్యలపై, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ సోమవారం పాదయాత్ర చేస్తూ ప్రజా సమస్యలను స్థానికుల నుండి తెలుసుకున్నారు.

నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా ఎల్లవేళలా నేను మీకు అందుబాటులో ఉంటానని ప్రజలు నేరుగా తన దగ్గరకు వచ్చి సమస్యలు చెప్పుకోవాలని ఆ సమస్యను తీర్చడానికి ముందు ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కవాడిగూడ డివిజన్ అధ్యక్షులు వెంకటేష్, దీన్ దయాల్ రెడ్డి, కన్వీనర్ రమేష్ శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృపతుంగ విద్యార్థుల ప్రదర్శన

విజయక్రాంతి, హైదరాబాద్ : నగరంలో చారిత్రాత్రక విద్యాసంస్థల్లో ఒకటైన కర్ణాటక శిక్షణ సమితి నడుపుతున్న నృపతుంగ పాఠశాలలవార్షికోత్సవం పర్యావరణాన్ని కాపాడాలనే సందేశాన్ని చాటింది. ఈ అంశంపై ప్రైమరీ, హైస్కూల్ విద్యార్థులు వివిధ ప్రదర్శనలతో ప్రేక్షకులను ఆకట్టుకొని, ఆలోచింపచేశారు. ప్రకృతి ఒడిలో పెరిగిన బాహుబలి నుంచి బాధ్యుడినై ఉంటానంటూ భరత్ అనే నేను అనే పాటతో పర్యావరణం పై తమ బాధ్యతను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమానికి స్థానిక అంబర్ పేట ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా కాలేరు వెంకటేశ్ హాజరయ్యారు. కర్ణాటక శిక్షణ సమితి కార్యవర్గ సభ్యులు విఠల్ జోషి, కిషన్‌రావు, కులకర్ణి మీరా జోషి, బీంసేన్ మండేవాలకర్, విశాల్ జోషి గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. హైస్కూలు ప్రిన్సిపల్ సుజాత, ఉపాధ్యాయులు చిన్నారులను అభినందించారు.





కిడిజీ స్కూల్ మాదాపూర్‌లో నిర్వహించిన పిల్లల రైతు బజార్



ఏపీ హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు శుభాకాంక్షలు

విజయక్రాంతి, ఉప్పల్ : ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన జస్టిస్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని ఈసీఐ ఎల్ కమలానగర్‌కు చెందిన హైకోర్టు న్యాయవాది సుంకర నరేష్ ఆధ్వర్యంలో సోమవారం న్యాయవాదులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరగను న్న చీఫ్ జస్టిస్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి ప్రమాణస్వీకార కార్యక్రమానికి వారు తరలివెళ్లారు. కార్యక్రమంలో న్యాయవాదులు పి.శశికిరణ్, డి.ప్రవీణ్‌రెడ్డి, శ్రీనినాథ్, జూపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్ మౌలాలీలో మురుగునీరు రోడ్డుపై ప్రవాహంలా పారుతోందంటూ 'విజయక్రాంతి'లో ప్రచురించిన వార్తకు స్పందించిన అధికారులు తక్షణ మరమ్మతులు చేపట్టారు. 'విజయక్రాంతి' వల్ల తమ సమస్య పరిష్కారమైందని స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఫొటో : రామ్

భారీగా డ్రగ్స్ పట్టివేత

విజయక్రాంతి, హైదరాబాద్: నూతన సంవత్సర వేడుకలను టార్గెట్ చేసుకొని అక్రమదందాకు సిద్ధమైన అంతరాష్ట్ర డ్రగ్స్ ముఠా గుట్టును వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. నూతన సంవత్సర వేడుకల్లో డ్రగ్స్ సరఫరాపై నిఘా పెట్టిన పోలీసులు భారీగా డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. జోసెఫ్ అలమేధ, శంకర్ అనే ఇద్దరు అంతరాష్ట్ర డ్రగ్స్ మాఫియా సభ్యులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 10లక్షల విలువైన 89 గ్రాముల కొకైన్, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు పూర్వాపరాలను హైదరాబాద్ సీపీ అంజనీకుమార్ తెలిపారు. ఈ ముఠాను అరెస్ట్ చేయడంలో కీలకంగా వ్యవహరించిన పోలీసు అధికారులను సీపీ అభినందించారు. ఒక్కో గ్రాము కొకైన్ ను పకడ్బందీగా ప్యాక్ చేశారు. ఇలా సుమారు రూ.10 లక్షల విలువైన కొకైన్ ను పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. స్వాధీనం చేసుకొన్న కొకైన్‌ను ల్యాబ్‌కు పోలీసులు పంపారు. ల్యాబ్ రిపోర్టు మత్తుపదార్థాలుగా ధృవీకరించినట్లు ఆయన తెలిపారు.

తలాక్ బిల్లుపై చర్చ లేకుండానే.. రాజ్యసభ వాయిదా

(మొదటి పేజీ తరువాయి) రాజ్యసభ ప్రతిపక్ష నేత గులాం నబీ ఆజాద్ కోరారు. 'ఇది చాలా ప్రాముఖ్యమైన బిల్లు. కొన్ని కోట్ల మంది ప్రజల జీవితాలపై ఈ బిల్లు అనుకూల లేదా ప్రతికూల ప్రభావం చూపుతోంది. అటువంటి ముఖ్యమైన బిల్లును సెలక్ట్ కమిటీ పరిశీలించకుండా ఆమోదింపజేయాలని చూడటం తగదు' అని ఆజాద్ పేర్కొన్నారు.

సెలెక్ట్ కమిటీకి పంపాలని కాంగ్రెస్ సహా 10పార్టీల పట్టు

అన్ని ప్రతిపక్ష పార్టీలు కూడా తలాక్ బిల్లును సెలక్షన్ కమిటీకి పంపించాలని ఏక పక్షంగా నిర్ణయం తీసుకున్నాయని తృణమూల్ కాంగ్రెస్ నేత డెరెక్ ఓ బ్రెయిన్ తెలిపారు. తలాక్ బిల్లుపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని కానీ కాంగ్రెస్ కావాలనే అడ్డంకులు సృష్టిస్తోందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి విజయ్ గోయల్ అన్నారు. లోక్సభలో బిల్లు ప్రవేశపెట్టిన సమయంలో కాంగ్రెస్ మద్దతు తెలిపింది. కానీ ఇప్పుడు మాత్రం అడ్డంకులు సృష్టిస్తోందని ఆయన ఆరోపించారు. ముస్లిం మహిళల హక్కులకు సంబంధించిన ముఖ్యమైన బిల్లు ఆమోదం పొందకుండా కాంగ్రెస్ ఇతర పార్టీలతో కలిసి రాజకీయం చేస్తోందని ఆయన మండిపడ్డారు. దీంతో పాటు కావేరి జలాలు, ఇతర అంశాల విషయంపై నేతలు ఆందోళనలకు దిగడంతో రాజ్యసభ జనవరి 2కి వాయిదా పడింది.

123 ఎంపీ స్థానాలపై 'మోదీ మిషన్'

- మార్చి వరకు 20 రాష్ట్రాల్లో మోదీ ప్రచారం చేపట్టనున్నారు
- 2014లో ఓడిన 123 ఎంపీ స్థానాలపై ప్రత్యేక దృష్టి

(మొదటి పేజీ తరువాయి) మరోవైపు 2014 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ పోటీ చేసి ఓటమిపాలైన 123 నియోజకవర్గాలపై పార్టీ ఈసారి ప్రత్యేక దృష్టిపెట్టింది. 'మిషన్ 123' పేరుతో ఈ 123 నియోజకవర్గాలను 25 క్లస్టర్లుగా విభజించి.. ఒక్కో క్లస్టర్ బాధ్యతలను ఒక్కో నాయకుడికి అప్పజెప్పింది. ఇక తొలిసారి ఓటర్లను ఆకర్షించేందుకు 'నేషన్ విత్ నమో' నెట్వర్క్‌ను జనవరి 12న ప్రారంభించనుంది. ఆయా ప్రాంతాల్లో అత్యంత ప్రభావవంతమైన యువకులను గుర్తించి వారి ద్వారా ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేయనుంది. దీంతో పాటు బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్ షా బూత్ స్థాయిలో కార్యకర్తలను బలోపేతం చేసేందుకు సిద్ధమయ్యారు. ఇక జనవరి 11, 12 తేదీల్లో ఢిల్లీ వేదికగా పార్టీ నేషనల్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటుచేశారు. దాదాపు 15000 మంది బీజేపీ నేతలు, కార్యకర్తలు ఈ సమావేశంలో పాల్గొననున్నారు. జిల్లా స్థాయి కార్యకర్తలను కూడా ఈ సమావేశానికి ఆహ్వానిస్తోంది.

ఏఐసీసీ అధికార ప్రతినిధిగా దాసోజు

విజయక్రాంతి, హైదరాబాద్: టీపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి, ప్రధాన కార్యదర్శి దాసోజు శ్రవణ్‌ను అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) అధికార ప్రతినిధిగా నియమించారు. ఈ మేరకు ఏఐసీసీ కమ్యూనికేషన్ ఇన్‌ఛార్జి రణదీప్ సింగ్ సుర్జేవాలా సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డాక్టర్ దాసోజు శ్రవణ్‌తో పాటు రాజ్యసభ సభ్యులు డాక్టర్ సయ్యద్ నసీర్ హుస్సేన్, పవన్ ఖేరా, జైవీర్ షెర్గిల్, రాగిని నాయక్, డాక్టర్ గౌరవ్ వల్లభ్, రాజీవ్ త్యాగీ, అఖిలేష్ ప్రతాప్ సింగ్, సునీల్ అహిరె, శాసనసభ్యులు హినా ఖవారేలను ఏఐసీసీ అధికార ప్రతినిధులుగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ నియమించారు.





బతుకమ్మ చీరల పంపిణీ చేస్తున్న ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి- విజయక్రాంతి, ఎల్‌బీ నగర్

ప్రతి పంటకూ డిమాండ్



(మొదటి పేజీ తరువాయి) పండించాలి. మిగులు కూరగాయలను సమీపంలోని నగరాలు/పట్టణాలకు సరఫరా చేయాలి" అని సీఎం అన్నారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బ్రహ్మాండంగా వుందని, గత నాలుగు సంవత్సరాల్లో సగటున 17.17 శాతం వృద్ధి రేటును సాధించామని, ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 29.97 శాతం వృద్ధిరేటు వుందని, జీఎస్డీపీలో ప్రథమ స్థానంలో వున్నామని ముఖ్యమంత్రి అన్నారు. వచ్చే ఆయిదేళ్లలో రూ. 10 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేయబోతున్నామని, అన్నీ విధాల మన పెరుగుదలకు అవకాశాలున్నాయని, అందుకే మూస పద్ధతిలో ఆలోచించకుండా నూతన వరవడికి సిద్ధం కావాలని ముఖ్యమంత్రి అన్నారు. ఈ సమావేశంలో జరిగిన చర్చల ప్రాతిపదికన ఆలోచనలు పంచుకుని ఎలా ముందుకు పోవాలో నిర్ణయించాలని అధికారులను కోరారు.

మహిళా బృందాలతో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు

ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ ఒక సామూహిక ప్రయత్నమని, మహిళా బృందాలతో పాటు పలువురిని ఇందులో భాగస్వాములను చేయాలని సీఎం చెప్పారు. తొలుత ఒక ఆరేడు మండలాలను పైలట్ పద్ధతిన తీసుకుని కార్యక్రమం ప్రారంభించాలని, ఆ తరువాత పెద్ద ఎత్తున ప్రారంభించొచ్చని సిఎం చెప్పారు. ఈరోజు జరిగిన సమీక్ష ఆధారంగా అధికారులు వివిధ స్థాయిల్లో మేధో మదన కార్యక్రమాలను, వర్క్ షాపులను నిర్వహించాలని సిఎం సూచించారు.

కేంద్ర ప్రభుత్వ పరంగా ఫుడ్ ప్రాసెసింగ్‌లో అమలు పరుస్తున్న కార్యక్రమాలను అధ్యయనం చేయాలని, అలానే అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమకు సంబంధించిన అంశాలను కూడా అధ్యయనం చేయాలని సిఎం సూచించారు. ఎంత ఖర్చు పెట్టడానికైనా ప్రభుత్వం వెనకాడదని, ఉత్తమ స్థాయి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపన పూర్వ రంగంలో ప్రపంచంలో ఎక్కడికైనా వెళ్లి అధ్యయనం చేసి రావొచ్చని సిఎం సూచించారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమకు సంబంధించిన ఒక కార్యాచరణ పథకాన్ని రూపొందించాలని అధికారులను ఆదేశించారు. 45 లక్షల మంది సభ్యులున్న 4 లక్షలకు పైగా ఐకేపి మహిళా సంఘాల సభ్యులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని సిఎం చెప్పారు. పంట కాలనీల ఏర్పాటు, విత్తన కంపెనీల నియంత్రణ, కల్తీ విత్తనాల అమ్మకం పూర్తిగా నిషేధం, విత్తనాలు విరివిగా అందుబాటులో వుంచడం, అవసరమైన ఎరువులు, క్రిమి సంహారక మందులు అందుబాటులో వుంచడం జరగాలని చెప్పారు ముఖ్యమంత్రి. నాటు యంత్రాలు, కలుపుతీసే యంత్రాలు, పసుపు రైతులకు అవ్వాల్సిన యంత్రాల విషయంలో కార్యాచరణ రూపొందించాల్నారు. ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు రాజీవ్ శర్మ, ప్రధాన కార్యదర్శి ఎస్.కె. జోషి, ఆర్థిక శాఖ కార్యదర్శి రామకృష్ణారావు, సిఎంఓ అధికారులు నర్సింగ్ రావు, భూపాల్ రెడ్డి, స్మితాసబర్వాల్, డీజీపి మహేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు అనురాగ్ శర్మ, మాజీ మంత్రి చెరుకు ముత్యం రెడ్డి, టీఎస్ఐఐసి చైర్మన్ గ్యాదరి బాలమల్లు, శాసనమండలి చీఫ్ విప్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు మహేశ్వర్ రెడ్డి, ఆనంద్, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి, పరిశ్రమల ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, వ్యవసాయ ఉద్యానవన శాఖ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

ఈవీఎంల ట్యాంపరింగ్‌పై హైకోర్టుకు వెళ్తాం

(మొదటి పేజీ తరువాయి) కాంగ్రెస్ పార్టీ నేతలు ఇంకా తేరుకోలేదు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ కుంతియా సోమవారంనాడు గోల్కొండ హోటల్‌లో అతి తక్కువ ఓట్లతో ఓటమి పాలైన అభ్యర్థులతో పాటు కాంగ్రెస్ ముఖ్యులతో సమీక్ష నిర్వహించారు.

రాష్ట్రంలోని 31 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు తక్కువ ఓట్లతో ఓటమి పాలయ్యారు. 31 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలైన ఓట్లకు కౌంటింగ్ అయిన ఓట్లకు మధ్య కూడ తీవ్ర వ్యత్యాసం ఉండడంతో ఈ విషయమై కూడ న్యాయ నిపుణులతో కాంగ్రెస్ పార్టీ నేతలు చర్చించారు. ఈవీఎంలపై కాంగ్రెస్ పార్టీ నేతలు అనుమానాలను వ్యక్తం చేశారు. దీంతో కోర్టుకు వెళ్లేందుకు అవసరమైన ఆధారాలను కూడ కొందరు నేతలు ఈ సమావేశంలో కుంతియాకు చూపారు.ఇప్పటికే మల్‌రెడ్డి రంగారెడ్డి ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గ ఫలితంపై కోర్టును ఆశ్రయించారు. ఇదే తరహాలో మిగిలిన 31అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూడ కాంగ్రెస్ నేతలు కోర్టులను ఆశ్రయించాలని భావిస్తున్నారు. ఈ నియోజకవర్గాల్లో పోలైన ఓట్లకు కౌంట్ చేసిన ఓట్లకు మధ్య ఎందుకు తేడా ఉందని కాంగ్రెస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయాలన్నింటిపై ఆధారాలతో సహా కోర్టుకు వెళ్లాలని కాంగ్రెస్ పార్టీ నేతలు భావిస్తున్నారు.

అధికార దుర్వినియోగంతో కేసీఆర్ గెలిచారు: కుంతియా

ఎన్నికల్లో డబ్బులు వెదజల్లి, అధికార దుర్వినియోగంతో కేసీఆర్ గెలిచారని తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జీ కుంతియా అన్నారు. ఓట్ల తొలగింపుపై ఎన్నికల తర్వాత అధికారులు క్షమాపణ చెప్పారని ఆయన గుర్తు చేశారు. ధర్మపురి, కోదాడ, ఇబ్రహీంపట్నంలో ఎన్నికల అక్రమాలకు పాల్పడ్డారని చెప్పారు. ఎన్నికల్లో టీఆర్ఎస్ అక్రమాలపై కమిటీ ఏర్పాటు చేస్తామని అన్నారు. కలెక్టర్లపై రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ఈసీకి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈవీఎంల ట్యాంపరింగ్‌పై హైకోర్టుకు వెళ్తామని అన్నారు. కేసుల్లో క్లీన్‌చిట్ కోసమే మోడీకి కేసీఆర్, నవీన్ పట్నాయక్ మద్దతు పలుకుతున్నారని కుంతియా ఆరోపించారు. ఇక టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ధర్మపురి, తుంగతుర్తి, కోదాడ, ఇబ్రహీంపట్నం తక్కువ ఓట్ల తో ఓడిపోయాము అక్కడ న్యాయం పోరాటం చేస్తామని తెలిపారు. అంతే కాకుండా గెలిచిన ఎమ్మెల్యేలు రానున్న పంచాయతీ ఎలక్షన్‌లో కాంగ్రెస్ పార్టీ గెలుపు పై బాధ్యత తీసుకుంటారన్నారు. స్లిప్ లను లెక్కించాలని సుప్రీంకోర్టు చెప్పిన ఇప్పటి వరకు ఈసీ ఎందుకు స్పందించలేదని ఆయన ప్రశ్నించారు. మరోక వైపు బీసీ రిజర్వేషన్లు తగ్గించడం పై పోరాటం చేస్తామని ఉత్తమ్ స్పష్టం చేశారు. మరోవైపు సీఈవో రజత్ కుమార్‌పై కాంగ్రెస్ సీనియర్ నేత దామోదర రాజనర్సింహ ఫైర్ అయ్యారు. రజత్ నిర్ణయాలపై తమకు అనుమానాలున్నాయని, రైతుబంధు పథకం డబ్బులు నేరుగా బ్యాంకులో వేయాలని రజత్ కుమార్ ఎందుకు చెప్పారని ప్రశ్నించారు. పార్టీ ఓటమికి మాత్రం అందరం బాధ్యులమని సెలవిచ్చారు. ఈ సమావేశంలో కుంతియా, ఏఐసీసీ కార్యదర్శి సలీం, పీసీసీ చీఫ్ ఉత్తమ్, షబ్బీర్‌అలీ, సంపత్, దామోదర్రెడ్డి, అద్దంకి దయాకర్ పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు: ఉత్తమ్

తెలంగాణ లోని ప్రజలంతా కొత్త సంవత్సరంలో ఆనందంతో సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆకాంక్షించారు.

ఈ విషయమై ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేసారు. 2018 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పాత సంవత్సరంలో మంచిని కొనసాగిస్తూ నూతన సంవత్సరంలో మరింత మంచిగా ఉండాలని ఆయన అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు నూతనోత్తేజంతో వచ్చే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం పనిచేయాలని పిలుపు ఇచ్చారు.



సంక్రాంతి తర్వాత అమిత్ షా పర్యటన

(మొదటి పేజీ తరువాయి) సంగతి తెలిసిందే. ఈ ఎన్నికలకు సంబంధించి అన్ని రాష్ట్రాల పార్టీ నాయకత్వాన్ని సంసిద్ధం చేయడానికి అమిత్ షా పర్యటించనున్నారు.

ఈ నెలలో జాతీయ కౌన్సిల్

లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి పార్టీ జాతీయ కౌన్సిల్ సమావేశం ఢిల్లీలో జరగనుంది. ఈ నెల 11, 12 తేదీల్లో రామ్‌లీలా మైదానంలో జరిగే కౌన్సిల్ సమావేశానికి అన్ని రాష్ట్రాల నుంచి జిల్లాల అధ్యక్షులు, ఇన్‌చార్జ్‌లు వెళ్లనున్నారు. ఈ సమావేశంలో ఎన్నికలకు సంబంధించి జాతీయ నాయకత్వం దిశా నిర్దేశం చేయనుంది. అనంతరమే పార్టీ జాతీయ నాయకత్వం అన్ని రాష్ట్రాల పర్యటనకు సంబంధించి షెడ్యూల్ ఖరారు చేసుకోనుంది. ఇందులో భాగంగా తొలి పర్యటన తెలంగాణలో జరిగే అవకాశముందని తెలుస్తోంది. సంక్రాంతి పండుగ అనంతరం పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా హైదరాబాద్‌కు రానున్నారు. ఆయన పర్యటన ముగిసిన అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కూడా పర్యటించనున్నారు. నెలాఖరులో తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో మోడీ పర్యటిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి.



ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్‌ను రద్దు చేయాలి

- తెలంగాణ రాష్ట్ర బీసీ సంఘం డిమాండ్

విజయక్రాంతి, హైదరాబాద్: పంచాయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 34శాతం ఉన్న రిజర్వేషన్లను 22 శాతం తగ్గించి రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేస్తుందని తెలంగాణ రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికలలో బడుగు, బలహీన వర్గాల ఆశీర్వాదంతో అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ ప్రభుత్వం వారికి రాజ్యాధికారం దొరకకుండా చేస్తుందని ఆయన మండిపడ్డారు. బీసీలను రాజకీయంగా అణచివేసేందుకే పంచాయతీ ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లను తగ్గించారని దుయ్యబట్టారు. ఈ మేరకు ఉస్మానియా విశ్వవిద్యాలయం గెస్ట్‌హౌజ్‌లో బీసీ సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశం ఓయూ బీసీ సంఘం అధ్యక్షుడు స్వామిగౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాజుల శ్రీనివాస్‌గౌడ్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రికి రాత్రి ఆర్డినెన్స్‌ను తీసుకువచ్చి బీసీలకు రాజ్యాధికారం అందకుండా చేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రజా ఆశీర్వాద సభలు నిర్వహించారని, బీసీల ఆశీర్వాదం లేకుంటే టీఆర్ఎస్ పార్టీ గెలిచేదా అని ప్రశ్నించారు. . ఈ సమావేశంలో బీసీ సంఘం ఓయూ అధ్యక్షుడు స్వామిగౌడ్, నిరుద్యోగ ఫ్రంట్ చైర్మన్ చనగాని దయాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగం గౌడ్, క్రాంతి, శ్రీకాంత్, నాగరాజు, సాంబశివరావు, వెంకటేష్‌గౌడ్, బొగ్గుల కృష్ణ, బీసీ విద్యార్థులు పాల్గొన్నారు.



పి.వి.సింధుకు రాహుల్ అభినందన

విజయక్రాంతి, హైదరాబాద్: బాడ్మింటన్ ఛాంపియన్, ఒలంపిక్ మెడలిస్ట్ పి.వి.సింధు ఇటీవల బీడబ్లుఎఫ్ వరల్డ్ టూర్‌లో విజయానని సాధించినందుకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ అభినందనలు తెలిపారు. రెండు నేరుగా జరిగిన సెట్లలో సింధు జపాన్‌కు చెందిన నజోమి ఒకుహరను ఓడించి బీడబ్లుఎఫ్ వరల్డ్ టూర్ ట్రోఫీని గెలుచుకున్న తొలి ఇండియన్‌గా చరిత్ర సృష్టించారని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు రాహుల్ ప్రశంసా లేఖను ఏఐసీసీ సభ్యులు, టీపీసీసీ పరిశోధన విభాగం కార్యదర్శి అమీర్ జావెద్, గాంధీలు సింధుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సింధు దేశవ్యాప్తంగా క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. రాబోయే 2020 టోక్యో ఒలంపిక్స్‌లోనూ సింధు సత్తా చాటాలని వారు ఆకాంక్షించారు. టీపీసీసీ అధ్యక్షుడు కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి సింధును ఫోన్‌లో అభినందించారు. ఉమెన్ సింగిల్స్ వరల్డ్‌లో సింధు మూడవ ర్యాంకులో నిలవడం గర్వకారణమన్నారు.

బీసీ రిజర్వేషన్ల అంశం జాతీయస్థాయికి..

విజయక్రాంతి, ముషీరాబాద్: తెలంగాణలో గ్రామ పంచాయితీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లు తగ్గిస్తూ జారీ చేసిన ఆర్డినెన్సు ఉపసంహరించుకోవాలని, హైకోర్టు రిజర్వేషన్లపై ఉన్న ఇంటీరియమ్ స్టే ఆర్డర్ ను వెకేట్ చేయించి అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకు వెళ్ళి ప్రధానమంత్రి తో చర్చలు జరిపి రాజ్యాంగ సవరణ బిల్లు పెట్టాలని అఖిలపక్ష సమావేశంలో నేతలు డిమాండ్ చేసారు. 112 బీసీ కుల సంఘాల సమావేశం హైదరాబాద్ లకడీకపూల్ సెంట్రల్ కోర్ట్ హోటల్‌లో జరిగింది. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షులు ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు 2010 లో వచ్చింది. కానీ 2013లో గ్రామ పంచాయతీ ఎన్నికలు, 2014 లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ మున్సిపల్ ఎన్నికలను కాంగ్రెస్ ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లతో జరిపిందన్నారు. బీసీలు పోరాడి 34 శాతం రిజర్వేషన్లు కాపాడుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఆర్.కృష్ణయ్య నాయకత్వంలో జరిగే ఏ పోరాటాల కైనా కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఉంటుందని అన్నారు. ప్రభుత్వం సుప్రీంకోర్టులో వేసిన కేసును ఎందుకు ఉపసంహరించుకున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు. గ్రామపంచాయితీ ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లను తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారి చేసిన ఆర్డినెన్సు ఉపసంహరించుకోవాలని అఖిల పక్షం నాయకులు, 112 బీసీ కులాలు ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు కు విజ్ఞప్తి చేశామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య అన్నారు.

నేటి నుంచి విడివిడి హైకోర్టులు

- విభజన పిటిషన్ సత్వర విచారణకు సుప్రీం నో
- హౌస్‌మోషన్ పిటిషన్‌పై అత్యవసర విచారణ చేపట్టని సుప్రీంకోర్టు
- కొత్త ఏడాది నుంచి అమరావతిలో ఏపీ హైకోర్టు పనిమొదలు
- జనవరి 2న తిరిగి తెరుచుకోనున్న సుప్రీం
- అమరావతికి తరలిన 900 మంది కోర్టు సిబ్బంది

న్యూఢిల్లీ: ఉమ్మడి హైకోర్టు విభజనకు లైన్ దాదాపుగా క్లియర్ అయింది. భవన నిర్మాణం పూర్తయ్యేవరకు హైకోర్టు విభజనను నిలిపివేయాలంటూ దాఖలైన హౌస్ మోషన్ పిటిషన్‌పై సత్వరమే విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు ధర్మాసనం నిరాకరించింది. జనవరి 2వ తేదీన సుప్రీంకోర్టు తిరిగి తెరుచుకోనుంది. ఆ రోజున ఈ పిటిషన్ పై విచారణ చేపడతామని సుప్రీంకోర్టు పేర్కొన్నట్లు తెలుస్తోంది. మరో వైపు తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టుకు ఈ రోజే (సోమవారమే) ఆఖరి రోజు. దీంతో హైకోర్టు విభజన ప్రక్రియ యథాతథంగా కొనసాగనుంది. సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం విభజన ప్రక్రియ సాగనుంది. మంగళవారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

మరోవైపు ఉమ్మడి హైకోర్టు విభజన, తరలింపు ప్రక్రియకు అనుమతిస్తూ.. సుప్రీంకోర్టు జారీచేసిన నోటిఫికేషన్ను సవాల్ చేస్తూ ఏపి హైకోర్టు న్యాయవాదుల సంఘం పిటిషన్ వేసింది. సుప్రీంకోర్టు రిజిస్టర్ వద్ద దాఖలైన ఈ పిటిషన్‌పై జనవరి 2న విచారణ చేపట్టనున్నట్టు సుప్రీంకోర్టు పేర్కొంది.

తరలివెళ్లిన ఏపీ హైకోర్టు సిబ్బంది..

మరోవైపు ఏపీకి సిబ్బందిని, లాయర్లను తరలించేందుకు అమరావతి నుంచి ప్రత్యేక బస్సులను పంపించారు. ఈరోజు సాయంత్రం ఏపీ చేరుకోనున్న న్యాయమూర్తులకు విజయవాడలోని ఓ హోటల్లో బస ఏర్పాట్లు చేశారు. రేపు ఉదయం అమరావతిలో ఇందిరాగాంధీ స్టేడియంలో గవర్నర్చే ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. భవన నిర్మాణం పూర్తయ్యేవరకు హైకోర్టు విభజనను నిలిపివేయాలంటూ ఏపీ న్యాయవాదులు దాఖలుచేసిన హౌస్ మోషన్ పిటిషన్ను సుప్రీంకోర్టు నిరాకరించిన నేపథ్యంలో న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారానికి లైక్ క్లియరైంది.

ఉమ్మడి హైకోర్టు విభజనకు చివరి అంకం కూడా ముగిసింది. సోమవారం ఉదయం కొద్ది సమయం ఉమ్మడి హైకోర్టులోని న్యాయమూర్తులు తమ విధులు నిర్వహించారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తులందరూ కలిసి ప్రధాన భవనం వద్దకు చేరుకున్నారు. ఏపీ హైకోర్టుకు కేటాయించిన 14 మంది న్యాయమూర్తులకు తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు వీడ్కోలు పలికారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, ఇతర తెలంగాణ న్యాయమూర్తులు ఏపీకి వెళుతున్న న్యాయమూర్తులకు వీడ్కోలు చెప్పారు. ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ సి.ప్రవీణ్కుమార్కు పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా వీడ్కోలు పలికారు.

ఆంధ్రా ప్రాంతానికి వెళ్తున్న న్యాయమూర్తులు, న్యాయాధికారులు, సిబ్బంది, న్యాయవాదులకు తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయాధికారులు, సిబ్బంది, న్యాయవాదులు ఘనంగా వీడ్కోలు పలికారు. జనవరి 1వ తేది నుంచి రెండు హైకోర్టులుగా విడిపోనుండటంతో ఒకవైపు హడావిడి మరోవైపు సహచరులు వెళ్లిపోతుండటంతో ఉద్విగ్న వాతావరణం నెలకొంది.

నేడు ప్రమాణ స్వీకారం చేయనున్న కొత్త సీజేలు

కొత్త సంవత్సరం 2019 జనవరి 1 నుంచి అమరావతిలో ఏపీ సీఎం క్యాంపు కార్యాలయంలో హైకోర్టు ప్రారంభం అవుతుంది. మంగళవారం ఉదయం 8.30 గంటలకు రాజ్భవన్లో గవర్నర్ నర్సింహన్ తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్తో ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ఆ తర్వాత గవర్నర్ హెలికాప్టర్లో గవర్నర్ విజయవాడ వెళ్లి ఉదయం 10.30 గంటలకు ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ప్రవీణ్కుమార్తో విజయవాడ ఇందిరా గాంధీ స్టేడియంలో ప్రమాణ స్వీకారం చేయిస్తారు. రెండు రాష్ట్రాలకు ప్రధాన న్యాయమూర్తులతోసహా 14 మంది చొప్పున న్యాయమూర్తులతో తెలుగు రాష్ట్రాలకు విడివిడిగా హైకోర్టులు ఏర్పడతాయి.

2018 రివైండ్

- దేశ రాజకీయాల్లో కీలక పరిణామాలు
- సుప్రీం కోర్టు సంచలన తీర్పులు
- కన్నుమూసిన వాజ్‌పేయి, కరుణానిధి వంటి ప్రముఖులు

విజయక్రాంతి, హైదరాబాద్: కాల గమన చక్రంలో మరో ఏడాది కాలగర్భంలో కలిసి పోయింది. ఈనేపథ్యంలో 2018 ఏడాదిలో జరిగిన కొన్ని ముఖ్య సంఘటనలు గుర్తు చేసుకుందాం..

దేశ రాజకీయాల్లో ముఖ్య ఘటనలు..

2018లో మొత్తం 9 రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్, కర్నాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మిజోరాం, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు వినూత్న తీర్పు ఇచ్చారు. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ సొంతంగా అధికారం ఏర్పాటు చేయగా కర్నాటకాలో జేడీఎస్‌తో కలిసి సంకీర్ణ సర్కార్‌ను ఏర్పాటు చేసింది. త్రిపురలో బీజేపీ తొలిసారి ప్రభుత్వం ఏర్పాటు చేయగా, నాగాలాండ్‌లో ఎడీపీపీ, మేఘాలయాలో ఎన్‌పీసీ, మిజోరంలో మిజో నేషనల్ ఫ్రంట్ అధికారంలోకి వచ్చాయి. ఇక తెలంగాణలో ముందస్తు ఎన్నికలకు వెళ్ళిన టీఆర్ఎస్ పార్టీ 88 స్థానాల్లో విజయం సాధించడంతో కేసీఆర్ రెండోసారి సీఎం అయ్యారు. కాగా 2018లో కేంద్రంలోని బీజేపీకి మిత్ర పక్షాల నుంచి వ్యతిరేకత వ్యవమైంది. ఎన్టీయే కూటమి నుంచి తెలుగు దేశం పార్టీ బయటకు రాగా, 2019 ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేస్తామని శివసేన ఇప్పటికే స్పష్టం చేసింది. అలాగే అయోధ్యలో రామ మందిరాన్ని నిర్మాణం కోసం ఆర్డినెన్స్ జారీ చేయాలని డిసెంబర్6న అక్కడ నిర్వహించిన ధర్మసభ వేదికగా బీజేపీకి అల్టిమేటమ్ ఇచ్చింది. కాగా బీహార్‌లో మాత్రం 2014లో దూరమైన జేడీయూ తిరిగి ఎన్టీయే కూటమి పంచన చేరింది.

2018లో కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ఎన్టీయే ప్రభుత్వం తొలిసారి నోకాన్ఫిడెన్స్ మోషన్ ఎదుర్కొంది. ప్రధాని మోడీకి వ్యతిరేకంగా చేసిన కాంగ్రెస్ చేసిన ఈ తీర్మానానికి పలు విపక్ష పార్టీలు మద్దతిచ్చాయి. అయితే దీన్ని 325 మంది సభ్యులు వ్యతిరేకించగా 126 మంది మాత్రమే మద్దతు పలకడంతో తీర్మానం వీగిపోయింది. కాగా కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ లోక్‌సభలో ప్రధాని మోడీని హత్తుకోవడం అనంతరం తమ పార్టీ ఎంపీల వైపు తిరిగి కన్నుకొట్టడం హైలైట్‌గా నిలిచింది. మరోవైపు 2019 సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కాంగ్రెస్ నేతృత్వంలో కేంద్రంలో మహాకూటమి ఏర్పాటుకు గట్టి ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే విపక్ష పార్టీల్లో భిన్నాభిప్రాయాల నేపథ్యంలో దీనిపై ఇంకా స్పష్టత రాలేదు. కాగా దక్షిణాది రాష్ట్రాల్లో కీలకమైన తమిళనాడులో నటుడు కమల్ హాసన్ ఫిబ్రవరి నెలలో ఎంఎన్ఎం పార్టీని స్థాపించారు. సూపర్ స్టార్ రజనీ కాంత్ కూడా రాజకీయాలపై ఆసక్తి చూపినా ఎన్నికల్లో పోటీపై ఇంకా స్పష్టత ఇవ్వలేదు. కాగా తమిళరాజకీయాల్లో కురువృద్ధుడైన డీఎంకే అధ్యక్షుడు కరుణానిధి ఆగస్టు 7న కన్నుమూయగా, బీజేపీ కురువృద్ధుడు, మాజీ ప్రధాని వాజ్‌పేయి ఆగస్టు 16న తుదిశ్వాస విడిచారు.

సెప్టెంబర్‌లో సుప్రీం కోర్టు సంచలన తీర్పులు


2018లో సర్వోన్నత న్యాయస్థానం పలు సంచలన తీర్పులిచ్చింది. భారత్‌లో స్వలింగ సంపర్కం నేరం కాదంటూ సెప్టెంబర్ 6న తొలి కీలక తీర్పు ఇచ్చింది. క్రిమినల్ కేసులు ఎదుర్కొనే రాజకీయ నేతల సభ్యత్వం రద్దయ్యేలా చట్టం చేయాలంటూ సెప్టెంబర్ 25న రెండో కీలక తీర్పు ఇచ్చింది. ప్రభుత్వ ఉద్యోగుల పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీల రిజర్వేసన్ వర్తింపుపై అపీల్‌ను సెప్టెంబర్ 26న తిరస్కరించింది. అలాగే అదే రోజు ఆధార్‌పై కీలక తీర్పు ఇచ్చింది. బ్యాంకు ఖాతాలు, మొబైల్ కనెక్షన్లు, స్కూళ్లో అడ్మిషన్లకు ఆధార వర్తించదని స్పష్టం చేసింది. అలాగే ప్రైవేట్ సంస్థలు ఆధార్‌ను అడగవద్దని పేర్కొంది. న్యాయవ్యవస్థలో పారదర్శకత కోసం కోర్టు వ్యవహారాలను ప్రత్యక్ష ప్రసారం చేయాలని సెప్టెంబర్ 26న నిర్ణయించింది. అలాగే అయోధ్యపై అన్ని అపీళ్ళను సెప్టెంబర్ 27న కొట్టివేసింది. 2010లో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపైనే విచారణ జరుపుతామని స్పష్టం చేసింది. మహిళ లైంగిక స్వేఛ్చను హరించే సెక్షన్ 497ను సెప్టెంబర్ 27న సుప్రీం కోర్టు కొట్టివేసింది. భార్యలు భర్తల ఆస్తి కాదని స్పష్టం చేసింది. కేరళలోని పవిత్ర శబరిమలలో అన్ని వయసు మహిళలకు ప్రవేశం కల్పిస్తూ సెప్టెంబర్ 28న సుప్రీం కోర్టు చారిత్రక తీర్పు ఇచ్చింది.

మోడల్ పోలీస్ స్టేషన్ ప్రారంభం


విజయక్రాంతి, చొప్పదండి: పోలీస్ స్టేషన్ల ఆధునీకరణలో భాగంగా రామడుగులో ఆధునీకరించబడిన పోలీస్ స్టేషన్‌ను సోమవారం రోజు చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసుల సేవలపై ప్రజల్లో విశ్వాసం పెంపొందుతుందని, ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో అన్ని వర్గాల ప్రజలతో సత్సంబంధాలు నెలకొంటున్నాయని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో సమస్యలు వేగంగా పరిష్కరించబడుతున్నాయని, గంగాధర పోలీస్ స్టేషన్‌ను అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రతిపాదనలు పంపాలని కమిషనర్‌ను కోరారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు తీసుకుంటున్న చర్యలను అభినందించారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ కమాలాసన్ రెడ్డి మాట్లాడుతూ పోలీస్ శాఖకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను కల్పిస్తుందన్నారు. మహిళల భద్రతకు ప్రాధాన్యతను కల్పిస్తామని, నేరుగా ఫిర్యాదుచేసే పని లేకుండా 100ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కుట్రలకు, మోసాలకు కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు: ఎంపీ గుత్తా

- ఏపీలో చంద్రబాబు ఓటమి తథ్యం



విజయక్రాంతి, నల్లగొండ: కుట్రలకు, మోసాలకు కేరాఫ్ అడ్రస్ నారా చంద్రబాబు నాయుడు అని రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు కుట్రలను, కపట నాటకాలను దేశ ప్రజలంతా గమనిస్తున్నారని, ముఖ్యమంత్రి కేసీఆర్ చంద్రబాబుపై మాట్లాడిన ప్రతి మాటా సరైనదే నని అన్నారు. రాష్ట్ర విభజనను వ్యతిరేకించానని స్వయంగా నిన్న మీడియా సమావేశంలో చంద్రబాబు స్పష్టం చేశారని, మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చంద్రబాబు డబ్బులు ఇవ్వలేదని తిరుపతి వెంకటేశ్వరస్వామిపై ప్రమాణం చేస్తారా అని ఆయన సవాల్ విసిరారు. చంద్రబాబు బీజేపీ ముసుగు వేసుకొని తిరుగుతున్నారని, కేసీఆర్ ప్రధాన మంత్రిని కలిస్తే అవహేళనగా మాట్లాడటం చంద్రబాబుకు తగదని, నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని ఆయన హితవు పలికారు. హైకోర్టు విభజన కూడా చంద్రబాబుకు ఇష్టం లేకనే ఇన్ని రోజులు ఆపారని, ఏపీ మంత్రులు తలా తోక లేకుండా మతిస్థిమితం తప్పి మాట్లాడటం ప్రజలు గమనిస్తున్నారని ఆయన అన్నారు. చంద్రబాబు కులాలను అడ్డం పెట్టి రాజకీయం చేస్తారని, అధికారం కోసం ఎన్ని అడ్డదారులైనా తొక్కే నీచమైన చరిత్ర చంద్రబాబుదని ఆయన విమర్శించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో 16 స్థానాలను కైవసం చేసుకొని ఢిల్లీలో నిర్ణయాత్మకంగా ఉంటామని ఆయన తెలిపారు. యావత్ తెలంగాణ ప్రజలు కేసీఆర్ వెంట ఉన్నారని, దానికి రుజువే మొన్న జరిగిన ఎన్నికలని ఆయన అన్నారు. రాజధాని ఏర్పాటు విషయంలో ఆంధ్ర ప్రజలను చంద్రబాబు మోసం చేశారని, అమరావతి అనువైన స్థలం కాదని నిపుణులు చెప్పినా చంద్రబాబు బలవంతంగా అమరావతిలోనే ఏర్పాటు చేశారని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో ఏపీలో చంద్రబాబుకు ఓటమి తథ్యమని ఆయన జోస్యం చెప్పారు. బీసీలకు అనుకూలమైన ఏకైక ప్రభుత్వం టీఆర్ఎస్ ప్రభుత్వమని, కాంగ్రెస్ గుంపును కలుపుకొని బీసీ రిజర్వేషన్‌పై నాటకాలు ప్రారంభించిందని, కేసీఆర్‌ను బదనాం చేయడానికే కాంగ్రెస్ డ్రామాలకు తెర లేపిందని ఆయన తెలిపారు. బీసీల పక్షపాతి సీఎం కేసీఆర్ అని, బీసీ ఉద్యమ నాయకుడు ఆర్.కృష్ణయ్య కూడా కాంగ్రెస్ బుట్టలో పడి ఆగమయ్యాడని ఆయన విచారం వ్యక్తం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, నల్లగొండ శాసనసభ్యుడు కంచర్ల భూపాల్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్, పుల్లెంల వెంకటనారాయణగౌడ్, పట్టణాధ్యక్షుడు అబ్బగోని రమేష్, తదితరులు పాల్గొన్నారు.



ప్రణాళికాబద్ధంగా నీటిని వినియోగించాలి: కలెక్టర్

విజయక్రాంతి, పెద్దపల్లి: ఎస్సారెస్పీ నీటిని ప్రణాళికాబద్ధంగా ఉపయోగించాలని జిల్లా కలెక్టర్ దేవసేన పేర్కొన్నారు. సోమవారం పెద్దపల్లి కలెక్టరేట్‌లో నీటి వినియోగంపై ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితో కలిసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ప్రాజెక్టులో నీరు తక్కువగా ఉన్నందున గ్రామసభల ద్వారా నీటి లభ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. జనవరి 15 నుంచి నీటి విడుదల జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే దాసరిమనోహర్‌రెడ్డి మాట్లాడుతూ, 5 తడులకు నీరందించాలని కోరారు. 8 రోజులు ఆన్, 12 రోజులు ఆఫ్ పద్ధతిన నీరు సరఫరా చేయాలని కోరారు. 116వ పాయింట్ వద్ద కనీసం రెండువేల క్యూసెక్కుల నీరు వస్తే రైతులకు నీరందించే అవకాశముంటుందన్నారు. అవసరమైతే సీఎంతో చర్చించి మరింత నీరు వచ్చే విధంగా కృషి చేస్తానని అన్నారు. ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి, సీఈ బి.శంకర్, ఎస్‌ఈ సతీష్‌కుమార్, జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు కోట రాంరెడ్డి, జిల్లా అధికారులు, ఈఈలు, డీఈఈలు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించని సర్కారు

- బీజేపీ నేత బండి సంజయ్

విజయక్రాంతి, వేములవాడ: ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించడంలో టీఆర్ఎస్ సర్కారు పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండి సంజయ్ అన్నారు. వేములవాడ నియోజకవర్గంలోని చందుర్తి మండలం లింగంపేట గ్రామానికి చెందిన గొంటి సునీల్ బైక్‌పై నుంచి పడి మృతి చెందగా, ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21న సునీల్ ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి పడ్డాడు. తీవ్ర గాయాల పాలైన అతనని సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లారు. పండుగ పేరిట వైద్యులు, సిబ్బంది వేడుకలు చేసుకొని క్షతగాత్రుడిని పట్టించుకోకపోవడంతో మృతి చెందాడని తెలిపాడు. విధుల పట్ల నిర్లక్ష్యం, ఒకరి మృతికి కారకులైనా వైద్యులపై, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పేదోడంటే ప్రతి ఒక్కరికి చిన్న చూపేనని, టీఆర్ఎస్ సర్కారు పాలనలో నిరుపేదలకు ఓరిగింది ఏమీ లేదన్నారు. సునీల్ మృతికి కారకులైన వారిపై వెంటన చర్యలు తీసుకోకుంటే బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని అన్నారు. అనంతరం సునీల్ కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

ప్రజాసేవలో ముందుండాలి: భట్టి విక్రమార్క మల్లు



విజయక్రాంతి, మధిర: మధిర నియోజకవర్గ పరిధిలోని మర్లపాడు, సైదెల్లిపురం గ్రామాల్లో వివిధ పార్టీల నుంచి పలువురు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, స్థానిక ఎమ్మెల్యే భట్టి సమక్షంలో పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. వందేళ్లకి పైగా చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీకి గెలుపోటములు ఎన్నో వచ్చాయని, గెలుపునకు పొంగిపోవడం, ఓటమికి నిరాశచెంది అధైర్యపడాల్సిన పని లేదని హితవు పలికారు. పార్టీకి వెన్నెముకగా ఉన్న క్యాడర్ గ్రామస్థాయిలో ప్రజాసేవలో ముందుండాలని సూచించారు. రోబోయే పంచాయతీ ఎన్నికల్లో ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేసే వారినే పార్టీ రహితంగా ఎన్నుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు

2019 నూతన ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు అలాగే రాష్ట్ర ప్రజానీకానికి భట్టి విక్రమార్క శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ ఏడాది ప్రజలకు సుఖ సంతోషాలను అందించి ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలిగించాలని కోరుకుంటున్నట్లుగా ఆయన తెలిపారు.

ఈ ఏడాదంతా శుభమే జరగాలి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, కలెక్టర్ అమయ్‌కుమార్



విజయక్రాంతి, సూర్యాపేట: నూతన ఏడాదిలో ప్రజలంతా సుఖసంతోషాలతో వుండాలని మాజీ మంత్రి, సూర్యాపేట నియోజకవర్గ శాసనసభ్యులు గుండకండ్ల జగదీశ్‌రెడ్డి ఆకాంక్షించారు. నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని సోమవారం నియోజకవర్గంతో పాటు జిల్లా ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాదంతా ప్రజలంతా శుభప్రదంలో ఉన్నారని, ఈ ఆంగ్ల సంవత్సరాదిలో కూడా ప్రజలు అంతకంటే మెరుగ్గా ఉండాలని కోరారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున ప్రభుత్వ పథకాలతో ప్రజల జీవితాల్లో మరింత ఆనందోత్సవాలు వెలువడనున్నట్లు ఆయన పేర్కొన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ సోమవారం జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందే విధంగా తమ కర్తవ్యాన్ని నిర్వహిస్తానని ఈ నూతన సంవత్సర వేడుకల సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులతో పాటు, అన్ని సామాజిక వర్గాల ప్రజలకు, సిబ్బందికి, తదితరులకు శుభాకాంక్షలు తెలిపారు.




మున్సిపల్ కార్మికుల సమ్మె

విజయక్రాంతి, చొప్పదండి: జీఓ 14 ప్రకారం వేతనలు ఇవ్వాలని జనవరి 8వ తేదీ నుంచి జరిగే మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె పోస్టర్‌ను సోమవారం రోజు చొప్పదండి మున్సిపల్ కార్మికులతో కలిసి సీఐటీయూ జిల్లా కార్యదర్శి బండారి శేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు గత ఐదు నెలలుగా జీతాలు లేక పస్తులుంటూ, అప్పులు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకువస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికి అనేక సార్లు ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకువెళ్ళినా కార్మికుల వేతనాలు ఇవ్వటం లేదన్నారు. అందుకే జనవరి 8వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి పోతున్నట్లు తెలిపారు.

శుభాకాంక్షలు తెలిపిన రాజకీయ ప్రముఖులు

విజయక్రాంతి, యాదాద్రి: యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజలకు జిల్లాలోని వివిధ పార్టీల ప్రముఖులు స్థానిక ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు పి.వి. శ్యాంసుందర్ రావు, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ 2019 సంవత్సరాన్ని పురస్కరించుకొని ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2019లో జిల్లా అభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా పాటుపడి విద్యారంగం, వైద్యరంగంలో యాదాద్రి భువనగిరి జిల్లాను అగ్రగామిగా నిలిపే ప్రయత్నాలు చేస్తామన్నారు. జిల్లాలోని ప్రధాన సమస్య నిరుద్యోగమని, దీని నుండి యువతకు విముక్తి కలిగేలా ప్రయత్నాలు చేసి రాష్ట్రంలో యాదాద్రి జిల్లాను ఆదర్శ జిల్లాగా మార్చుకోవాలన్నారు.




మునుగోడు శాసనసభ్యులు రాజగోపాల్‌రెడ్డికి అభినందనలతో పాటు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ మాజీ పీసీసీ కార్యదర్శి తంగళ్లపెల్లి రవికుమార్

మత్స్యకారుల జీవితాలు మెరుగుపడాలి: చిరుమర్తి

విజయక్రాంతి, నకిరేకల్: నకిరేకల్ నియోజకవర్గంలో ఉన్న మత్స్యకారుల జీవితాలు మెరుగుపడాల్సిన అవసరం ఉందని స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నియోజకవర్గంలోని రామన్నపేట మండలంలో సోమవారం రోజున మత్స్య పారిశ్రామిక సంఘం నూతన భవనాన్ని ప్రారంభించన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో చేపల వృత్తిని నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్న వారు పెద్ద సంఖ్యలో ఉన్నారని, వారి ఆర్థిక స్థితి అంతంత మాత్రమే ఉంటుందని అన్నారు. ఈ ప్రాంతం మూసీ పరివాహక ప్రాంతం కావడంతో అనేక చెరువుల ద్వారా చేపలను పట్టి జీవిస్తున్నారని అన్నారు. రామన్నపేటలో రూ. 25 లక్షలతో చేపల మార్కెట్‌ను ఏర్పాటు చేయిస్తానని అన్నారు. నూతనంగా నిర్మించిన పారిశ్రామిక భవనంలో అసంపూర్తిగా ఉన్నా పనులను పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ ప్రాంతాన్ని పట్టి పీడిస్తున్న ధర్మారెడ్డి, పిలాయి పల్లి కాలువల నిర్మాణం త్వరితంగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటానని లింగయ్య హామీ ఇచ్చారు.



జనవరి 2న టీఎన్‌జీవోల స్పోర్ట్స్ మీట్


- 7న డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

విజయక్రాంతి, మెహిదీపట్నం: టీఎన్‌జీవోల హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశం ఎస్.ఎం హుస్సేన్(ముజీబ్) అధ్యక్షతన సోమవారం నాడు సంఘ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో అధ్యక్షుడు ముజీబ్ మాట్లాడుతూ.. జనవరి 2న టీఎన్‌జీవో స్పోర్ట్స్ మీట్ ప్రారంభోత్సవం ఉదయం 9 గంటలకు ఎల్‌బీ స్టేడియంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలి చైర్మన్ స్వామిగౌడ్, ఎస్.వేణుగోపాలాచారి, శ్రీనివాస్‌గౌడ్, జి.దేవీప్రసాద్‌రావు, డా.శ్రీధర్, బాబాఫసీయుద్దీన్, కలెక్టర్ రఘునందన్‌రావు, కే.రవీందర్‌రెడ్డి, రాజేందర్ పాల్గొననున్నారని తెలిపారు. జనవరి 7న డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణను మల్లేపల్లి ఐటీఐ కళాశాలలో సాయంత్రం 5 గంటలకు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



















ధూమపానం మానితే..

కొత్త సంవత్సరంలో కొందరు వారికున్న అలవాట్లను మానేయాలని అనుకుంటారు. ధూమ పానం, మద్యపానం లాంటివి మానటానికి రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. కొత్త సంవత్సరం సందర్భంగా పొగతాగడం మానేయాలని నిశ్చయించుకుని అచరణలో సఫలమయిన వారు మద్యం తాగడం కూడా మానేస్తారని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పొగతాగడం మానేయడానికి ప్రయత్నించే మందుబాబులు మెల్లగా ఆల్కహాల్‌ను తీసుకోవడం తగ్గిస్తారని ఓ అధ్యయనం వెల్లడిస్తోంది. మద్యం తాగటం మానితే రోజూ పొగతాగే అలవాటు తగ్గుతుందని తెలుపుతున్నారు. మందుబాబులపై చేపట్టిన పరిశోధన వివరాలను అమెరికాలోని ఒరెగాన్ స్టేట్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సారా డెర్మోడి వెల్లడించారు. సిగరెట్ల వినియోగం ముఖ్యంగా మద్యం తాగే వారిలో ఎక్కువగా ఉంటుంది. ఈ రెండింటి మధ్య సంబంధాలను కనుగొనడానికి 22 మందిపై కొన్నివారాల పాటు పరిశోధన చేశారు. మద్యం మానేయడానికి చికిత్స పొందుతున్న వారి నికోటిన్ మెటబోలైట్ నిష్పత్తి, నికోటిన్ మెటబాలిజం ఇండెక్స్‌ను అధ్యయనం చేశారు. వారి నికోటిన్ మెటబోలైట్ రేటు వారంలో సగటున 29 నుంచి 7 కు తగ్గేలా చేశారు. దీంతో వారిలో మద్యపానం తగ్గిపోయింది. నికోటిన్ మెటబోలిజం రేషియో అధికంగా ఉన్న మందుబాబులు ఎక్కువ పొగతాగుతారని, ఎక్కువ సమయం పొగతాగడానికే కేటాయిస్తారని పరిశోధనలో తేలింది. నికోటిన్ మెటబోలిజం రేషియో తగ్గించడం ద్వారా పొగతాగే అలవాటును మాన్పించవచ్చని సారా పేర్కొన్నారు. నికోటిన్ మెటబోలైట్ రేషియోలో సూచించినట్లు నికోటిన్ జీవక్రియను మారుస్తుందని ధూమపానం, మద్యపానం మానేయడానికి తోడ్పడుతుందన్నారు. అధిక నికోటిన్ మెటబోలైట్ నిష్పత్తి గల వ్యక్తులు ధూమపానం విడిచిపెట్టడం కష్టం అయినా, నికోటిన్ ప్రత్యామ్నాయ చికిత్స ఉత్పత్తులను ఉపయోగించడం ద్వారా వారు ధూమపానం వదిలేయడంలో సహాయపడుతాయని సారా డెర్మోడి తెలిపారు.

కోటి ఆశల కొత్త సంవత్సరం

గుండెలందున లే గులాబీ దండలను పండించుతూ...
పెదవులందున నవరసాల రసాలనే ఊరించుతూ....
పాతగిల్లిన భూతలమ్మున లేత సొంపులు నింపుతూ...
వీక్షణమ్ముల ముందు వ్రాలిన ఈ క్షణం మధురక్షణం!!

ఎన్ని ఎన్ని ఎడారులందున ఎంతగా తపియించెనో...
ఎన్ని ఎన్ని శిలాతలాలను ఈదుకుంటూ వచ్చెనో...
ఎన్ని మంచు తుపానులందున కుంచుకుని తపియించెనో..
వీక్షణమ్ముల ముందు వ్రాలిన ఈ క్షణం మధురక్షణం!!

మహాకవి దాశరథి జాలువార్చిన భావోద్వేగభరిత వాక్యాలు నవ సంవత్సర నవనవోన్మేషానికి నిలువుటద్దాలు. పగలు పొగల తరువాత ప్రభాకరుడు అస్తంగతుడైనట్టు ఒక వత్సరం మలిగిపోయి, మరో వత్సరం వెలుగులీనే ఘనమైన ఘడియ రానేవచ్చింది. సూర్యుడి తొలి వెలుగు కిరణాలు ఇలాతలాన్ని తాకుతూ కొత్త సంవత్సరం రాకడను ప్రకటించే మహత్తర మూహూర్తం రానే వచ్చింది. గతం చాపను చుట్టబెట్టి, మళ్లీ ఆశల తలుపులు, ఆకాంక్షల కిటికీలు తెరిచి, వెలుతురు ప్రసరింపచేసే ఆ క్షణం రానే వచ్చింది. పాత సంవత్సరంలోని చేదును మరిచిపోయి, తీపికి మురిసిపోయి, 2019లోకి కోటి ఆశలతో అడుగుపెట్టే ఆ సమయం రానేవచ్చింది.

కొత్త సంవత్సరం అంటే కొత్త క్యాలెండర్‌ని మేకుకు తగిలించడం కాదు. పాత డైరీని అటకెక్కించి, కొత్త డైరీలో 'శ్రీరామ నీవే కలవు' అని వ్రాసుకోవడం కాదు. కొత్త సంవత్సరం అంటే మంచి ప్రారంభం. సవాళ్లు, సమస్యల సాగరంలో ఈదులాడుతూ దూరపు దీపస్తంభాన్ని చూసి ధైర్యం తెచ్చుకోవడమే కొత్త సంవత్సరం. చీకటి దుప్పట్లను తోసి పారేసి, చలి పులి కోరలను లెక్కించి మరీ కొంగొత్త ఊహల చలిస్నానం చేసేయడమే కొత్త సంవత్సరం. గుప్పెడు మంచిని గులాల్ లా చల్లేసి, మన చుట్టూ రంగుల మయం చేసే రస స్పృహే కొత్త సంవత్సరం. వంద పరాజయాల తరువాత కూడా కోటి గెలుపులను కోరుకునే సమధికోత్సాహమే కొత్త సంవత్సరం.

నవ యువ భారతం నయా ఇతిహాసాన్నివ్రాసే బంగారు ఘుడియలను ఆవిష్కరించే సంకల్పం నేడు కావాలి. కుల, మత, వర్గ, వర్ణ వైషమ్యాలకు తావు లేని నవ భారతాన్ని ముందుకు నడిపించే ఆదర్శం నేడు కావాలి. పురోగతే తప్ప తిరోగతి లేని నడక, నడత నేడు కావాలి. పెను మార్పుల పొత్తిళ్లలో ఉన్న భారత దేశానికి ప్రాణధారలు పోసి పెంచి, పెద్ద చేసే త్యాగమయ వ్యక్తిత్వాలు కావాలి. ఒక్క జీవితానికి ఒక్క లక్ష్యమనే సేవావ్రతులు కోకొల్లలు గా కావాలి. పదవులు, ప్రశంసలకు అతీతంగా, పేర్లు, ప్రఖ్యాతులకు దూరంగా దేశమే దేవాలయంగా, సమాజమే దేవుళ్లుగా భావించి, అనునిత్యారాధన చేసే పురోహితులు కావాలి. 'శివుడే తానై, శివుని కొలిచినటు దేశదేవతారాధనము' చేసే తపస్వులు కావాలి. ఈ నవ సంవత్సరం ఆ తపస్వులు తామరతంపరగా పుట్టుకొచ్చే పొత్తిలి కావాలి.

గతేడాది మంచి చూశాం. చెడు చూశాం. ఈ ఏడాదీ మంచి చూస్తాం. చెడునూ చూస్తాం. కానీ ఎగ్గుకు పొంగక, లగ్గుకు కుంగక నిరంతర సాధనను కొనసాగించే అజస్ర శ్రేణుల సహస్య శ్వాసల సమన్విత శక్తే దేశాన్ని ముందుకు నడిపిస్తుంది. ఆ సజ్జన శక్తిని పెంచి, ప్రాచ్యపు ఆధ్యాత్మికతను, పాశ్చాత్యపు నవ చైతన్యాన్ని మేళవించి, దేశాన్ని కదిలించే, పెను నిద్దుర వదిలించే చైతన్యం ప్రభుతను, జనతను ప్రచలనం చేయిస్తుంది. ఉత్కర్ష సాధనకై కొత్త ఏడాది, కొత్త ఉద్రేకంతో, కొత్త ఉద్వేగంతో ముందుకు సాగుదాం.

ఈ విజయ యాత్రలో ముందకునడిచే యావజ్జాతికి విజయక్రాంతి కుటుంబం తరపున నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు!! ఈ యాత్రలో మేమూ మీ సహయాత్రీకులం!!

విద్య వ్యక్తిత్వ వికాసానికి ఉపకరించాలి


మానవుడిలో సహజంగా ఉన్న పరిపూర్ణత్వాన్ని ప్రకటించేదే విద్య. మనస్సును ఏకాగ్ర పరిచి, మనిషిని తన కాళ్ళ మీద తాను నిలపడేటట్లు చేసేదే నిజమైన విద్య. ముందు ఒక సేవకుని మాదిరి ప్రవర్తించటం నేర్చుకో, విధేయుడవై ఆజ్ఞాపాలన చెయ్యడం ముందు నేర్చుకో. తరువాత నాయకుడవటానికి అర్హుడవవుతావు.

విద్యాలయాలు పరీక్షా కేంద్రాలుగా మిగిలితే లాభం లేదు. సొంత ఆలోచనా ధోరణి నేర్పేవే నిజమైన విద్యాలయాలు. విశ్వవిద్యాలయాలు గుమాస్తాలను తయారు చేసే యంత్రాలుగా పని చేయకూడదు. విద్య వ్యక్తిత్వ వికాసానికి ఉపకరించేదిగా ఉండాలి. ఆత్మ విశ్వాసాన్ని కలగజేసేదిగా ఉండాలి. పొలాల్లో పనిచేసి డబ్బులు సంపాయించుకునే పిల్లల దగ్గరకు వెళ్ళి విద్య బోధించాలి. మాతృభాషలోనే విద్యాబోధన సాగాలి.

సమాజ శ్రేయస్సుకోసం స్వార్థాన్ని పరిత్యజించి, అసూయ అనుమానాలు లేకుండా తాము మంచిగా ఉంటూ, ఇతరులకు మంచి చెయ్యాలని ప్రయత్నించటం చిన్నప్పుడే నేర్పాలి. ఇతరులకు మంచి చెయ్యని వాడు మరణించిన వాడితో సమానం. ప్రేమించేవారు మాత్రమే జీవించిన వాళ్ళ క్రింద లెక్క. ప్రపంచంలో విస్తరించిన విజ్ఞానానికి మనస్సే నిలయం. విశ్వ సంబంధమైన అంతులేని గ్రంథాలయము మన మనస్సులో ఇమిడి ఉంది. మన మస్తిష్కంలో ఉన్న విజ్ఞానాన్ని కప్పి ఉంచిన పొరను తొలగించే ప్రక్రియే అధ్యయనం.

విద్యాభ్యాసం అంటే కేవలం పుస్తక పఠనం కాదు. వ్యక్తి యొక్క సంకల్పభాషణను క్రమబద్ధీకరించి, ఫలదీకరణ మొనర్చుటకు ఇచ్చే శిక్షణను విద్య అనవచ్చు. వ్యక్తి స్వేచ్ఛగా ఆలోచించి పొరబాట్లు చేసినా మంచిదేగాని, యాంత్రిక విధానంలో మంచి చేసినా అది శ్రేయస్కరం గాదు. పిల్లలను కఠినంగా దండించి విద్యను బోధించే ప్రయత్నం ఫలితాన్నీయదు. అందరిలో, పిల్లలతో సహా, విజ్ఞానం ఉంది. దాన్ని జాగృతం చేయుటకు ఉపకరించేదే విద్య. వారి ఇంద్రియాలను సక్రమంగా ఉపయోగించే వివేకాన్ని వారికి కలిగించాలి. తల్లి తండ్రులు తమ పిల్లలను 'నీకు చదువు రాదు, నీవు బాగుపడవు' అని దూషిస్తే పిల్లలు అలానే తయారవుతారు.

ప్రజలు స్వయంపోషకత్వాన్ని, ఆర్థిక నైపుణ్యాన్ని సంపాదించుకునే విజ్ఞానాన్ని వారికి అందచేయాలి. మన ప్రాచీన విలువలు వారికి విశ్వాసాన్ని పెంచేటట్లుగా చేయాలి. జాతివారి చరిత్రను విస్మరించిన జాతికి ప్రపంచంలో ఉనికి లేదు. మతం, కళలు, శాస్త్రవిజ్ఞానం, గృహయాజమాన్యం, వంటావార్పూ కుట్టుపనులు, పరిశుభ్రత బోధించాలి.


-స్వామి వివేకానంద

విద్యా-విలువలు 5

ఉత్తమ విద్యార్థికి ఉండవలసిన లక్షణములు..

- గౌరవం – మీ తల్లి తండ్రులను, ఉపాధ్యాయులను, పెద్దలను గౌరవించండి.
- ప్రేమ – మీ దేశాన్ని, మీ సంస్కృతిని, మీ పూర్వీకులను ప్రేమించండి.
- సేవ – పేదలకు, నిరక్షరాస్యులకు సేవ చేయండి.
- స్వయం క్రమశిక్షణ – మీ శరీరాన్ని, ఇంద్రియాలను, మనస్సును క్రమశిక్షణలో ఉంచండి.
- స్వయం నియంత్రణ – మీ మాటలను, ఆలోచనలను, పనులను స్వాధీనంలో ఉంచుకోండి.
- విశ్వాసం – మీ మీద, ఇతరుల మీద, భగవంతుడి మీద విశ్వాసాన్ని కలిగి ఉండండి.
- విచక్షణ–మంచి–చెడు, నిత్యం–అనిత్యం, ధర్మం–అధర్మం పట్ల విచక్షణ తో ప్రవర్తించండి.
- ఏకాగ్రత – చదువులో, పనిలో, ఆటలలో, ప్రార్థనలో సంపూర్ణమైన ఏకాగ్రతను అలవరచుకోండి.
- సత్యపాలన – మీ మాటలలో, చేతలలో, ఆలోచనలలో సత్యాన్ని పాటించండి.
- కఠోర శ్రమ – కష్టపడి పనిచేసి, జ్ఞానాన్ని, ప్రావీణ్యాన్ని, వివేకాన్ని సముపార్జించండి.
- బలం – శారీరకంగా, మానసికంగా, బుద్ధిపరంగా, నైతికంగా, ఆధ్యాత్మికంగా బలంగా ఉండండి.
- నమ్మకం – మంచితనం యొక్క శక్తి మీద, పవిత్రత మీద, నిజాయితీ మీద, నమ్మకాన్ని కలిగి ఉండండి.
- భక్తి – మీ విధుల పట్ల, సాధువుల పట్ల, శాస్త్రాల మీద, భగవంతుడి మీద భక్తిని కలిగి ఉండండి.
- అలవాట్లు – ప్రార్థన, ధ్యానం, బలాన్నిచ్చి ఉత్తేజపరిచే సాహిత్యపఠనం – వీటిని అలవాట్లుగా చేసుకోండి.
- సమదృష్టి – అన్ని జీవులలో దివ్యత్వాన్ని దర్శిస్తూ, మిమ్ములను మీరు ఆదరించుకున్నట్లే, వాటిని కూడా ఆదరించండి.
- దృఢ నిశ్చయం – జీవతంలో శాశ్వతమైన ఆనందాన్ని, శాంతిని, విజయాన్ని, ధన్యతను పొందటానికి అవసరమైన దృఢనిశ్చయాన్ని, మంచి అలవాట్లను పెంపొందించుకోవాలన్న గట్టి సంకల్ప బలాన్ని కలిగి ఉండండి.

పైన సూచించిన అన్ని లక్షణములను ప్రతి విద్యార్థి నేర్చుకొని, పాటించినచో స్వామి వివేకానంద ఆశించిన ఉత్తమ పౌరులు కాగలరు.

– వ్యాకరణం వేణుధర శాస్త్రి

1968లోనే తెలంగాణ ఉద్యమానికి అంకురార్పణ

(నిన్నటి తరువాయి) ఉద్యమ కార్యాచరణ సంఘ నిర్మాణంలో అభిప్రాయ భేదాలు వచ్చి ప్రధాన కార్యదర్శి శ్రీ వి. మల్లికార్జున్ నాయకత్వాన మెజారిటీ వర్గం వాకౌట్ జరపగా, ముఖ్యమంత్రి వర్గానికి చెందిన, అధ్యక్షుడు శ్రీ వెంకట్రాంరెడ్డి ముఠా ఏకపక్షంగా ఒక నిర్ణయం గైకొన్నారు. ఈ నిర్ణయం మేరకు జనవరి 16 నుండి ఈ ముఠావారు "రక్షణల కొనసాగింపు ఉద్యమం" సందర్భంలో నిరవధిక సమ్మెకు పూనుకొనాలని నిశ్చయించారు. రెండవ వర్గం వారు తక్షణమే విడిగా సమావేశమై, తెలంగాణకు రాష్ట్ర ప్రతిపత్తి సాధనకు జనవరి 15 నుండే పోరాటం జరపాలని నిర్ణయించారు.

ఆ మర్నాడు ప్రత్యేక రాష్ట్ర వాదులు నిజాం కళాశాల ఆవరణలో సభ జరుపగా వారిని బెదరకొట్టేందుకు పోలీసులు లాఠీచార్జి చేశారు. తరువాత రెండు రోజులు జనవరి 15, 16వ తేదీలలో కూడ విద్యార్థులు ద్విగుణీకృత పట్టుదలతో సభలు జరపడం, పోలీసులు మరింత పాశవికంగా విద్యార్థులను ఇరగబాదటం జరిగింది. ఈ దారుణానికి బ్రహ్మానందరెడ్డి దూరపు బంధువైన ఒక డి.సి.పి. నేతృత్వం వహించడం ఇక్కడ గమనార్హం. ఆనాడు (ఈ విలేకరితో సహా) నిజాం కళాశాల దృశ్యాలు తిలకించిన పత్రికల వారికి విద్యార్థులపై జాలి, అభిమానం కలిగినాయి. పోలీసు దమనకాండను అక్రమ లాఠీని నిరసిస్తూ పత్రికలు ప్రకటించిన వార్తలు, పతాక శీర్షికలు తెలంగాణ ప్రాంత విద్యార్థులు, యువకుల రక్తాన్ని వేడెక్కించి కార్యోన్ముఖులను చేశాయి. ఆ దశలో కూడా, జీర్ణించుకున్న అహంకారంతో, పరిణామాలు ఊహించక, మూర్ఖంగా వ్యవహరించిన ముఖ్యమంత్రి "ఇది పిల్లల గొడవ" (అర్చిన్స్ షవుట్స్) అని వ్యాఖ్యానించి, ప్రత్యర్థి వర్గం విద్యార్థుల శక్తిని తెలుసుకొనక తన తొత్తులపై ఆధారపడటం వలన ఉద్యమం తీవ్రతరమై ప్రళయాగ్నిలా తెలంగాణా అంతట వ్యాపించింది. "చేతులు కాలిన తరువాత ఆకులకు వెతికినట్టు" తన ఎత్తులు బెడిసికొట్టి ఉద్యమం తెలంగాణ ప్రాంతమంతా విస్తరించిన అనంతరం, సమస్యలను చర్చించి పరిష్కారం కనుకొనేందుకు జనవరి 18, 19వ తేదీలలో వివిధ రాజకీయ నాయకులు, ప్రముఖులతో, ముఖ్యమంత్రి హడావిడిగా తన అధికార నివాసంలో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశం నిర్ణయాలు పాతపాటే అయినప్పటికీ ప్రభుత్వం చేసిన పాపాల్ని ప్రతిపక్షాలు కూడా పంచుకొని తెలంగాణ ప్రజలకు అన్యాయాలు జరిగాయని అంగీకరించి, కొన్ని బూటకపు వాగ్దానాలను పునరుద్ఘాటించాయి. అక్రమంగా ఆంధ్ర ప్రాంతంలో ఖర్చుచేసిన తెలంగాణ మిగులు నిధులను తిరిగి తెలంగాణపై ఖర్చుచేయాలనీ, తెలంగాణ వారికి చెందిన ఉద్యోగాలను అక్రమంగా అక్రమంగా అనుభవిస్తున్న దొంగ సర్టిఫికెట్స్ వీరులను తిరిగి వారి ప్రాంతానికి పంపించేందుకు ఆంధ్ర ప్రాంతంలో ఉద్యోగాలను సృష్టించాలని అఖిల పక్ష సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. దొంగ సర్టిఫికెట్‌తో, ఉద్యోగాలు కొనుకున్న వారు అంత తేలికగా తమ ప్రాంతానికి వెళ్లిపోతారా? అఖిలపక్ష తీర్మానాన్ని అదిగమించేందుకు, అది అమలు కాకుండా వివాదం రేపేందుకు ప్రభుత్వంలో ఆంధ్ర పాలకులే వారికి ఉపాయం ఆంధ్ర ఉద్యోగులు చెప్పారు. తెలంగాణా ప్రాంతం నుండి ఆంధ్ర ఉద్యో గుల బదిలీ మొదలగు నిర్ణయాలను మర్నాడే సవాల్ చేస్తూ న్యాయ స్థానాల్లో ఆంధ్ర ఉద్యోగులు దరఖా స్తులు పెట్టుకోవడంతో ఇక్కడి ఉద్యోగస్థులు, మేథావులు విద్యార్థులలో తీవ్ర సంచలనం బయలుదేరింది. ఈలోగా, నాడు తన చెప్పుచేతలలో ఉండున్న ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుని సహాయంతో శ్రీ కాసు బ్రహ్మానంద రెడ్డి జనవరి 19 ఒప్పందానికి ముల్కీ నిబంధనలకు వ్యతిరేకంగా ఆంధ్రలో ఉద్యమం లేవదీయవలసిందిగా ఆంధ్ర ప్రాంతం విద్యార్థులను రహస్యంగా పురికొల్పారు. తెలంగాణకు కల్పించిన రాయతీలకు ఆంధ్ర ప్రాంతంలో వ్యతిరేకత వ్యక్తమైనట్లయితే, "స్వామీ మాకు కనీసం ఈ ముల్కీ నిబంధనలైనా ఉండేట్లు చూడండి" అని తమను తెలంగాణా ప్రాంతీయులు వేడుకుంటారని, తమ పోరాటానికి పోటీ ఉద్యమం ఆంధ్రలో ప్రారంభం కావడం వలన తెలంగాణ విద్యార్థులు జంకుతారని, ఆంధ్ర కుటిల నీతిపరులు ఆలోచించారు. అయితే అది వారికే ఎదురు తన్నింది. ఆంధ్రుల ప్రతిస్పందన పోలీసు లాఠీచార్జీల నేపథ్యంలో నగరంలో ఇతర తెలంగాణ పట్టణాలలో విద్యార్థుల ఉద్యమం మరింత తీవ్రమైనది. ఇదే రకమైన పాత జిత్తులనే ఆంధ్ర పాలకులు నాటి నుంచి నేటి వరకు జరుగుతున్నది. అందు వలననే తెలంగాణ ప్రజలు తమకు జరిగిన అన్యాయాలను వెలుగెత్తి చాటిన ప్రతి సందర్భంలోను, ఇటు రాయలసీమలోనో, అటు కోస్తాలోనో తమకూ అన్యాయం జరిగినదని కొందరు గళం విప్పడం మనం గమనిస్తూనే ఉన్నాము.

ప్రారంభ దశలో ఒకవైపున విద్యార్థి నాయకులు శ్రీ నారాయణ దాస్, శ్రీ శ్రీధర్ రెడ్డి, శ్రీ పుల్లారెడ్డి, శ్రీ పి.హెచ్. వెంకటేశ్వర రావు, శ్రీ మల్లికార్జున్, శ్రీ ఆరిపుద్దీన్, శ్రీ సత్యనారాయణ రెడ్డి, శ్రీ మోహన్ రెడ్డి, శ్రీ మధుసూధనరావు, శ్రీ లక్ష్మీ నారాయణరావు, శ్రీ రమాకాంత్, శ్రీ గోపాల్, శ్రీ సుభాస్‌రెడ్డి, శ్రీ గోపాల్ రెడ్డి, శ్రీ రంగారెడ్డి, శ్రీ సూరిదాస్ రెడ్డి, శ్రీ నరసింహారెడ్డి, శ్రీ గోపాల్ కిషన్‌రావు, శ్రీ వీరన్న, శ్రీ జనార్ధన్‌రెడ్డి, శ్రీ వెంకటిరెడ్డి, శ్రీ పి.జె. సూరి మొదలైనవారు. మరొకవైపున ప్రజా సమితి సభ్యులు శ్రీ ఎస్. వెంకట్రామ రెడ్డి, డాక్టర్ గోపాల్, శ్రీ జి. నారాయణ రావు, శ్రీ ఎ. మదన్‌మోహన్, శ్రీ ఆదిరాజు వెంకటేశ్వరరావు, శ్రీ ప్రతాప్ కిషోర్, శ్రీ పి.ఎన్.స్వామి, శ్రీ జగన్మోహన రెడ్డి, శ్రీ ఎస్. రఘువీరరావు, శ్రీ వి. రామకృష్ణారెడ్డి, శ్రీ సాయిరెడ్డి, శ్రీ మాణిక్‌రావు మరొకవైపున తమ సహచరులతో అహోరాత్రులు కష్టించి జిల్లాలకు వెళ్లి నాయకుల సహాయంతో ముఖ్య భూమికను నిర్వహించి ఉండిరి.

బహిరంగంగా అందరికంటే మొట్టమొదట ఉద్యమంతో సంబంధం పెట్టుకొన్న రాజకీయ వాదులు భాయి రమమూర్తి నాయుడు, శ్రీ యి.వి. పద్మనాభన్, జనవరి మూడవ వారంలో ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆవరణలో జరిగిన ఒక విద్యార్థుల బహిరంగ సభలో ప్రసంగిస్తూ తాను ఏ త్యాగం చేయడానికైనా సిద్ధంగా ఉన్నట్లు మాజీ మేయర్, వృద్ధ కాంగ్రెస్ నాయకుడైన శ్రీ రామమూర్తి నాయుడు ప్రకటించగా, ఎలా అవసరమనుకుంటే అలా తన సేవలు ఉపయోగించుకొనవచ్చునని శ్రీ యి.వి. పద్మనాభన్ విద్యార్థులను కోరారు.

– ఆదిరాజు వెంకటేశ్వర రావు

చలికి జాగ్రత్తలు తీసుకోండి

రోజు రోజుకు చలి తీవ్రత పెరుగుతోంది. చలి కాలంలో పిల్లలు, గర్భిణులు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలి. కరీంనగర్ జిల్లాలో ఇప్పటికే 15 మంది వరకు వృద్ధులు చలి తట్టుకోలేక మరణించారు. చిన్నారులు శ్వాస సంబంధ సమస్యలతో సతమతమవుతున్నారు. చిన్నారులకు స్వెటర్లు వేయడం, చెవులకి చల్లటి గాలి తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. దోమల నివారణకు వినియోగించే కాయిల్స్‌ను పిల్లలున్న గదుల్లో వాడరాదు. ఉదయాన్నే వ్యాయామం చేయడంతో ఆనందంగా, హుషారుగా ఉండటానికి తోడ్పడే హార్మోన్లు సైతం విడుదలవుతాయి. బజ్జీలు, మిర్చీలకు దూరంగా ఉండాలి. ఎక్కువ కేలరీలతో కూడిన ఆహారానికి బదులు వేడివేడి సూపులను తాగడం ఉత్తమం. ఎక్కువసేపు వేడి నీటి స్నానం చేయకూడదు. గోరువెచ్చని నీటితో స్నానం చేయాలి. చలికాలంలో నీరు ఎక్కువగా తాగాలి. శీతాకాలంలో పిల్లలకు జలుబు, చర్మ వ్యాధులు, శ్వాసకోశ, న్యుమోనియా లాంటి ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులు అధికంగా వచ్చే ప్రమాదం ఉంది. పిల్లలకు జలుబు చేస్తే ఎక్కువ రోజులు నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి. ఆస్తమా ఉన్న వాళ్లు చలిలో బయటకు వెళ్లకుండా చూడాలి. చిన్నపిల్లలు, గర్భిణులు, వృద్ధులు శీతాకాలంలో తగిన జాగ్రత్తలు తప్పకుండా తీసుకోవాలి. చల్లటి పదార్థాలు తీసుకోవడం పూర్తిగా మానేయాలి.

–సుధారాణి,
కరీంనగర్

ఆలోచించి ఆనందించండి

కొత్త సంవత్సరం వస్తోందంటే ఒకవారం ముందు నుంచే యువత ఎన్నో ప్రణాళికలు రూపొందించుకుని ఎంజాయి చేయాలనుకుంటారు. కానీ క్యాలెండర్‌లో ఒక్కదినం మారిన తర్వాత ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్న సందర్భాలను గత ఎన్నో సంవత్సరాల నుంచి చూస్తున్నాము. మారుతున్న సమాజంలో ప్రతి రోజు పండుగలే. బాదేసిన సంతోషమేసినా మనం పార్టీలను జరుపుకుంటాము. కానీ ఈ వేడుక వచ్చిదంటే ప్రభుత్వం సైతం ప్రోత్సాహమిస్తూ ఎన్నో అవాంఛనీయ ఘటనలకు కారణమవుతోంది. ఎప్పుడూ లేనిది ఈ రోజే మద్యం దుకాణాలకు రాత్రి 12 గంటల వరకు, బార్‌లకు రాత్రి ఒంటిగంట వరకు వెసులుబాటు కల్పించడం బాధాకరం. ప్రభుత్వం ఎందుకు ప్రజలను మద్యం తాగడానికి ప్రోత్సహిస్తోందో అర్థంకాని పరిస్థితి. గతంలో నగరాలు, పట్టణాలకు పరిమితమైన ఇలాంటి వేడుకలు నేడు మారుమూల గ్రామాలకు సైతం వ్యాపించాయి. యువత వేడుకల్లో అతిగా మద్యం తాగి ప్రమాదాలకు గురవటం ప్రతి సంవత్సరం చూస్తూనే ఉన్నాము. అనుభవించటం పరిమితి దాటితే కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితులు దాపురిస్తాయి. కావున నేటి యువత, ప్రజలు ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. గత సంవత్సరంలోని విజయాలు, పరాజయాలను విశ్లేషించుకోని తగిన మార్పులు, చేర్పులు చేసుకుంటూ, నూతన సంవత్సరంలో నూతన లక్ష్యాలను ఏర్పరచుకొని, వాటి అమలుకు ప్రణాళికలు రూపొందించుకొని విజయం సాధించి, కుటుంబ సభ్యులను ఆనందంలో ఉంచటానికి కృషి చేయండి. ప్రత్యేకంగా నేటి యువత ఒకటికి పలుమార్లు ఆలోచించి, గతంలోని సంఘటనలను పరిశీలించి ముందడుగు వేయాలి. ఏది ఏమైనప్పటికి ఈ నూతన సంవత్సరంలో అందరికి శుభాలు కలగాలి.

– డా. పోలం సైదులు,
నాగర్‌కర్నూల్

కొత్తదారిలో.. మన హైదరాబాద్

కొత్త శతాబ్దికి కూడా ఓటు హక్కు వచ్చేసింది. అవును! మరో ఏడాది కాలగర్భంలోకి తరలిపోయింది. ముందస్తుగానే ఎన్నికలకు తరలి గులాబీ పూలాగా విచ్చుకుంది. 18 నిండి 19లోకి ప్రవేశిస్తున్నాం నేటి నుండి.

హైదరాబాద్ మహనగరం గత ఏడాది అనేక ప్రత్యేకతలను సంతరించుకుంది. విద్యుత్ సరఫరాలోనే కాదు. తాగునీటి పథకాలు పూర్తి చేయ డంలోనూ కీలక పురోగతి జరిగింది. ప్రధానంగా ఔటర్‌రింగ్ రోడ్డులో ఉన్న 190 పంచాయతీలు, నగరపాలక సంస్థలకు నీరందించే పనులకు మోక్షం దొరికింది. 11 శివారు మున్సిపల్ సర్కిళ్ళు గ్రేటర్‌లో విలీనమయ్యాయి. ఆ రెండువేల అయిదు వందల కిలోమీటర్ల దారిలో తాగునీటి పైప్‌లైన్లు ఏర్పడ్డాయి. యాభై ఆరు భారీ స్టోరేజీ రిజర్వాయర్ల నిర్మాణం జరిగింది. సుమారు వెయ్యి కాలనీలకు, బస్తీలకు నీరందించడం నగరానికి ఏమయ్యింది? అంటే సంతోషదాయకమైంది మరి.

హైదరాబాద్ 'మెట్రో' సిటీ అనిపించుకునేలా ఈ ఏడే అత్యంత రద్దీ ఉండే పదహారు కిలోమీటర్ల ఎల్బీనగర్ – అమీర్‌పేట్ మార్గంలో మెట్రో ప్రాజెక్టు పూర్తి అయ్యి మియాపూర్ వరకూ నేరుగా మెట్రోరైలు ప్రయాణం చేయగల అవకాశం దొరికింది. 29 కిలోమీటర్ల మార్గంలో ట్రాఫిక్ ఇక్కట్లు అనేవేవీ లేకుండా కేవలం ఓ యాభై నిముషాల్లో ప్రయాణించే అవకాశం నగరవాసులకు దక్కింది. కొత్త సంవత్సరంలో అమీర్‌పేట, హైటెక్ సిటీ మార్గంలోనూ మెట్రోరైళ్ళ సందడి మొదలవుతుంది మరి!

లింగంపల్లి, పటాన్‌చెరువు తదితర చోట్లకు గోదావరి జలాలను సరఫరాచేసేందుకు ఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి పటాన్‌చెరువు వరకు భారీ రింగ్‌మెయిన్ పైప్‌లైన్ పనులు రూ.400 కోట్ల అంచనావ్యయంతో చేపట్టడం గత ఏటి మరో విశేషం.

హైదరాబాద్ మహనగరం ఒకప్పుడు ప్రశాంతత భగ్నమయ్యే ఘటనలతో అట్టుడికిపోతూండేది. గత ఏడాది నగరంలో నేరాలు గణనీయంగా తగ్గడం ఓ శుభపరిణామమే! కానయితే హత్యకేసులు మాత్రం ఎనిమిదిశాతం పెరగడం శోచనీయం. నగర కొత్వాల్ అంజనీకుమార్‌గారు వెల్లడించిన వివరాల ప్రకారం నగరంలో రోడ్డు ప్రమాదాలు, గతంతో పోలిస్తే రోడ్డు ప్రమాదాల మృతుల సంఖ్య తగ్గుదల పట్టింది. ఒకప్పుడు నగరం రోడ్లమీద గంటకు సరాసరి వేగం 18 కిలోమీటర్లు ఉండగా గత ఏడాది అది 25 కిలోమీట ర్లకు చేరిం దిట. అయితే సైబర్ క్రైమ్ పెరుగుతుండడం ఓ నివారించవలసిన కొత్త పరిణామం. నగర రక్షక వ్యవస్థలో గత ఏడాది సిటీ రాపిడ్ యాక్షన్ ఫోర్స్, వెరీ ఫాస్ట్ యాప్, ఫేషియల్ రికగ్నిజేషన్ సిస్టమ్, ఉమెన్ ఆన్‌వీల్స్ వంటి బృందాలు రంగంలోకి కొత్తగా దిగాయి. మొత్తానికి ఆరుశాతం నేరాలు నగరంలో తగ్గాయి అని నగర సి.పి అంజనీకుమార్ వార్షిక నివేదిక విడుదల చేశారు.

దేశంలోనే ప్రతిష్ఠాత్మకంగా 'ట్విన్‌టవర్స్' పేరుతో హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో పోలీస్ టవర్స్ నిర్మాణం పూర్తకావస్తోంది. ఈ కొత్త సంవత్సరంలో 83.4 మీటర్ల ఎత్తయిన ఈ జంట భవనాలను ప్రారంభిస్తారు. అలాగే వందకోట్ల వ్యయంతో నగరంలోని 250 జంక్షన్లలో ఇంటిగ్రేటడ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టం అమలులోకి రానుంది. ఈ సంవిధానం అమలులోకి వస్తే ట్రాఫిక్ నిర్వహణ మరింత సులభతరం అవుతుంది. వాహనదారులు తమ గమ్యం చేసుకునే సమయం గణనీయంగా తగ్గడం, ట్రాఫిక్‌జామ్స్ దాదాపు కనుమరుగు చేయగలగడం సాధ్యమవుతుంది.

ఇక చారిత్రక హైదరాబాద్ నగరంలో పర్యావరణానికి ప్రాధాన్యం ఇస్తూ పచ్చదనం, పరిశుభ్రత కోసం శ్రద్ధ పెట్టడం జరుగుతుండడం మరో గుర్తించదగిన పరిణామం.


నగరంలో ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ ప్రమాణాలను దృష్టిలో పెట్టుకొని 'గ్రీన్‌బిల్డింగ్స్' అంటే హరితభవనాల నిర్మాణం కొంత ఊపందుకుంటోంది. సౌరశక్తి వినియోగం, పునర్వినియోగ విధా నంలో మురుగునీటి శుద్ధి, స్వచ్ఛమైన గాలి, వెలుతురు గ్రీన్‌బెల్ట్ కొత్త నిర్మాణాల్లో భాగం అవుతున్నాయి. హరిత భవనాల నిర్మాణానికి 20 శాతం అధికంగా ఖర్చు అవుతున్నప్పటికీ, ఆ భవనాల నిర్వహణ వ్యయం క్రమేపీ తగ్గే వీలుండడం వల్ల సదరు భవన నిర్మాణాలు చేయడానికి సంస్థలు పూనుకుంటున్నాయి. ప్రభుత్వపరంగా రాయితీలు లభించేటట్లయితే ఆయాసంస్థల నిర్మాణాలు మరింత జోరుగా ఉంటాయి.

మన దేశంలో 35 శాతం గ్రీన్‌బెల్ట్‌తో ప్రస్తుతం ప్రణాళికాబద్ధ నగరుగా చండీఘడ్ తొలిస్థానంలో ఉంది. మన నగరంలో ఇంకా హరితం ఎనిమిది శాతానికే పరిమితమై ఉంది. అందువల్ల హరిత భవనాలు రాబోయే రోజుల్లో మరింతగా నిర్మింపబడవలసిన అగత్యం ఉంది.

ఇది హైదరాబాద్ ఇది హైదరాబాద్
ఇది భిన్న సంస్కృతులు ఎదిగిపూచిన పాదు

అని డాక్టర్ సి. నారాయణరెడ్డి ఒకప్పుడు నగర వైభవకీర్తిని కవితాత్మకం చేశారు. హైదరాబాద్ మహానగరం తెలంగాణ రాజధాని. 2014 నుంచి పదేళ్ళపాటు ఉమ్మడి అస్తిత్వం ఉంటుందని అన్నా నగరసంపద అంతా తెలంగాణదే! ఇప్పటికీ ఢిల్లీ కంటే హైదరాబాద్‌కే దేశరాజధాని కాగలిగిన స్థాయి ఉందని విశ్వసిస్తున్న వారెందరో ఉన్నారు. హైదరాబాద్‌ను కనీసం యూనియన్ టెరిటరీగా ఉంచినా బాగుండేదని భావిస్తున్న వారూ ఉన్నారు.


నిజాంపాలన నుంచి హైదరాబాద్ విముక్తమయినా నిజానికి హైదరాబాద్‌లోని ప్రగతి మూలాధారాలన్నీ నిజాం కాలం నాటివిగా ఉన్నాయనడంలో అతిశయోక్తి లేదు. అందుకే భాగ్యనగరమన్న పేరు సార్థకంగా నిలిచింది. అయితే ఆ నాటి భాగ్యాలు వేరు. ఈ నాటి భాగ్యాలు వేరు. తెలంగాణ ఆదాయవనరుల భాగ్యం నేటికీ హైదరాబాద్ మీదే ప్రధానంగా ఆధారపడి ఉంది. నగరం ఎందరెంద రినో, ఎక్కడెక్కడి నుండి వలస వచ్చినవారినో చేరదీసి ఆదుకుంది. నగరంతో అనుబంధం పెనవేసుకున్న జీవితాలు కోకొల్లలు. సాహిత్యం, కళలు, సంస్కృతి, ఆచారవ్యవహారాలు అన్నిటి కూడలి ఈ మహానగరం. నగరం నీడలో సేద తీరుతున్న ప్రాణులు అసంఖ్యాకం. తెలుగువారి గుండె చప్పుడు నగరంతో పెనవేసుకుపోయిందన్న మాట వాస్తవం! 2019 కొత్త సంవత్సరం అందరికీ, అన్నింటా సుఖ, సంతోష ప్రదం కావాలని శుభాకాంక్షలు.


సుధామ
9849297958

వైద్యునిపై దాడి నిందితులను అరెస్టు చేయాలి

విజయక్రాంతి, హైదరాబాద్: సీనియర్ పీడియాట్రిషన్ డాక్టర్ మైఖెల్ అరన్హాపై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని పీడియాట్రిషన్లు డిమాండ్ చేశారు. భవిష్యత్తుల్లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వారు కోరారు. నగరంలో సోమవారం ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ (ఐఏపీ) జంటనగరాల విభాగం ఆధ్వర్యంలో నాంపల్లిలోని ఓమ్ని ఉదయ్ ఆసుపత్రి ముందు నిరసన తెలిపారు. నగరవ్యాప్తంగా ఉన్న క్లినిక్స్‌తో పాటు పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో విధులు నిర్వహిస్తున్న చిన్నపిల్లల వైద్యులు బయటి రోగులకు సేవలను నిలిపివేశారు. ఐఏపీ జంటనగరాల అధ్యక్షుడు డాక్టర్ రంగనాథ్, మాజీ అధ్యక్షుడు డాక్టర్ రంగయ్య, కార్యదర్శి డాక్టర్ అర్జున్ తదితరుల నేతృత్వంలో నిరసన తెలిపారు. రోగి చికిత్సలో భాగంగా వైద్యులు సలహాలు ఇస్తారని, పాటించడం, పాటించకపోవడం రోగుల ఇష్టమన్నారు.

స్పందించిన రైల్వేశాఖ



విజయక్రాంతి ఎఫెక్ట్

విజయక్రాంతి, నిజామాబాద్: రైల్వేశాఖలో పార్సల్ మాయం కథనంపై రైల్వేశాఖ స్పందించింది. సోమవారం '**విజయక్రాంతి**'లో రైల్వే శాఖను నమ్ముకుంటే నట్టేట ముని గినట్లే కథనాన్ని ప్రచురించింది. ఈనెల 25న సికింద్రాబాద్ నుంచి నిజామాబాద్‌కు పంపిన పార్సల్ సకాలంలో చేరకపోగా వారం రోజులైనా సికింద్రాబాద్ రైల్వే పార్సల్ విభాగం అధికారులు పట్టించుకోకపోవడంతో బాధితులు విజయక్రాంతితో జరిగిన అన్యాయాన్ని చెప్పుకున్నారు. దీంతో రైల్వేశాఖ పార్సల్ విభాగంలో జరుగుతున్న నిర్లక్ష్యం అధికారులు పర్యవేక్షణపై కథనం రావడంతో సోమవారం మధ్యాహ్నం పార్సల్ కార్యాలయం నుంచి బాధితులకు పార్సల్ చేరింది. పార్సల్ విభాగం వారు ఫోన్ చేసి పార్సల్ వచ్చింది తీసుకెళ్లండని చెప్పడంతో పార్సల్‌ను అందుకున్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైనవేళ

విజయక్రాంతి, అచ్చంపేట: విద్యార్థులే ఉపాధ్యాయులుగా నిర్వహించి పాఠశాలల్లోని విద్యార్థులు సంతోషంగా నిర్వహించే పండగ స్వయం స్వపరిపాలన. అచ్చంపేట నియోజకవర్గంలోని బల్మూర్ మండల కేంద్రంలోని కస్తూరిభా గాంధీ పాఠశాలలో స్వయం స్వపరిపాలన దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలోని 40 మంది విద్యార్థినులు చాత్రోపాధ్యాయులుగా వ్యవహరించారు. డిఈఓగా స్వాతి, జిసిడిఓ గా పూజ, ఎస్ఓ గా సింధు, భాధ్యతలు నిర్వహించగా వివిధ విద్యార్థులు ఉపాధ్యాయులుగా వారికి ఇచ్చిన సబ్జెక్టులలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సంధర్భంగా సబ్జెక్టుల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కల్పించిన విద్యార్థులకు బహుమతులను అందజేశామని పాఠశాల ప్రత్యేకాదికారి లలిత తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటుగాఉపాధ్యాయులుపాల్గొన్నారు.

పట్టుకున్నారు.. ఆపై వదిలేశారు..!

- కుమ్మరి కుంటలో అక్రమంగా ఎర్ర మట్టి తవ్వకాలు..!
- జేసీబీ, ఆరు ట్రాక్టర్లను పట్టుకున్న రెవిన్యూ అధికారులు



విజయక్రాంతి, మంథని: మంథని నియోజకవర్గం పరిధిలోని మంథని మండలం బిట్టుపల్లి శివారులోని కుమ్మరి కుంటలో శుక్రవారం అక్రమంగా ఎర్ర మట్టి (మొరం) తవ్వకాలు జరుగుతున్నాయన్న పక్కా సమాచారం మేరకు రెవన్యూ అధికారులు అక్కడకు వెళ్లి అక్రమంగా ఎర్రమట్టిని లోడ్ చేస్తున్న ఒక జేసీబీతో పాటు ఆరు ట్రాక్టర్లను పట్టుకుని, మంథని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ జేసీబీ, ట్రాక్టర్లు అధికార టీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకుడి దగ్గరి కాంట్రాక్టర్, వ్యక్తులవి కావడం, సదురు అధికార పార్టీ నాయకుడు రంగ ప్రవేశం చేయడంతో సీన్ మొత్తం మారిపోయింది.

రాత్రికి రాత్రే అనుమతులు..!

మండల రెవన్యూ అధికారులు పట్టుకున్న సమయంలో ఎలాంటి అనుమతులు గానీ, కాగితం కానీ లేనిది, అధికార పార్టీ నేత ఎంట్రీతో రాత్రికి రాత్రే అనుమతులు పుట్టుకువచ్చాయి. మంథని పట్టణంలో నిర్మిస్తున్న 92 డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణాలు చివరి దశకు చేరాయని, ఈ డబుల్ బెడ్ రూం ఇండ్ల పరిసరాల్లో పోసేందుకు 150 క్యూబిక్ మీటర్ల మొరం అవసరమని, ఈ డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మిస్తున్న సుఖజీవన్ బిల్డర్స్ చేపట్టిన ఈ మట్టి తవ్వకాలు తమ నోటీసులో ఉన్నాయని, ఇందులో వారు చేసిన తప్పు ఏమీ లేదని పంచాయతీరాజ్ పెద్దపల్లి ఈఈ వెంకటేశ్వర్‌రావు రాత్రికి రాత్రే ఉత్తర్వులు జారీ చేయడం, అనేక అనుమానాలు తావిస్తోంది.

విచారణ జరుపకుండానే విడిచిపెట్టిన రెవన్యూ అధికారులు..!

పెద్దపల్లి పంచాయతీరాజ్ ఈఈ ఉత్తర్వులు అందుకున్న మంథని తహసీల్దార్ ఇందులో నిజమెంత..? అబద్ధమెంత..? అనే కోణంలో ఎటువంటి విచారణ జరుపకుండానే, ఎలాంటి జరిమానా విధించకుండానే, పీఆర్ ఈఈ లేఖను ఆటాచ్ చేస్తూ పట్టుకున్న జేసీబీ, ఆరు ట్రాక్టర్లను విడిచిపెట్టాలని ఉత్తర్వులు జారీ చేశారు. తహసీల్దార్ ఉత్తర్వులతో మంథని పోలీసులు సదురు వాహనాలను శనివారం విడిపెట్టడంచక చకా జరిగిపోయాయి.

డబుల్ నిర్మాణాల చోట కానరాని తట్టెడు ఎర్ర మట్టి..!

రెవన్యూ అధికారులు పట్టుకున్న సమయం లోపే సుమారు 50 ట్రిప్పుల వరకు ఎర్ర మట్టిని కుమ్మరి కుంట నుంచి అక్రమంగా తరలించారు. పెద్దపల్లి ఈఈ చెప్పినట్లు డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం కోసమే తరలించారని అనుకున్నా, ఆ డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణ ప్రదేశంలో తట్టెడు ఎర్ర మట్టి కుప్ప సైతం ఉన్న దాఖలాలు లేవు. విజయక్రాంతి ఈ సంఘటనపై విచారణ జరుపగా, ఈ ఎర్ర మట్టిని మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో రూ.30 లక్షలతో నిర్మిస్తున్న హాల్ బేస్‌మెంట్ బరంతి నింపేందుకు తరలించినట్లు తెలిసింది.

కలెక్టర్ విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలి

కుమ్మరి కుంటలో అక్రమ ఎర్ర మట్టి తవ్వకాలను కప్పి పుచ్చి, అధికార పార్టీ నేతల వ్యక్తులను కాపాడేందుకు అధికారులు నానా తిప్పలు పడ్డారని, చివరకు వారే అడ్డంగా దొరికిపోయారనే మంథని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. అధికారులు తెలిపినట్లు డబుల్ బెడ్ రూం ఇండ్ల కోసమే అయితే ఆ మట్టి డబుల్ బెడ్ రూం ఇండ్ల చోట ఎందుకు లేదని వారు ప్రశ్నించారు. పై నుంచి క్రింది స్థాయి వరకు పలు శాఖల అధికారులు అధికార టీఆర్ఎస్‌కు తొత్తులుగా మారారనడానికి ఇదే నిదర్శమన్నారు. డబుల్ నిర్మాణాల చోట పోయాల్సిన ఎర్ర మట్టి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణం వద్ద ఎలా పోశారన్నారు. దీనిపై పెద్దపల్లి జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి, సమగ్ర విచారణ జరిపి అక్రమ ఎర్ర మట్టి తవ్వకాలు చేపట్టిన వారితో పాటు వారికి అనుకూలంగా రాత్రికి రాత్రే ఆదేశాలు జారీ చేసిన పీఆర్ ఈఈపై, విచారణ జరుపకుండానే పట్టుకున్న వాహనాలను రీలీజ్ చేసిన రెవన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని మంథని కాంగ్రెస్ నాయకులు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. లేని యెడల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్దపల్లి కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

విజయక్రాంతి, పరకాల: లబ్ధిదారులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. పరకాలలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బీసీ కార్పోరేషన్ రుణాల చెక్కులు పంపిణీ చేశారు. పరకాల అర్బన్‌లో 9 మందికి 4లక్షల 50వేలు, దామెర మండలంలో 12మందికి 60లక్షలు ఆత్మకూర్ మండలంలో 17మందికి 8లక్షలు 50వేలు పరకాల రూరల్ 66మందికి 33లక్షలు, సంగెంమండలంలో 43మందికి 21లక్ష50వేల వరకు చొప్పున మొత్తం 76లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీసీ రుణాలను సద్వినియోగం చేసుకుని స్థిరపడాలన్నారు. ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతి కోసం పాటు పడుతున్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కార్పోరేషన్ ఈడీ నర్సింహస్వామి రైతు సమన్వయ కమిటి జిల్లా కో ఆర్డీనేటర్ బిక్షపతి మార్కెట్ కమిటి చైర్మన్ పావుశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

టీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

విజయక్రాంతి, స్టేషన్‌ఘన్‌పూర్: రానున్న సర్పంచ్ ఎన్నికలను టీఆర్ఎస్ శ్రేణులు కీలకంగా తీసుకుని పార్టీ అభ్యర్థులను గెలిపించాల్సిన భాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే అతిధి గృహంలో సోమవారం కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ.. గ్రామ సర్పంచ్‌లు, వార్డు సభ్యుల ఎన్నికలు జరుగనున్న నేపధ్యంలో ప్రతి ఒక్కరు పార్టీ ప్రతిపాదించిన అభ్యర్థులను గెలిపించాలని ఆయన అన్నారు. టీఆర్ఎస్ హవా కొనసాగుతున్నదని, ప్రతి గ్రామంలో ఏకగ్రీవానికి ప్రయత్నం చేయాలన్నారు. గ్రామం ఏకగ్రీవంగా సర్పంచ్ ఎన్నిక జరిగినట్లయితే గ్రామాభివృద్ధికి రూ.5 నుంచి రూ.10లక్షల వరకు ప్రభుత్వం అందిస్తుందన్నారు. టీఆర్ఎస్ పాలనలో ప్రజలు సంతృప్తిగా జీవిస్తున్నారని వారికి అందిస్తున్న పథకాలన్నీ కూడా సద్వినియోగం చేసుకుంటున్నట్లు తేలిపోయిందన్నారు. మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ ఎమ్మెల్యేలను గెలిపించి రాష్ట్ర చరిత్రను తిరగరాయడం జరిగిందన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు బేష్ అనే సంకేతాన్ని గెలుపుద్వారా ప్రజలు తీర్పునిచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో పుట్ల రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చేరాలు, ఎంపీటీసీ ఇసాక్, బాపురెడ్డితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల కృషి భేష్

విజయక్రాంతి, మహబూబ్‌నగర్: శాంతిభద్రతల నిర్వహణను నిరంతర ప్రక్రియ, నేర నిరోదన, నేర పరిశోధన, నింధితులకు తగిన దండన వంటి చర్యల ద్వారా సమాజ శాంతిపై పోలీస్ శాఖ కృషి చేస్తుందని జిల్లా ఎస్పీ రేమా రాజేశ్వరి అన్నారు. 2018 ఏడాది ముగింపు సందర్భంగా పోలీసు విజయాలను మున్ముందు మరింతగా రాణించాల్సిన అంశాలను ఎస్పీ విలేకర్ల సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2018 సంవత్సరాలో పోలీస్‌శాఖ చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇవ్వడం స్ఫూర్తిని కలిగిస్తుందన్నారు. ముఖ్యంగా ఈ ఏడాది జరిగిన అసెంబ్లీ సాధారణ ఎన్నికల నిర్వహణ పోలీస్ శాఖకు గొప్ప విజయం. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పోలీస్ సిబ్బంది గ్రామ స్థాయి నుంచి ఒక్కొక్క వ్యక్తిని కలుసుకొని ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించుకోవడం ఎంతో అవసరమని గొడవలు చేయడం వలన జరిగే అనార్థనాలను వివరించడం జరిగింది. ఈ నేపథ్యంలో గ్రామ పెద్దలు, యువతతో పోలీస్ శాఖ అనేక అవగాహన సదస్సులు నిర్వహించింది. మరోవైపు కొన్ని ఎంపిక చేసుకున్న గ్రామాలలో సురక్ష పోలీస్ కళాబృందాలు, కళాప్రదర్శనల ద్వారా ప్రచారం చేశారు. జిల్లాలో నేరాలను అదుపు చేయడంలో పోలీస్ శాఖ చేసిన శ్రమ ఫలించింది. ఆయా పోలీస్‌స్టేషన్లకు సంబందించిన గ్రామ పోలీస్ అధికారులు ప్రజలలో సన్నిహితంగా మెలుగుతూ ఏదైనా సమస్య ఏర్పడితే వెంటనే స్పందించి నివారించడం వంటికి పోలీసుల పట్ల నమ్మకాన్ని పెంచింది. రోడ్డు ప్రమాదాల నివారణకై పోలీసులు తీసుకున్న చర్యలు అనేక కుటుంబాల్లో ఆనందాన్ని కలిగించిన మాట వాస్తవం . ముఖ్యంగా ద్విచక్ర వాహనాలపై వెళ్లే గ్రామీణ ప్రాంత యువత ప్రమాదాల భారిన పడి ప్రాణాలు కోల్పోయేవారు . ఈ విషయంలో స్థానిక పోలీస్ అధికారులు డ్రంక్అండ్ డ్రైవ్ నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవడం వల్ల ఈ ప్రమాదాలను దాదాపుగా నియంత్రించగలిగాము. ఇక దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు అతివేగం వల్ల జరిగే ప్రమాదాలను అరికట్టేందుకు మరిన్ని చర్యలు తీసుకోవాలని ప్రణాళికా సిద్దం చేసుకున్నాము. ఈ ఏడాది నిందితులకు శిక్ష ఖరారు చేసేందుకు గాను పోలీస్ పరిశోధన అధికారులు చేసిన కృషి అభినందనీయం. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పోలీస్ శాఖ సామాజిక సమస్యలపై పోరాటం చేస్తున్న తీరు తెలిసిందే.

ఎటీఎంలలో నో మనీ..



- ఇబ్బందుల్లో ప్రజలు
- ఎటీఎంలు ఉన్నా ప్రయోజనం శూన్యం
- డబ్బులు లేక వెనుదిరుగుతున్న వైనం

విజయక్రాంతి, కామారెడ్డి: కొత్త సంవత్సర వేల ఎటీఎంలలో నో మనీ.. బ్యాంకుకు వెళ్ళాలంటే తీరిక లేని వైనం కాని డబ్బులు కావాలి. ఎలా? ఎలా.. ?ఎలా..? అందరి మదిని తొలిస్తున్న అతి పెద్ద ప్రశ్న ఇది. కాని సమాధానం మాత్రం లేదు. ప్రజలు బ్యాంకుల చుట్టూ తిరిగే పని లేకుండా డబ్బులు డ్రా చేసుకునే వెసులుబాటు కలిపించేలా ఎటీఎంలు అందుబాటూలో ఉంచారు. కొద్ది రోజుల పాటు ఎటీఎం సెంటర్లు బాగానే పని చేసినా కాలక్రమేనా వాటిలో డబ్బు లు లేక పని చేయకుండా పోయాయి. పేరుకు మాత్రమే ఎటీఎం సెంటర్లు అన్న తీరుగా తయరైంది. ఎటీఎంల ముందు ఫోటోలు దిగడానికి తప్ప అందులో డబ్బులు లేకుండా పోయాయి. ఏ ఎటీఎంలకు వెళ్ళినా ప్రజలు బారులు తీరుతున్నారు. కామారెడ్డి పట్టణంలో సుమారు 20 ఎటీఎం కేంద్రాలు ఉన్నాయి. 20 ఎటిఎంలు ఉన్నా రెండు లేదా మూడు ఎటిఎంలలో మాత్రమే డబ్బులు ఉంటాయంటే ఆశ్చర్యం వేయక మానదు. ఇది ప్రస్తుత ఎటీఎంల పని తీరు.

కొత్త సంవత్సరానికి డబ్బులు లేవు..

తెల్లవారితే కొత్త సంవత్సరం. కాని 31 రాత్రే సంబరాలు జరుపుకోవాలి. కాని చేతిలో చిల్లిగవ్వ కూడా లేదు. అకౌంటులో డబ్బులు ఉన్నాయి బ్యాంకుకు వెళ్ళే తీరిక లేదు కదా అని ఎటీఎం సెంటరకు వెళ్తే అక్కడ నోమనీ. ఏ ఎటీఎం సెంటరుకు వెళ్ళినా ఇదే తీరు. డబ్బులు ఉన్న ఎటీఎం వద్దకు వెళ్తే సినిమా టాకీసులో టికెట్ల కోసం ఉన్న లైను ఉంది అక్కడ. దాంతొ ఏమి చేయలేక వెనుదిరగాల్సిన పరిస్థితి. పోనీ ఎవరినైనా చేబదులు అడుగుదామా అని చూస్తే అందరిది దాదాపు అదే పరిస్థితి. ప్రస్తుతం అంతటా ఇదే పరిస్థితి. ఇదే విధానం కొనసాగితే రాబోవు రోజుల్లో ఆన్లైన్‌లో మాత్రమే డబ్బులు లభిస్తాయి అన్న బోర్డులు కనిపించినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. ఇకనైనా బ్యాంకు అధికారులు ఎటీఎంలలో తగినన్ని నగదును అందుబాటులో ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

భగీరథ ద్వారా మంచినీటిని అందించాలి



విజయక్రాంతి, ఆర్మూర్: ఆర్మూర్‌లో ప్రతి ఇంటికి మంచినీటిన్ని అందించాలని మున్సిపాల్ సమావేశంలో కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. పట్టణంలోని మున్సిపాల్ కార్యాలయంలో చేర్‌పర్సన్ స్వాతిసింగ్‌బబ్లూ ఆధ్యక్షతన సాధరణ సమావేశం నిర్వహించారు. మున్సిపాల్ సమావేశాన్నికి మోజార్టీ సభ్యులు హాజరు కావటంతో సమావేశంను మున్సిపాల్ కౌన్సిలర్ శైలజ ప్రారంభించారు. కౌన్సిలర్లు మాట్లాడుతూ.. మిషన్ భగీరథ నీళ్లు అన్ని కాలనీలకు రావడం లేదని అంతేకాకుండా కొన్ని వార్డుల్లో పనులు చేసిన నీళ్లు ఇంత వరకు అందించలేదన్నారు. నీటిని అన్ని వార్డులోకి తీసుకురావడాన్నికి కృషి చేస్తున్నామని పంచాయితీరాజ్ అధికారులు తెలిపారు. భగీరథ పనులు చేసిన సమయంలో రోడ్లు కాలనీల్లో ధ్వంసం అయ్యాయని తెలిపారు. వాటికి మరమ్మత్తులు చేపట్టాలని సభ్యులు కోరారు. పనుల్లో భాగంగా వీటిని మిషన్ భగీరథ కాంట్రాక్టర్లు పూర్తి చేస్తారని అధికారులు తెలిపారు. వీటిని తోందరగా పూర్తి చేసి కాలనీ వాసులకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.ఆనంతరం మున్సిపాల్ చేర్‌పర్సన్ స్వాతిసింగ్‌బబ్లూ తన ఛాంబర్‌లో విలేఖరుల సమావేశం నిర్వహించారు. 14వ ఫైనాన్స్‌కు సంబంధించిన నిధులను 15 రోజుల్లో టెండర్లు పిలుస్తామన్నారు. వీటితో రోడ్లుతోపాటు ఆయా కాలనీల్లో అవసరం అయిన పనులు చేపట్టుతామని తెలిపారు. ఆర్మూర్ సుందరీకరణ పనులకు నిధులను ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సహకారంతో పూర్తి చేసి మున్సిపాలీటికి మంచి గుర్తింపు తీసుకువస్తామన్నారు. ఆర్మూర్‌లోని ప్రతి వార్డుకు రోడ్లు సౌకర్యం కల్పించాలని ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ప్రధాన కాలనీల్లో బిటి రోడ్లు నిర్మించడాన్నికి ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ద్వారా నిధులు తీసుకువస్తామన్నారు.మున్సిపాల్ సమావేశంలో 42 అంశాల పై చర్చ జరిగింది.ఈ కార్యక్రమం లో వైస్ ఛేర్మన్ లింగాగౌడ్, కౌన్సిలర్లు వన్నెల్‌దాస్ లత,పూల నర్సయ్య, పండిత్ ప్రేమ్, కొక్కుల రామాకాంత్, పోల మధుకార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన రక్షణ కల్పిస్తాం

విజయక్రాంతి, జోగుళాంబ గద్వాల: ప్రజలకు గతేడాది కంటే మెరుగైన రక్షణ కల్పించేందుకు కృషి చేస్తామని, గతేడాది కంటే ఈ ఏడాది నేరాల సంఖ్య తగ్గిందని, ప్రజలకు జవాబుదారీగా పోలీసుశాఖ వ్యవహరిస్తుందని జోగుళాంబ గద్వాల జిల్లా ఎస్పీ లక్ష్మీనాయక్ అన్నారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. 2017లో 3168 కేసులు నమోదయ్యాయని, 2018లో 2705 కేసులు నమోదయ్యాయన్నారు. గతేడాది కంటే కేసుల సంఖ్య తగ్గిందన్నారు. ఆస్తులకు సంబంధించిన కేసులు 125 నమోదయ్యాయని, అందులో రూ. 45,85,829 ఆస్తినష్టం సంభవించిందని, అందులో రూ.17,91,165 రికవరీ చేయడం జరిగిందన్నారు. జిల్లాలో గేమింగ్ యాక్టు కింద 54 కేసులు, గుట్కా కేసులు 43, నకిలీ విత్తనాలు 19, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా కేసులు 59, ఇసుక అక్రమ రవాణా 185 కేసులు నమోదయ్యాయన్నారు. అదేవిధంగా జిల్లాలో కార్డెన్‌సెర్చ్‌లు 15 చోట్ల నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లాలో 160 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, గ్రామీణ ప్రాంతాల్లో కూడా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. లా అండ్ ఆర్డర్‌ను పరిరక్షించడంలో పోలీసులు ముందున్నార న్నారు. వారితో పాటు స్టూడెంట్ పోలీస్ క్యాడెట్, సోషల్ మీడియాలో పుకార్ల నియంత్రణతో పాటు షీ టీమ్‌ల ద్వారా బాలల హక్కుల పరిరక్షణ, మహిళలకు రక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందన్నారు. కొత్త ఏడాది నుంచి జిల్లాలో ఈ – చలాన్ విధానాన్ని ప్రవేశపెట్టడం జరుగుతుందన్నారు. 01.01.2019న జిల్లా కలెక్టర్ శశాంక చేతుల మీదుగా ఈ –చలాన్ పద్దతిని ప్రారంభించడం జరుగుతుందన్నారు.

ట్రాఫిక్ పోలీసులలో జవాబుదారీతనం పెంచేందుకు హైదరాబాద్ తరహాలో ఈ –చలాన్‌ను ప్రవేశపెట్టడం జరుగుతుందన్నారు. 2018లో ఎన్నికలను ప్రశాంతంగా అందరి సహకారంతో నిర్వహించడం జరిగిందన్నారు. ఎన్నికల నియమావాళిని పకడ్బందీగా అమలు చేశామని, ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై 55 కేసులుకేసులు నమోదయ్యాయన్నారు. కొత్త సంతవ్సరంలో ప్రజలకు మేలు జరగాలని, పోలీసులు మరింత భాధ్యతాయుతంగా పనిచేస్తారని ఆయన అన్నారు.

అసాంఘిక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విజయక్రాంతి, నాగర్‌కర్నూల్: సమాజంలో అసాంఘీక శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉన్నప్పుడే శాంతిభద్రలు కాపాడవచ్చునని డీఎస్పీ లక్ష్మినారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన నిర్భంద తనిఖీల అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రజల భద్రతా రక్షణ కొరకే పోలీసులు ఎప్పటికప్పుడు తనిఖీలు ముమ్మరం చేస్తున్నారని తెలిపారు. జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీ, అయ్యప్ప స్వామి ఆలయం సమీపంలో నిర్వహించిన తనిఖీలలో విస్తృతంగా 109 గృహాలలో సోదాలు నిర్వహించినట్లు తెలిపారు . 35 ద్విచక్ర వాహనాలు, మూడు కార్లు,మూడు ఆటోలను తనిఖీలు చేయడం జరిందని ఆయన తెలిపారు .ఇతర ప్రాంతాల నుండి ఇక్కడికి వచ్చి దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉన్నందున పరిచయాలు లేని వ్యక్తులకు గృహాలకు అద్దెకు ఇవ్వరాదని సూచించారు . ఎవ్వరైనా అనుమానితులు సంచరిస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే 100కు డయల్ చేయాలని కోరారు . కాలనీ వాసులు , నేను సైతం కమ్యునిటీ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వాహనాలకు ధృవపత్రాలు లేని వాటిని గుర్తించి స్వాదీనం చేసుకున్నారు .ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ సీఐ శ్రీనివాస్‌రెడ్డితో పాటు ఎస్ఐలు, ఏఎస్ఐలు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మా కాలనీలకు రక్షణ కల్పించండి

విజయక్రాంతి, మహబూబాబాద్: కవిత కాలనీ, జర్నలిస్టు కాలనీ, కన్నన్న కాలనీలలోని కాలనీ వాసులపై కొంత మంది దౌర్జన్యం చేస్తున్నారని, మా కాలనీ వాసులకు రక్షణ కల్పించాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆర్‌డీఓ కొమురయ్య, తహసీల్దార్ బన్సీలాల్‌లకు వినతిపత్రం సమర్పించారు. వారు ఈ విధంగా మాట్లాడుతూ.. మహబూబాబాద్ శాసనసభ్యురాలుగా మాలోతు కవిత, రెవిన్యూ అధికారులు 2010లో ప్రభుత్వ స్థలంలో ఇంటి పట్టాలు ఇచ్చి కాలనీల పేర్లు నామకరణం చేసి బోర్డులు ఏర్పాటు చేశారన్నారు. అందులో జర్నలిస్టుల పేర 25 మందికి ఎ.1–06 గుంటలు కేటాయించినారు. మా మూడు కాలనీలకు ఇంటి పట్టాలు, ఇంటి నెంబర్లు, విద్యుత్ మీటర్లు, విద్యుత్ సౌకర్యం ఉన్నాయన్నారు. గత 20 రోజుల నుంచి రాజోలుకు చెందిన ఒబిలిశెట్టి శ్రీనివాస్, ఒబిలిశెట్టి శివ, దారావత్ రవి, దారావత్ బాలు ఇక్కడ మా భూమి ఉన్నదంటూ కాలనీ వాసులపై దౌర్జన్యానికి దిగుతున్నారు. అంతే కాకుండా నివాస ప్రాంతాలను పాక్షికంగా ధ్వసం చేశారు. వారికి ఎలాంటి పట్టాలు కాని, హక్కులు కాని లేవని, వారిపై చర్య తీసుకొని మా కాలనీ వాసులకు రక్షణ కల్పించాలని వారు కోరారు.

పూర్తి స్థాయిలో విచారణ జరపాలి..

ఆర్‌డీఓ, తహశీల్దార్‌లు పూర్తి స్థాయి విచారణ చేపట్టి పేదలైన మూడు కాలనీ వాసులకు రక్షణ, భద్రత కల్పించాలని కోరారు. సంబంధిత వ్యక్తులను విచారించి నిజా నిజాలు నిగ్గు తేల్చాలన్నారు. 2005 నుంచి నేటి వరకు జరిగిన పరిణామాలను కూలంకషంగా అజయ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్, రేశపల్లి నవీన్, కాలనీ వాసులు పెద్దోజు నాగరాణి, మెట్టు మధు, కవిత, పార్వతి, ఉపేంద్ర, శాంతి, సుమారు 50 మంది పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తి బదిలీ

విజయక్రాంతి, ఆదిలాబాద్: జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక బదిలీ అయ్యారు. గత ఐదేళ్లుగా వివిధ స్థాయి న్యాయమూర్తి హోదాల్లో జిల్లాలో ఆమె సేవలందించారు. హైకోర్టు విభజన నేపథ్యంలో జరిగిన న్యాయమూర్తుల బదిలీల్లో భాగంగా ఆమె ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా ఫ్యామిలీకోర్టు న్యాయమూర్తిగా బదిలీపై వెళ్లనున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ దివ్యదేవ రాజన్, ఎస్పీ విష్ణు ఎస్.వారియర్‌లు సోమవారం ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. లోక్‌అదాలత్, న్యాయసేవ సదస్సుల నిర్వహణతో న్యాయవ్యవస్థపై అవగాహన కల్పించడంతో పాటు ప్రజలకు న్యాయవ్యవస్థను చేరువచేశారని వారు అభినందించారు. వివిధ సామాజిక సేవ కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు జిల్లా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజల్లో చిరకాలం గుర్తుండే విధంగా జిల్లా న్యాయమూర్తి సేవలను కొనియాడారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి



విజయక్రాంతి, పటాన్‌చెరు: రామచంద్రాపురం పట్టణంలోని శ్రీనివాసనగర్ కాలనీలోని పరిసర ప్రాంతాలలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయాలని జిల్లా బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు బలరాం డిమాండ్ చేశారు. సోమవారం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను బాగుచేయాలని కోరుతూ జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ హరిచందనను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. డ్రైనేజీలు పొంగి నీరు ఇళ్లలోకి వస్తున్నాయన్నారు. ప్రజలు ఇళ్లల్లోకి రాకపోకలకు కూడా ఇబ్బందిగా ఉంటుందని పేర్కొన్నారు. దీనిపై జోనల్ కమిషనర్ స్పందిస్తూ తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారని అన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట రీత్యా నేరం

విజయక్రాంతి, నిర్మల్: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట రీత్యా నేరమని, చేసిన వారికి 5 సంవత్సరాలు జైలు శిక్షతో పాటు రూ. 50వేల జరిమానా విధించడం జరుగుతుందని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి జలపతినాయక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని వైద్యారోగ్య శాఖ కార్యాయంలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్కానింగ్ ప్రభుత్వ, ప్రైవేటు సెంటర్లలో లింగ నిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరమని, అందుకు 5 సంవత్సరాల పాటు జైలు శిక్షతో పాటు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. ప్రి కన్సిసిప్షన్ అండ్ ప్రి వాటర్ డైయాగ్నోస్టిక్ టెక్నాలజీస్ యాక్ట్ 1994 నియామాలు 1996ను అనుసరించి చర్యల తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఈ చటటం పకడ్బందీగా అమలుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ చట్టం గురించి సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో వైద్యులు స్వప్న, రజిని, సురేందర్, డీపీఆర్వో ఖలీం తదితరులు పాల్గొన్నారు.

సమర్ధతతోనే గుర్తింపు

విజయక్రాంతి, రామగుండం: విధి నిర్వహణలో చూపించే సమర్థతత ఎప్పటికి సముచిత గుర్తింపును ఇస్తుందని పలువురు పేర్కొన్నారు. సింగరేణి రామగుండం రీజియన్‌లోని పలు బొగ్గు గనుల్లో పదవీ విరమణ పొందిన కార్మికులను తోటి కార్మికులు, అధికారులు సోమవారం ఘనంగా వీడ్కోలు పలికారు. భూగర్భ, ఉపరితల బొగ్గు గనుల ప్రాంగణాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పదవీ విరమణ పొందిన కార్మికులను ఘనంగా సత్కరించారు. విధి నిర్వహణలో వారు అందించిన సేవలను కొనియాడారు. ఆర్‌జీ–1 జీఎం కార్యాలయంలో ఫారెస్ట్ విభాగం, పర్సనల్ డిపార్ట్‌మెంట్లలో సుదీర్ఘకాలం విధులను నిర్వహించి పదవీ విరమణ పొందిన గొడుగు రాజయ్య, సందె లక్ష్మీలను అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో అధికారులు బి.హన్మంత రావు, త్యాగరాజు, డేవిడ్ అభిలాష్, గంగాధర్, సలీం, సమ్మయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. కాగా, మంచిర్యాల జిల్లా లక్షెటపేట పోలీసు స్టేషన్‌లో ఎఎస్ఐగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన గామాస జ్ఞానయ్యను రామగుండం పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో డీసీపీ (అడ్మిన్) ఎన్.అశోక్ కుమార్ పూలమాలలతో ఘనంగ సత్కరించారు. శేష జీవితం సుఖమయం కావాలని కాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషినల్ డీసీపీ (లాఅండ్ఆర్డర్) ఎం.రవికుమార్, పోలీసు కమిషనరేట్, పోలీసు ఉద్యోగుల సంఘం అధ్యక్షులు పోచ లింగం పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం

విజయక్రాంతి, నిర్మల్: జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో సోమవారం పదవీ విరమణ పోందిన ఏఎస్సై రాములు, ఏఆర్‌హెచ్‌సీ పీ రాములు లను జిల్లా ఎస్పీ శశిధర్ రాజు ఘనంగా సన్మానించారు. పూలమాల, శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ. పోలీసు ఉద్యోగ నిర్వాహణలో అంకిత భావంతో పని చేసి అందరి మన్ననలు పోందారన్నారు. పోలీసు రిటైర్‌మెంట్ కేవలం తన వృత్తికే కానీ, తన వ్యక్తిత్వానికి కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ దక్షిణమూర్తి, పోలీసులు ఖరీం, వీరాసత్ ఆలీ, సంజీవ్, మురాద్ ఆలీ, గంగాధర్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి

విజయక్రాంతి, పరిగి: బైక్ నడిపించే ప్రతి ఒక్కరూ కూడా హెల్మెట్ ధరించాలని వికారాబాద్ జిల్లా రవాణా అధికారి వాణి అన్నారు. సోమవారం పరిగి నియోజకవర్గ కేంద్రంలోని కొడంగల్ చౌరస్తాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాదారును ఉద్దేశించి మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం ద్వారా బైక్‌పై ప్రమాదవశాత్తు ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ మన ప్రాణాలను కాపాడుతుందని అందుకే హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లాలో హెల్మెట్ నిబంధనలు అమలు చేశామన్నారు. హెల్మెట్ లేకుండా తొలిసారి పట్టుబడితే చలాన్ విధిస్తామని, రెండవ సారి పట్టుబడితే జరిమానా విధిస్తామని, ముడోసారి పట్టుబడితే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ విషయాలను ప్రజలందరు గమనించాలని పేర్కొన్నారు.

అడ్డదారుల్లో నవోదయ ప్రవేశాలు

- అర్బన్‌లో చదువు, రూరల్‌లో ఉన్నట్టు రికార్డులు
- చైల్డ్ ఇన్ఫోతో ఒరిగిందేమీ లేదు
- నష్టపోతున్న పేద రూరల్ విద్యార్థులు
- విద్యాధికారుల అలసత్వమే కారణం

విజయక్రాంతి, చెన్నూరు (మంచిర్యాల): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే విద్యాసంస్థల్లో జవహర్ నవోదయ విద్యాలయాలు కూడా దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందాయి. ఇందులో ప్రవేశానికి గానూ ఏటా 6వ తరగతిలో ప్రవేశ పరీక్ష ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. దీనికి ఉన్న ఆదరణతో అనేక కోచింగ్ సెంటర్లు మన రాష్ట్రంలో చాలా వెలిశాయి. ఈ సెంటర్ల ద్వారా కోట్ల రూపాయలు వసూలు అవుతున్నట్లు సమాచారం. ఈ కోచింగ్ సెంటర్ల ద్వారా ఎవరు లబ్ధి పొందుతున్నారు. ఎలా లబ్ధి పొందుతున్నారు అనే విషయాలను **'విజయక్రాంతి'** మీ ముందు ఉంచుతోంది.

రిజర్వేషన్ల ప్రతిపాదికనా అడ్మిషన్లు: నవోదయ ప్రవేశ పరీక్షలో విద్యార్థులు పొందిన మార్కులు రూరల్, కులాల వారీగా ఈ సీట్లు పొందే అవకాశం విద్యార్థులకు ఉంది. ముఖ్యంగా రూరల్ 80 శాతం రిజర్వేషన్లు, అర్బన్ విద్యార్థులకు 20శాతం రిజర్వేషన్లతో విద్యార్థులకు సీట్లు కేటాయిస్తున్నారు. దీన్ని ఆసరగా చేసుకుని కొన్ని కోచింగ్ సెంటర్లు, తల్లిదండ్రులు రూరల్ విద్యార్థులకు అన్యాయం జరిగే విధంగా ప్రణాళికలు తయారుచేసుకుని రూరల్ విద్యార్థులకు రావలసిన సీట్లు సైతం అర్బన్ విద్యార్థులకు కట్టబెడుతున్నారు.

నిబంధనలు తుంగలో: 80 శాతం రిజర్వేషన్లు కలిగిన రూరల్ విద్యార్థులపై కన్నేసిన కోచింగ్ సెంటర్లు అర్బన్‌లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులను రూరల్‌లో చదువుతున్న రికార్డులు చూపిస్తూ కోచింగ్ సెంటర్ పేరుతో మోసాలకు పాలుపడేవారిని ఏం చేయలేని దుస్థితిలో విద్యాశాఖ పనితీరు ఉండటంతో ఇంకా రెచ్చిపోయిన కోచింగ్ సెంటర్లు ఫీజుల పేరుతో రూపాయలు దండుకుంటున్నారు. ఉదాహరణకు ఒక విద్యార్థి అర్బన్‌లో 1వ తరగతి నుంచి 4వ తరగతి వరకు చదువుతున్నాడు. కానీ 5వ తరగతిలో ఈ కోచింగ్ సెంటర్‌లో చేరిన వారిని "అర్బన్" విద్యార్థులుగా నవోదయ ఎంట్రెన్స్‌లో ప్రవేశా నికి నమోదు చేస్తున్నారు. ఇది ఎలా సాధ్యం అనేది ఆలోచిస్తే రూరల్‌లోని పలు పాఠశాలలు, కోచింగ్ సెంటర్లు కుమ్మకై ఈ తరహా మోసాలు చేస్తున్నారు. దీని వలన రూరల్ చదువుతూ కోచింగ్‌లకు వెళ్ళలేని నిరుపేద విద్యార్థులకు ఇది శాపంగా పరిణమిస్తోంది.

చైల్డ్ ఇన్ఫో బుట్టదాఖలేనా: ఒక విద్యార్థి ఏ తరగతిలో ఏ పాఠశాలలో చదువుతున్నాడో, చదివాడో తెలిసే వీలు ఈ చైల్డ్ ఇన్ఫో ద్వారా తెలుసుకునే వీలుంటుంది. ఒక వేళ ఒక విద్యార్థి 1 నుండి 4వ తరగతులు ఒక పాఠశాలలో చేరినట్లయితే , ఆ విద్యార్థిని పేరును 'చైల్డ్ ఇన్ఫో' నుంచి ఆ పాఠశాల వారు మాత్రమే 'డ్రాప్ అవుట్' చెయ్యాలనే నిబంధన ఉన్నప్పటికి మండల శాఖ అధికారులు అత్యుత్సాహంతో వారే 'డ్రాప్ అవుట్'గా పరిగణిస్తున్నారు. కాబట్టి ఇప్పటికైనా విద్యాశాఖ ఈ ప్రవేశాలపై దృష్టి సారించాలని ఆశిద్దాం.

నిజాలు నిగ్గుతేలేనా?: గత కొన్ని సం॥రాలుగా నవోదయా విద్యాలయాల్లో ప్రవేశం పొందిన విద్యార్థుల వివరాలను పరిశీలించినట్లయితే ఎలాంటి మోసాలతో కొందరు విద్యార్థులు ఈ ప్రవేశాలు పొందారో తెలుస్తుంది. ఇలాంటి తరహా మోసాలను అరికట్టాలంటే ప్రవేశం విధానాన్ని కఠినతరం చేయాల్సిన అవసరం ఎంతైన ఉంది. ఈ నేపథ్యంలో నిజాలు నిగ్గుతేలేనా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

ఉనికి కోసమే విద్యార్థి సంఘాలు: కొన్ని విద్యార్థి సంఘాలు అనవసర విషయాలను రాద్ధాంతం చేస్తూ కేవలం వారి ఉనికి కోసమే పరితపిస్తారనేది ఈ విషయంలో తేటతెల్లం అయింది. డిసెంబర్ 21వ తేదిన **సి.వి.ఆర్ ఛానల్, విజయక్రాంతిలో**, 22వ తేదిన వరుస కథనాలను లతా కోచింగ్ సెంటర్ మందమర్రిపై వచ్చినప్పటికినీ, విద్యార్థి సంఘాలు మౌనంగా ఉండిపోవడం వెనుక మతలబు ఏమిటని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. అనుమతి లేని నవోదయా కోచింగ్ సెంటర్ నడుపుతున్న లతా కోచింగ్ సెంటరుపై విద్యార్థి సంఘాలు ప్రశ్నించకపోవడం శోచనీయం

విద్యాశాఖలో కదలిక: వరస కథనాలతో స్పందించిన విద్యాశాఖ అధికారులు షోకాజ్ నోటీసుతో చేతులు దులుపుకున్నారు. కానీ లతా కోచింగ్ సెంటర్‌తో పాటు వసతి గృహాన్ని వేరే ప్రాంతానికి తరలించి యదేచ్ఛగా నడుపుతున్నట్లు పక్కా సమాచారం. దీనిపై విద్యాశాఖ స్పందిస్తూ, మా పరిధిలో లతా కోచింగ్ సెంటర్‌తో పాటు వసతి గృహాన్ని మూసివేయాలని ఆదేశించామని, వారు మూసివేసినట్లు మాకు సమాచారం అందిందని ఒక వేళ నడుపుతున్నట్లు ఎవ్వరైనా పక్కా సమాచారం ఇస్తే తగు చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ అధికారి అన్నారు.

చెల్లింపులో ఆలస్యం.. చేతులెత్తేసిన కాంట్రాక్టర్‌లు



విజయక్రాంతి, తాండూరు: ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా తాండూరు పట్టణంలో అభివృద్ధి ఆగిపోయింది. కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించడంలో ప్రభుత్వ నిర్లక్ష ధోరణి కారణంగా ఉన్న పనులను అధికారులు నిలిపి వేశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో తాండూరు నియోజక వర్గంలో టీఆర్ఎస్ పార్టీ ఓటమి చెందడంతో అభివృద్ధి పనులను నిలిపి వేసినట్లు తాండూరులో పూకార్లు వినిపిస్తున్నాయి. తాండూరు పట్టణంలోని ప్రధాన రహాదారులను విస్తరించాలన్న ఉద్దేశ్యంతో అప్పట్లో తాండూరు పర్యటనకు వచ్చిన ఐటి శాఖ మంత్రి కేటీఆర్ రూ.50 కోట్లు నిధులు విడుదల చేశారు. దీంతో తాండూరు పట్టణంలోని ప్రధాన రోడ్లను విస్తరించాలని ప్రభుత్వం భావించి రోడ్ల విస్తరణ కార్యక్రమానికి సిద్ధమైంది. పనులను సైతం ప్రారంభించారు. అయితే అనుకోకుండా సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఆగమేఘాలపైన తాండూరు పట్టణంలో అభివృద్ధి పనులను చేపట్టారు. దీంతో తాండూరు పట్టణంలోని రోడ్ల పనులు పూర్తి చేస్తారని పట్టణ ప్రజలు భావించారు. తాండూరు మున్సిపల్ పరిధిలో చేపట్టిన పనులను గాను ఇప్పటి వరకు సుమారు రూ.70 లక్షలు కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించాల్సి ఉంది. బిల్లులు సకాలంలో చెల్లించక పోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపి వేశారు. దీనిపై కొత్తగా తాండూరు ఎమ్మెల్యేగా గెలుపొందిన పైలెట్ రోహిత్ రెడ్డి ఆరా తీస్తున్నారు. వెంటనే పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడిన రోహిత్‌రెడ్డి పనులు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. మరో రెండు రోజులలో పనులు చేపట్టనున్నట్లు కాంట్రాక్టర్ తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి హామి ఇచ్చారు.

ఖమ్మం జిల్లాపై 'చలి'పంజా

విజయక్రాంతి, పాలేరు: ఖమ్మం జిల్లాను చలిపులి వణికిస్తోంది. పెథాయ్ తుపాన్ ప్రభావమేమో కానీ జిల్లాలో చలి తీవ్రత అధికమైంది. చల్లటి ఈదురుగాలులు వీస్తుండటంతో గంటగంటకు ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. ఉదయం, రాత్రి సమయాల్లో ప్రజలు బయటకు వెళ్లాలంటేనే జంకుతున్నారు.. వృద్ధులు, పిల్లలు చలి ప్రభావంతో తీవ్ర ఆనారోగ్యానికి గురువుతూ ఆసుపత్రుల పాలవుతున్నారు. ఖమ్మం జిల్లాలో చలితీవ్రత అధికమైంది. ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో 17 డిగ్రీల కంటే తక్కువగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నట్లు వాతావరణ శాఖాధికారులు చెబుతున్నారు. దీంతో ప్రజలు చలికి వణికిపోతున్నారు. వాహనాదారులు, డ్రైవర్లు వాహనాలను నడిపే విషయంలో ఇబ్బందులు పడుతున్నారు. మోటర్ సైకిళ్లపై ప్రయాణం చేసే ప్రయాణికులు పూర్తిగా తగ్గించారు. ఇదిలా ఉంటే చలి తీవ్రతకు వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. శ్వాసకోస వ్యాధులతో జ్వరాల భారీన పడి అస్వస్థతకు గురువుతున్నారు. మన్యం చలి తీవ్రతతో గజగజ వణికిపోతున్నారు. భద్రాచలం, ఇల్లందు, మణుగూరు, బయ్యారం, టేకులపల్లి, ఆశ్వాపురం, అశ్వరరావుపేట, పినపాక తదితర మన్యం ప్రాంతాల్లో చలి తీవ్రతతో ఉష్ణోగ్రతలు మరింతగా కనిష్ట స్థాయికి పడిపోయాయి. దీంతో స్వెట్టర్లు, మంకి క్యాప్‌లు లాంటి వెచ్చదనాన్నిచ్చే వస్త్రాలకు బాగా డిమాండ్ పెరిగింది. చలినేస్తాలకు మరింతగా గిరాకీ పెరిగిపోయింది. చలికి వైద్య నిపుణులు సూచించిన జాగ్రత్తలకు తూచ తప్పకుండా పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు.

కార్డెన్ సెర్చ్‌లో 30 టూ వీలర్, 4 కార్లు స్వాధీనం

విజయక్రాంతి, ఆదిలాబాద్: జిల్లాకేంద్రంలోని మసూద్‌చౌక్‌లో పోలీసులు సోమవారం కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ విష్ణు ఎస్.వారియర్ ఆధ్వర్యంలో వేకువజామునే కాలనీకి చేరుకున్న వంద మంది పోలీసులు ప్రత్యేక బృందాలుగా విడిపోయి ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. కాలనీలోని ప్రతి ఇంటికి వెళ్లీ సోదాలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా ఎలాంటి ధృవీకరణపత్రాలు లేని 30 ద్విచక్రవాహానాలు, తొమ్మిది ఆటోలు, నాలుగు కార్లను స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు.

ఈ సందర్భంగా కాలనీవాసులతో మాట్లాడిన జిల్లా ఎస్పీ వారికి పలు సూచనలు చేసారు. ప్రశాతం జీవనం సాగించేందుకు పోలీసుల సూచనలు, నిబంధనలను పాటించాలన్నారు. కాలనీల్లో ఎలాంటి అసాంఘీక కార్యకలా పాల కు అవకాశమివ్వవద్దని ఏ ఒక్క చెడు సంఘటన జరిగిన కాలనీ మొత్తానికి మచ్చ వస్తుందనే విషయాన్ని గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ నర్సింహారెడ్డి, సీఐలు సురేష్, నాగారాజు, ప్రదీప్‌కుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా: కోరుకంటి

విజయక్రాంతి, రామగుండం: ప్రజలకు అందుబాటులో ఉండటమే ప్రజాప్రతినిధి ప్రథమ కర్యవ్యమని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. గోదావరిఖని పాత డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోకి ప్రవేశ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండటానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఏర్పాటు చేసిందన్నారు. అంతే కాక ఈ కార్యాలయంలోనే ప్రజాప్రతినిధి నివాసాన్ని కల్పించడం హర్షదాయకమన్నారు. దీని వల్ల ప్రజల సమస్యలను తక్షణం ప్రజాప్రతినిధి తెలుసుకోవడమే కాకుండా ఆ సమస్యలకు యుద్ధ ప్రాతిపదికన పరిష్కారం చూపవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులతో పాటు మాజీ మేయర్, డిప్యూటీ మేయర్ కొంకటి లక్ష్మీనారాయణ, సాగంటి శంకర్, కార్పొరేటర్లు కుంట సాయి, చుక్కల శ్రీనివాస్, బద్రి రజిత, రవినాయక్, తస్లీంబాను, బుచ్చిరెడ్డి, నాయకులు దీటి బాలరాజు తదితరులున్నారు. కాగా, గత కొన్నేళ్లుగా నిరుపయోగంగా వున్న రామగుండం నగరపాలక దుకాణ సముదాయాన్ని ఎమ్మెల్యే చందర్ పరిశీలించారు. ఈ సముదాయాన్ని ఉపయోగంలోకి తేవడానికి తక్షణ చర్యలు చేపట్టాలని మేయర్ జాలి రాజమణి, కమిషనర్ బి.శ్రీనివాస్‌ను ఆయన ఆదేశించారు. అదే విధంగా పాలకుర్తి మండలంలోని కుక్కల గూడురులో కొత్తగా నిర్మించిన బ్రిడ్జిని ఎమ్మెల్యే ప్రారంభించగా, అంతర్గాం మండలం పుట్నూరులో అభివృద్ధి పనుల నిర్మాణాలను భూమి పూజ నిర్వహించారు.

ఎమ్మెల్యేకు అరుదైన గౌరవం



విజయక్రాంతి, తాండూరు: తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డికి అరుదైన గౌరవం దక్కింది. భారత దేశంలో ప్రతిష్టాత్మకంగా ఎంఐటి స్కూల్ ఆఫ్ గవర్నమెంట్ పూణె వారు జాతీయ యువజన దినోత్సవం రోజున ఎంఐటి విధ్యాసంస్థలో శిక్షణ పొందుతున్న విధ్యార్థులను ఉద్యేశించి ప్రసంగించే అవకాశం లభించింది.జనవరి 12న నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో పైలెట్ పాల్గొంటున్నారు. గత 13 సంవత్సరాలుగా సుమారు 500 మంది యువ రాజకీయ నాయకులుగా తయారు చేసిన సంస్థ నుంచి పైలెట్ ప్రసంగించనున్నారు.

అభివృద్ధి వైపు అడుగులు

విజయక్రాంతి, ఆదిలాబాద్: నూతన సంవత్సరంలో శాఖపరంగా నవశాఖానికి అభివృద్ధి బాటలు వేయాలని జిల్లా కలెక్టర్ దివ్యదేవరాజన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో నిర్వహించిన ప్రజావాణీలో అధికారులనుద్దేశించి మాట్లాడారు. శాఖాధికారులు అభివృద్ధి వైపు మూడు లక్ష్యాలను ఎంచుకొని ఆ దిశగా పయనించాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం చల్లనిగాలులతో కూడిన వాతావరణం ఉన్నందున పిల్లలు, వృద్ధులు ఆరోగ్యరీత్యా ఎలాంటి జాగ్రత్తలు చేపట్టాలనే దానిపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. సంక్షేమ వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు దుప్పట్లు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రిమ్స్‌లో వైద్యసేవలు పొందుతున్న రోగులకు గాలుల తీవ్రత తగలకుండా కిటికిలకు మరమ్మతులు చేపట్టాలన్నారు. తనకు శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చే అధికారులు పుష్పగుచ్ఛాలకు బదులుగా దుప్పట్లు తీసుకురావాలని తద్వారా వాటిని నిరుపేదలకు పంపిణీచేసేందుకు అవకాశముంటుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరాశ్రయులు పడుకోవడానికి ఇబ్బందులు కలుగకుండా ఎంపీడీఓలు, తహసీల్దార్లు తగు వసతులు కల్పించాలన్నారు. కిసాన్‌మిత్రకు టోల్‌ఫ్రీకి వచ్చిన సమస్యలను వారంరోజుల్లోగా పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ప్రతీక్‌జైన్, డీఆర్‌డీఓ రాఠోడ్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఏఈవోల మృతి కలెక్టర్ సంతాపం

విజయక్రాంతి, భైంసా: నిర్మల్ జిల్లా భైంసా మండలం మాటేగాం టోల్‌ప్లాజా వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఏఈవోలు విక్రమ్, అక్షయ్‌కుమార్‌లు మృతి చెందారు. పెండ్‌పెల్లి గ్రామంలో ఓ శుభాకార్యానికి వెళ్లిన ఇద్దరు ఏఈవోలు ద్విచక్రవాహానంపై తిరుగు ప్రయాణంలో భైంసాకు వస్తున్నాడు. ఈ క్రమంలో మాటేగాం టోల్‌ప్లాజా వద్ద ట్రాక్టర్‌ను ఢీ కోని మృతి చెందారు.

విక్రమ్‌ది మామడ మండలం కాగా అక్షయ్‌కుమార్‌ది హల్దా గ్రామం. ఇద్దరు యువ ఏఈవోలు మృతి చెందడంతో విషాధ ఛాయలు అలుముకున్నాయి. ఈ విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి, ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిలు మృతదేహాలను పరిశీలించారు. భైంసా ఏరియా ఆసుపత్రిలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. వ్యవసాయ శాఖ తరపున రూ. 15వేలు ఆర్థిక సాయం అందజేశారు.

కాలనీ సమస్యలు పట్టవా.?

- డ్రైయినేజీ వ్యవస్థతో సతమతం
- ఓపెన్ ప్లాట్లలోనే చెత్త
- పట్టించుకోని అధికారులు

గాయత్రి పురం: గాయత్రి పురంలో గత కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు బ్రహ్మణులకు ఈ కాలనీ కేటాయించి గాయత్రి పురంగా కాలనీకి నామకరణం చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ కానీ ఎలాంటి మౌలిక వసతులు కల్పించడంలో నిర్మల్ మున్సిపల్ అధికారులు విఫలమయ్యారు. జిల్లా ఏర్పడిన తర్వాత కాలనీ సమస్యలను మొదటి సారిగా బ్రహ్మణులందరు కలిసి కలెక్టర్‌కు విన్నవించిన ఇప్పటికీ నాలుగేళ్లు గడిచిన సమస్యలు పరిష్కారం కావడం లేదు. ఓపెన్ ప్లాట్లలో చెత్తా చెదారం పేరుకుపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో కాలనీ వాసులు విషజ్వరాల బారిన పడుతున్నారు. జిల్లా కలెక్టర్, మున్సిపల్ అధికారులు స్పందించి గాయత్రి పుర కాలనీ వాసుల సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.



విజయక్రాంతి, నిర్మల్: జిల్లా కేంద్రంలోని గాయత్రి పురం, ఆదర్శ నగర్, ఇంద్రనగర్, శాస్త్రి నగర్ కాలనీలు సమస్యలతో సతమతమవుతున్నాయి. అధికారులు చూసి చూడనట్లు వ్యవహారిస్తున్నారు. కాలనీలు ఏర్పడి ఎన్నో ఏళ్లు గడుస్తున్నప్పటికీ ఇప్పటికే మౌలిక సౌకర్యాలు కరువయ్యాయి. కనీసం రోడ్లు కూడా లేవు. డ్రైనేజీలు సైతం సక్రమంగా లేకపోవడంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే అంతే. వర్షం పడ్డా వెంటనే రోడ్లన్నీ బురదమయంగా మారి కనీసం ఇంట్లో రావడానికి కూడా ఇబ్బందిగానే ఉంటుంది.

పేదల సంక్షేమమే ధ్యేయం: ఎమ్మెల్యే గూడెం



విజయక్రాంతి, పటాన్‌చెరు: నియోజకవర్గంలోని నిరు పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం అమీన్‌పూర్ మున్సిపాలిటీలో మాజీ సర్పంచ్ మంజుల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సుమారు 50మంది యువకులను ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి వారిని టీఆర్ఎస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పటాన్‌చెరు నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని తెలిపారు. బడుగు, బలహీన వర్గాలకు అండగా సీఎం కేసీఆర్ తోడున్నారని పేర్కొన్నారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీని అన్ని హంగులతో అభివృద్ధిపరుస్తామని అన్నారు. అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూంలు మంజూరు చేయిస్తామని తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం ఇవ్వని విధంగా టీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు పిన్షన్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో గడప గడపకు గోదావరి జలాలను అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తుమ్మల పాండురంగారెడ్డి, నాయకులు నందారం నర్సింహా గౌడ్, వడ్ల కాలప్ప, యూనూస్, చంద్రశేఖర్, ఎ.శ్రీనివాస్‌రెడ్డిలు పాల్గొన్నారు.

కబ్జా చెరనుంచి విముక్తి కల్పించాలి

విజయక్రాంతి, హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలోని విలువైన కొచ్చెర్వు భూములకు కబ్జా కోరుల చెర నుంచి విముక్తి కల్పించాలని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కవ్వ వేణుగోపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. హుస్నాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దాదాపు రూ. 25కోట్ల విలువ చేసే భూములను కబ్జాదారులు అక్రమంగా అమ్ముకున్నారని ఆరోపించారు. కొచ్చెర్వుకు సంబంధించి ఐదు సర్వే నంబర్లలో సుమారు 120ఎకరాల శిఖం భూమి ఉండగా ఇందులో కొందరు రైతులు ఏక్‌సాల్ పట్టాలు కలిగి ఉన్నారని పేర్కొన్నారు. సదరు పట్టాదారులు చెరువులో నీళ్ల లేనప్పుడు మాత్రమే వ్యవసాయం చేసుకొని, నీరు చేరాక వదిలేయాల్సి ఉంటుందనీ, కానీ, ఏడేళ్ల కింద అధికారులు, రైతులు, రియాల్టర్లు కుమ్ముక్కై ఏక్‌సాల్ పట్టాలను సాధారణ పట్టాలుగా చూపి అక్రమంగా అమ్ముకున్నారని ఆరోపించారు. దీనిపై త్వరలోనే ముఖ్యమంత్రికి కలిసి వివరిస్తామని చెప్పారు.

విజ్ఞప్తులను పరిష్కరించాలి: జేసీ పద్మాకర్



విజయక్రాంతి, సిద్దిపేట: ప్రజావాణికి వచ్చే విజ్ఞప్తులను పరిశిలించి సత్వరమే పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని సిద్దిపేట జిల్లా జాయింట్ కలెక్టర్ పద్మాకర్ ఆదేశించారు. సోమావారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల విజ్ఞప్తులను ఆయన స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి డీఆర్‌వో చంద్రశేఖర్, ఆర్డీఓ జయచంద్రారెడ్డి, డీఈఓ రవికాంత్, ఆయా శాఖల అధికారులు జరినాబేగం, సాయిబాబా, వేణు మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్ సినిమాను రద్దు చేయాలి

కాంగ్రెస్ కార్యకర్తల మనోభావాలు దెబ్బతీసేలా నిర్మించిన యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్ సినిమాను వెంటనే రద్దు చేయాలని డీసీసీ మైనార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆత్తు ఇమామ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం సిద్దిపేటలోని కలెక్టరేట్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ పద్మాకర్‌కు వినతి పత్రం ఆందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ టౌన్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ సలీం, 28వ వార్డు ఇంచార్జ్ ఫయాజ్, చిన్న రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలి

- కొడంగల్ అంబేద్కర్ చౌరస్తాలో విద్యార్థుల ధర్నా

విజయక్రాంతి, కొడంగల్: కొడంగల్ నియోజకవర్గాన్ని మూడు ముక్కలు చేయకుండా ఒకటిగా ఉంచి డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తు కొడంగల్ అఖిల పక్ష పార్టీల ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులు అంబేద్కర్ చౌరాస్తాలో మానవహారం నిర్వహించి ధర్నా రాస్తారోకో చేశారు. సందర్భంగా అఖిల పక్ష పార్టీల నాయకులు డాక్టర్ వెంకటేశ్వర్లు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఇందనూర్ బషీర్, బీసి సంఘం నాయకులు బీమరాజులు మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ నియోజకవర్గంపై కక్ష సాధింపు ధోరణితో ఒకటిగా ఉన్న కొడంగల్‌ను రెండు ముక్కలు చేసింది కాక, ప్రస్తుతం మరో రెండు కొత్త జిల్లాలను ఏర్పాటు చేస్తు కొడంగల్‌ను మూడు ముక్కలు చేయడానికి పూనుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారని ఆరోపించారు. కొడంగల్ నియోజకవర్గంలోని బోంరాస్‌పేట మండలంలో దుద్యాల్, కోస్గి మండలంలో గుండుమాల్, మద్దూర్ మండలంలో కొత్తపల్లి, కొడంగల్‌లో రుద్రారం గ్రామాలను నూతన మండలాలుగా ఏర్పాటు చేసి కొడంగల్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కొడంగల్ రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసుకునేందుకు నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరు తరలివచ్చి రిలే నిరహార దీక్షకు మద్దతుగా నిలవాలని కోరారు. కొడంగల్ రెవెన్యూ డివిజన్ కొసం పట్టణంలోని పలు పాఠశాలల విద్యార్థులు తరగతి గదులను బహిష్కరించి ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ చౌరస్తాలో మానవహారంతో పాటు ధర్నా రాస్తారోకో నిర్వహించారు. దాదాపు రెండు గంటల పాటు ధర్నా చేయడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం కొడంగల్‌ను రెవెన్యూ డివిజన్‌గా చేయాలని లేని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని అఖిల పక్ష పార్టీల నాయకులు హెచ్చరించారు.

ఆహా

బామ్మ చిట్కాలు

- మరుగుతున్న 'టీ' పొడిలో చిటికెడు శొంఠి పొడి, రెండు యాలకులు వేసి, 'టీ'ఇస్తే చాలా రుచిగా ఉంటుంది.
- లేత సొరకాయ తరిగినపుడు లోపల ఉండే మెత్తని గుజ్జును బాగా నానిన బియ్యానికి జోడించి మెత్తగా రుబ్బాలి. అందులో అల్లం, మిర్చి, ఉల్లిపాయముక్కలు, తగినంత ఉప్పు కలిపి దోసెలు పోస్తే రుచిగా ఉంటాయి.
- వేపుడులో నూనె ఎక్కువైతే కాస్త శనగపిండి చల్లండి. తినడానికి రుచిగా ఉండటమే కాక ఎక్కువయిన నూనె తగ్గుతుంది కూడా.
- వేరుశనగపప్పు వేయించాక బాగా రుచిగా ఉండాలంటే, బాగా వేడి నీటిలో వాటిని ఒక్క క్షణం ఉంచి తీసేసి, నీరంతా పోయే దాకా స్టెయినర్లో ఉంచి, ఆ తర్వాత వీటిని వేయించండి. చాల క్రిస్పీగా ఉంటాయి.
- శనగపిండిలో పెరుగు కలిపితే పకోడీలు మెత్తగా వస్తాయి.
- సాధారణ పెనంపై ఒక చెంచా ఉప్పును వేయించి ఆ తరువాత దానిపై దోశలు వేస్తే నాన్స్టిక్ పెనంపై వేసినట్టుగా అంటుకోకుండా వస్తాయి.
- సలాడ్ కోసం పళ్ళు ముందుగానే కోసి పెట్టుకున్నా అవి నల్లగా మారకుండా ఉండాలంటే, వాటి మీద చెంచాడు నిమ్మకాయ రసం పిండండి. రెండు పళ్లకు సగం నిమ్మ కాయ రసం సరిపోతుంది.



తియ్యటి వేడుక..

నూతన సంవత్సరాన్ని నూతనంగా జరుపుకోవాలి అని అనుకుంటారు. అందుకు ఎన్ని మనోరంజక కార్యక్రమాలు ఉన్నా ఆ ఆనందానికి తీపి తోడైతే.. వచ్చిన బంధుమిత్రులతో కలిసి పంచుకుంటుంటే ఆ మధురానుభూతులు వచ్చే సంవత్సరం వరకూ తీపి జ్ఞాపకాలలా నిలిచిపోతాయి. అయితే మరింకెందుకు ఆలస్యం రకరకాల స్వీట్స్‌ను తయారుచేసుకుని కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలుకుదాం.

షుగర్‌కేన్ ఖీర్

కావలసిన పదార్థాలు

షుగర్ కేన్ జ్యూస్(చెరకు రసం) 1 కప్పు రైస్ 1/2 కప్పు నెయ్యి 2 టీస్పూన్ పాలు 1 కప్పు యాలకలు 3 to 4 ఎండుద్రాక్ష 2 టీస్పూన్లు జీడిపప్పు 8 to 10 (తరిగింది) బాదం 8 to 10



కావలసిన పదార్థాలు

ముందుగా ఒక వెడల్పాటిమంద మైనగిన్నె తీసుకొని అందులో పాలు మరియు రైస్ వేయాలి. తర్వాత అందులో కొద్దిగా వాటర్ మిక్స్ చేసి మూత పెట్టి అన్నంవండుకోవాలి. అన్నం మెత్తగా ఉడికిన తర్వాత అందులో షుగర్ కేన్ జ్యూస్ జోడించాలి. మొత్తం మిశ్రమాన్ని కలగలుపుతూ మీడియం మంట మీద ఉడికించుకోవాలి. తర్వాత ఇందులో నెయ్యి వేసి బాగా మిక్స్ చేయాలి. బియ్యం మెత్తగా ఉడికే వరకూ ఉడికిస్తూనే ఉండాలి . మెత్తగా ఉడికిందని నిర్ధారణకు వచ్చిన తర్వాత... మరో పాన్ తీసుకొని అందులో కొద్దిగా నెయ్యి వేసి వేడి చేసిన తర్వాత అందులో ఎండు ద్రాక్ష, యాలకలు, బాదం, జీడిపప్పును వేసి లైట్ బ్రౌన్‌కలర్ వచ్చే వరకూ వేగించుకోవాలి. తర్వాత వీటిని తీసి ఉడుకుతున్న రైస్ పాన్ లో వేసి మొత్తం మిశ్రమాన్ని కలగలుపుకోవాలి. తర్వాత వేడివేడిగా సర్వ్ చేయాలి. అంతే షుగర్ కేన్ ఖీర్ రిసిపి రెడీ..



మాల్ పువా

కావలసిన పదార్థాలు

మైదా లేదా రీఫైండ్ ఫ్లోర్ఒక కప్పు బొంబాయి రవ్వ 00 గ్రాములు, వాముఅర టేబుల్ స్పూను, ఎల్లో ఫుడ్ కలర్ రంగుకోసం, పాలు 2 కప్పులు, పంచదార 1 కప్పు నీళ్ళుఒక కప్పు, గార్నిషింగ్ కోసంకుంకుమ పువ్వు, బాదాం, రబ్రీ స్వీట్

తయారీ విధానం

ఒక పెద్ద గిన్నెలో మైదా(రీఫైండ్ ఫ్లోర్), బొంబాయి రవ్వ, వాము, ఎల్లో ఫుడ్ కలర్, పాలు వేసి జారు పిండిలాగ కలుపుకోవాలి. .ఈ పిండిని వేడి నూనెలో వేసి గోధుమ రంగు వచ్చేవరకూ పూరీలావేయించాలి.. నూనెలోనుండి తీసి పంచదార పాకంలో వేసి 23 నిమిషాలు ఉంచాలి. కొంచం రబ్రీ స్వీటు, కుంకుమ పువ్వు,బాదాం పప్పులని మాల్ పువా మీద వేసి సర్వ్ చెయ్యాలి.

బనానా డ్రై బర్ఫీ

కావాల్సిన పదార్థాలు

మైదాపిండి కప్పు, అరటిపండు గుజ్జు కప్పు డాల్డా లేదా నెయ్యి ఒకటిన్నర కప్పు వెన్న రెండు చెంచాలు పంచదార పావు కిలో కిస్మిస్లు 20 యాలకులు 5బాదం పప్పు 20గ్రా జీడిపప్పు 20గ్రా

తయారు చేసే విధానము

మైదాపిండిలో, అరటిపండు కలిపి గుజ్జుని కలపాలి. ఇప్పుడు ఓ పాత్రలో మైదా, అరటి పండు గుజ్జు మిశ్రమంలు వేసి అందులో వెన్న వేసి ముద్దలా కలపాలి. తరువాత ఓ బాణలిలో కిద్దిగా నెయ్యి వేసి అందులో జీడిపప్పును వేయించి తీసేయాలి. ఇప్పుడా బాణలిలో మరో రెండు చెంచాల నెయ్యిని వేసి ముద్దగా చేసిపె ట్టుకున్న మైదా మిశ్రమాన్ని అందులో వేసి దోరగా వేయించాలి. ఇప్పుడా పిండిని చిన్న చిన్న బిళ్లల్లా చేతితో పట్టుకుని వత్తుకోవాలి. ఇలా బిళ్లల్లా వత్తుకున్న తరువాత బాణలిలో నెయ్యి వేసి కరిగిన తరువాత ఈ బిళ్లలను వేసి ఎర్రగా వేయించి తీసేయాలి. వేయించిన తీసిన బిళ్లలను ఓ ప్లేటులో కింద పేపర్ పెట్టి వీటిని సర్ది పైన పంచదార చల్లుకుంటే అరటిపండు డ్రై బర్ఫీ సిద్ధమయినట్లే! ఈ బర్ఫీ మంచి రుచికే కాదు పోషక విలువలు కూడా సమృద్ధిగా ఉంటాయి.



ఆరోగ్యానికి రక్ష... ద్రాక్ష



ద్రాక్ష అందరికీ తెలిసిన పండు. అనారోగ్య సమయంలోనూ తినడానికి అనువైన పండు ఇది. కానీ నిత్యం తీసుకున్నా మంచి ఫలితం ఉండడంతో పాటు ఆరోగ్యం మెరుగుపడుతుంది. ద్రాక్షపండులోని సుగుణాలు ఆరోగ్యాన్ని రక్షిస్తాయి. మరి ఈ పండులోని ఔషధ గుణాలు, ఆరోగ్య ప్రయోజనాలేంటో తెలుసుకుందాం..

ఆరోగ్యానికి తాజా పండ్లు మంచివన్న విషయం అందరికీ తెలిసిందే. ద్రాక్షని ఆహారంలో తీసుకోవడ వల్ల కలిగే లాభాలు ఎన్నో. అత్యంత పోషక విలువలు కలిగి ద్రాక్ష ఆరోగ్యాన్ని అందించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తుంది. ఎన్నో రకాల ఆరోగ్య సమస్యలను నిర్మూలించడంలో ద్రాక్ష పండుది ముఖ్య పాత్ర. అజీర్తి నుంచి కంటి సమస్యల దాకా ఎన్నో రకాల జబ్బుల నివారణలో కీలక పాత్ర వహిస్తుంది. అందుకే చక్కని రుచితో పాటు ఆరోగ్యాన్నీ అందించే ద్రాక్షలను వీలైనంత ఎక్కువగా తీసుకోవాలంటున్నారు పోషకాహార నిపుణులు. ద్రాక్షలో విటమిన్–సీ, ఎ, బి6, ఫోలిక్ ఆమ్లం కూడా పుష్కలంగా ఉన్నాయి. పొటాషియం, కాల్షియం, ఇనుము, ఫాస్ఫరస్, మెగ్నీషియం, సెలీనియం లాంటి ఎన్నో రకాల ఖనిజలవణాలు ద్రాక్షల్లో సమృద్ధిగా లభిస్తాయి. అంతేకాదు.. ఫ్లేవినాయిడ్స్ లాంటి శక్తివంతమైన యాంటి ఆక్సిడెంట్లు ఉండటం వల్ల ఫ్రీ రాడికల్స్ బారి నుంచి రక్షిస్తాయి.



గుండె ఆరోగ్యానికి

ద్రాక్షల్లో ఫ్లేవనాయిడ్స్ అధికంగా ఉండడం వల్ల గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి. ద్రాక్షలో ఉండే ఔషధ గుణాలు ఆస్తమాను అదుపులో ఉంచేందుకు ఉపయోగపడతాయి. ద్రాక్షపండ్లలో టీరోస్టిల్బీన్ అనే పదార్థం ఉంటుంది. ఇది రక్తంలో కొలెస్ట్రాల్ మోతాదును తగ్గిస్తుంది. ద్రాక్షపండ్లు రక్తంలో నైట్రిక్ ఆక్సైడ్ మోతాదును పెంచుతాయి. నైట్రిక్ ఆక్సైడ్ రక్తం గడ్డ కట్టకుండా నివారిస్తుంది. తద్వారా గుండెపోటు అవకాశం తగ్గుతుంది.

బ్రెస్ట్ క్యాన్సర్

నల్లద్రాక్షల రసం రొమ్ము క్యాన్సర్ నివారణకు ఉపయోగపడుతుందని వైద్యులు తెలిపారు. పెద్దపేగు క్యాన్సర్‌తో పాటు ఇతర జీర్ణవ్యవస్థ సంబంధిత క్యాన్సర్లు, రొమ్ము క్యాన్సర్ల నివారణకు బాగా పనిచేస్తుంది. క్యాన్సర్ కారక పదార్థాల పెరుగుదలను ఇవి నిరోధిస్తాయి. ద్రాక్షరసం క్యాన్సర్‌ను అణిచివేయడమే కాక క్యాన్సర్ కణాల వ్యాప్తిని కూడా అరికడుతుంది. ద్రాక్షలోని ఈ పదార్థాలు మొత్తం శరీరంలో వ్యాధి నిరోధక వ్యవస్థనే బలోపేతం చేస్తాయి.

అసిడిటి

చాలా మంది అసిడిటితో బాధపడుతుంటారు. ఈ సమస్య ఉన్నవారు, గ్లాసు ద్రాక్షరసాన్ని ప్రతి రోజూ తాగడం వల్ల అసిడిటి తగ్గుతుంది. తిన్న ఆహారం అరగకుండా అజీర్ణంతో చీకాకు కలిస్తుంటే ద్రాక్ష రాసాన్ని కానీ లేదా ద్రాక్షపండ్లను తీసుకుంటే అజీర్తిని అరికట్టవచ్చు.

బ్లడ్ ప్రెజర్

ద్రాక్షరసం తాగడం వల్ల మరో అదనపు ప్రయోజనం రక్తపోటు తగ్గిస్తుంది. బ్లడ్ ప్రెజర్ స్థిరంగా ఉండేందుకు సహాయం చేస్తుంది.

మలబద్దకం

ద్రాక్షలో సెల్యులోజ్, ఆర్గానిక్‌ఆసిడ్ వంటివి మలబద్దకాన్ని నివారించడంలో పనిచేస్తాయి. అందువల్ల మలబద్దకంతో బాధపడేవారు ద్రాక్షను తినడం వల్ల చాలా మేలు జరగుతుంది. ద్రాక్ష రసం కడుపులోని పేగులను శుభ్రపరచడంతో పాటు దీర్ఘకాలంగా ఉన్న మలబద్దక సమస్యను కూడా నివారిస్తుంది.

మైగ్రేన్

మైగ్రేన్ తలనొప్పిని తగ్గించడానికి అత్యంత ప్రభావవంతంగా ద్రాక్ష పనిచేస్తుంది. మైగ్రేన్ తలనొప్పి తరచూ వస్తుంటే, రోజూ ఉదయాన్నే పరకడుపున ద్రాక్షరసాన్ని తీసుకోవాలి. రసంలో నీళ్ళు కలపకూడదు.

మతిమరుపు

అల్జీమర్స్ వ్యాధితో బాధపడుతున్న వారిలో అమైలాయిడల్ బీటా పెప్టైడ్స్ మోతాదును తగ్గిస్తాయి. ద్రాక్షల్లో ఉండే రిస్ అనే పాలీఫినాల్ ఇందుకు తోడ్పడుతుంది. మెదడు చురుకుదనాన్ని పెంచడంలో ద్రాక్ష కీలక పాత్ర వహిస్తుంది.

కిడ్నీ ఆరోగ్యానికి

ద్రాక్షలు యూరిక్ ఆమ్లం సాంద్రతను తగ్గిస్తాయి. తద్వారా ఆమ్లం మోతాదు తగ్గి, కిడ్నీలపై పనిభారాన్ని తగ్గిస్తుంది. ద్రాక్షలు తీసుకోవడం ద్వారా కిడ్నీల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

ఆస్తమా నివారణ

ద్రాక్ష ఆస్తమాను నయం చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ఆస్తమాతోబాధపడేవారు ఎండు ద్రాక్ష తినడం వల్ల తగ్గించుకోవచ్చు.

బరువు తగ్గడానికి

అధిక బరువుతో బాధపడుతున్న వారు తమ శరీర బరువును తగ్గించుకునేందుకు రకరకాల ప్రయోగాలు చేస్తుంటారు. కానీ ద్రాక్షపండ్ల రసం తాగితే బరువు తగ్గి నాజూకుగా తయారవుతారంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఈ పండ్ల రసంలో మిగిలిన పండ్లకన్నా తక్కు వ కాలరీలు ఉంటాయి. ద్రాక్ష రసంలో పంచదార వేసుకోకుండా తాగటం ఎంతో మంచిది. ఇందులో ఉన్న పీచుపదార్థం ఈ రసాన్ని ఎక్కువసేపు కడుపులో ఉంచుతుంది. దీంతో ఆకలి తగ్గి ఆహారం ఎక్కువగా తినలేరు. దీనిలోని పీచుపదార్థం శరీరంలో కొవ్వును చేరనివ్వదు. వీటిలో ఉండే ఫైటోకెమికల్స్ కొలెస్టరాల్‌న్ని శరీరంలోకి చేరనివ్వవు. దీంతో శరీరం నాజూకుగా తయారవుతుంది.

హెల్త్

హెయిర్ ఫాల్‌ని నియంత్రిస్తుంది..

జీవం కోల్పోయిన జుట్టుకు ద్రాక్ష గింజలు చక్కని ఔషధంలా పని చేస్తాయి. వాటిల్లోని ఫ్యాటీ ఆమ్లాలు శిరోజాలకు పోషణను అందించి జుట్టు రాలే సమస్యను తగ్గిస్తాయి. ఇందులోని యాంటీఆక్సిడెంట్స్ రక్తప్రసరణను పెంచుతుంది. దాంతో శిరోజాలకు మంచి నిగారింపు వస్తుంది.

చర్మ సౌందర్యానికి

చర్మ సంరక్షణకు ద్రాక్ష పండ్లు ఎంతగానో ఉపకరిస్తాయి. అందుకే వీటిని స్క్రబ్, మాయిశ్చరైజర్ తయారీలో ఉపయోగిస్తున్నారు. తాజా ద్రాక్షలను గుజ్జులా చేసి మసాజ్ చేసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది. ఉపయోగాలున్నాయని అతిగా తినడం, సౌందర్య పోషణకు వినియోగించడం మంచిది కాదు. తగిన మోతాదు వాడకంతోనే అన్ని విధాలా ఆనందం.

కంటిచూపును మెరుగుపరుస్తాయి:

లూటీన్, జిగ్జాంథిన్‌లనే కరోటినాయిడ్స్ బ్లాక్ గ్రేప్స్‌లో పుష్కలంగా లభిస్తాయి. కంటిచూపు బాగుండేందుకు సహకరిస్తాయి. బ్లాక్ గ్రేప్స్‌ను తీసుకోవడం ద్వారా రెటీనాకు జరిగే ఆక్సిడేటివ్ డేమేజ్‌ను అడ్డుకోవచ్చు. దీంతో అంధత్వం బారిన పడకుండా కాపాడుకోవచ్చు.

బోన్ లాస్‌ను అరికడుతుంది:

రెస్వెరాట్రాల్ అనే కాంపౌండ్ బ్లాక్ గ్రేప్స్‌లో పుష్కలంగా లభిస్తుంది. ఇది మెటబాలిక్ సింద్రోమ్‌ని అరికడుతుంది. మెటబాలిక్ సింద్రోమ్ వలన గుండె జబ్బులు, స్ట్రోక్, డయాబెటిస్ వంటి సమస్యలు తలెత్తుతాయి. తద్వారా, బోన్ లాస్‌కి కారణమవుతుంది మెటబాలిక్ సింద్రోమ్. బ్లాక్ గ్రేప్స్ ని తినడం ద్వారా ఓస్టియోపోరోసిస్ నుంచి రక్షణ లభిస్తుంది.

మట్కా చాయ్..







మసాలా చాయ్, అరోమా చాయ్, లెమన్ టీ, అల్లం చాయ్ ఇలా చెప్పుకుంటూ పోతే ఛాయలో రకాలు బోలెడు. గరం గరం చాయ్ గొంతు దిగుతుంటే లేని ఉత్సాహం ఆవరిస్తుంది. ఓ పూట భోజనం మానేస్తాం. కానీ చాయ్ లేకుండా ఉండలేం. నీళ్లు, పాలు, టీ పొడి, షుగర్ సమ్మేళనం టీ అనుకుంటే పొరపాటే మరి. కొత్త కొత్త రుచులతో, ఫ్లేవర్లతో చాయ్ తన రూపాన్ని మార్చుకుంటూ వస్తున్నది. ఇప్పుడు కొత్తగా తందూరీ చాయ్ చాయప్రియులను విపరీతంగా తాగేలా చేస్తుంది. తందూరీ చాయ్ జన్మస్థలం పూనే. అక్కడి నుంచి అట్లా అట్లా దేశ విదేశాల్లో తన ఉనికిని చాటుకుంటూ శరవేగంగా ప్రయాణిస్తూ అందరి నోళ్లల్లో గుటకేస్తూ ప్రజాదరణ పొందుతున్నది. మరి ఈ తందూరీ చాయ్ ప్రత్యేకత చెప్పుకోవాలి కదా... టీని కప్పు బదులు చిన్నపాటి మట్టి గురిగిలో ఇస్తారన్నమాట. ఈ మట్టి గురుగులు పెద్ద తందూరీ పొయ్యిలో కాల్చి వాటిలో వేడి వేడి టీ సర్వ్ చేస్తారు. మట్టి చాలా శ్రేష్టం అని మనకు తెలుసు. ఆరోగ్యరీత్యా కూడా మట్టి పాత్రలనే వాడమంటున్నారు. మట్టి పరిమళం మనసును సేదతీరుస్తుంది. మట్కా చాయ్ ఆలోచనలను పదును పెడుతుంది. ఇది మనం ఇంట్లో చేసుకోవచ్చు. మట్టి గురుగులు మార్కెట్లో దొరుకుతాయి. వాటిని స్టౌపై లోపల బయటా కాల్చి, తయారు చేసిన టీని మట్కాలో పోసి స్టౌపై గిన్నె పెట్టి ఆ గిన్నెలో ఈ చాయ్ పోసిన మట్కాను ఉంచాలి. మట్కాతో పాటు చాయ్ కూడా మరుగుతుంది. మట్టి వాసనతో చాయ్ రుచి అదిరిపోతుంది. అదండీ తందూరి చాయ్ కథ!



పచ్చిపాలతో నునుపైన చర్మం..

అందాన్ని మెరుగు పరుచుకోవడానికి పాలు బాగా ఉపయోగపడుతాయి. మృతకణాలను, మురికిని తొలగిస్తాయి. పచ్చిపాలను నల్లగా మారిన చేతులు, పాదాలపై అప్లై చేయాలి. పాలలోని లాక్టిక్ స్వభావంతో చర్మంలోని మృత కణాలను తొలగించి, చర్మరంధ్రాలలోకి వెళ్ళి లోపలి నుంచి స్కిన్‌ని శుభ్రపరుస్తుంది. ఇది బ్లీచింగ్ ఏజెంట్‌లా పనిచేసి చేతులు, కాళ్ల రంగును తెలుపు దనంతో మెరిసేలా చేస్తుంది. వేళ్ళ కణుపులను కూడా మెత్తబరుస్తుంది.

ఒకరికొకరం.. కలిసుందాం అందరం!



నూతన సంవత్సరానికి స్వాగతం... సంతోషపు సంబరాల కొత్త వత్సరానికి ఇదే ఆహ్వానం!

జగమంత కుటుంబంలో ఏకాకిగా ఎవరూ ఉండకూడదనే బంధాలు బాంధవ్యాలు కలబోసుకున్నాయి. మహావృక్షం మనిషి జీవితం. అమ్మ నాన్న తోబుట్టువులు, బంధువులు, ఆత్మీయులు, హితులు సన్నిహితులు, ఇరుగు పొరుగు వృక్షం శాఖలు ఉపశాఖలు. చెట్టు వృక్షంగా ఎదిగే క్రమంలో కొమ్మ కొమ్మకూ బంధం బలపడితేనే మహామాను పచ్చందాలతో సుభిక్షంగా ఏయేటికాయేడు విస్తరించుకుపోతుంది. ప్రతి ఏడూ కొత్త చిగుళ్లతో కొమ్మాకొమ్మా కలుస్తాయి. పూలతో ఫలాలతో పలకరించుకుంటాయి. వ్యక్తి ఇద్దరుగా మారి కుటుంబాన్ని సృష్టించి సమూహంగా ఎదుగుతాడు. ఈ ప్రయాణంలో జరిగిపోతున్న సంవత్సరాలు ఆకు రాలే కాలం.. చిగురించే ఆశలతో కొత్త సంవత్సరాలు ఎన్నో మనిషి జీవితంలో, ఎన్నో అనుభవాలు మరెన్నో జ్ఞాపకాలు. మధురస్మృతులు అమూల్య క్షణాలు సుగంధాన్ని సుమధురాలను అందించే ఫల పుష్పాల్లాంటి బంధాలు అనుబంధాలు.



వీటిని కాపాడుకోవడంలో గాలివానలు ఎన్ని ఎదురైనా చలించక ప్రేమాభిమానాలు వర్షిస్తూ మానవతను చాటుకుంటాడు. తనను తానూ రిఫైన్ చేసుకోవడానికి కొత్త సంవత్సరాన్ని వేదికగా మలచుకొంటాడు. నిండు మనసుతో నూతన ఏడాదిలో పలకరింపులు, అభినందనలతో తన చుట్టూ వున్న వాళ్ళ సుఖసంతోషాలను కోరుకుంటూ మంచిని పంచుకుంటూ.. అందరి బంధువుల్లా మనమందరం ముందుకు సాగాలని ఆశిద్దాం...

న్యూ లైఫ్‌కి స్వాగతం చెప్పేద్దాం...



పాత సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ నూతన సంవత్సర వేడుకలలో సరదాలు, సందడులు మామూలే.. 2018కి టాటా చెప్తూ వచ్చేసిన 2019కి ఆహ్వానం సంబరాలతో ప్రారంభం అయ్యింది.

సంవత్సరం మారుతూనే మనిషిలోని ఆలోచనలను కూడా మారుస్తుంది. మర్చిపోవడం దేవుడు ఇచ్చిన గొప్ప వరం అంటారు పెద్దలు. మరి అలాంటి వరాన్ని సద్వినియోగం చేసుకుంటూ, పాత రోజులలోని చేదు జ్ఞాపకాలను మరిచిపోయి, అనుబంధాలను పెనవేసుకుంటూ ఈ కొత్త సంవత్సరంలోకి అడుగు పెట్టేదాము. మరి ఈ ఏడాది అందరికీ అనుకూలంగా ఉండాలనే కోరుకుంటారు కదా! ఆ కొత్త దనాన్ని ఆచరణలో చూపడానికి ఏం చేయాలో తెలుసుకుందామా...

సమయపాలన..

నిన్నటి గురించి చింతించకు, రేపటిని ఆలోచిస్తూ, ప్రస్తుత జీవితాన్ని వృధా చేయకు. పనిని సక్రమంగా నిర్వర్తించాలంటే, అందుకు సమయపాలన చాలా అవసరం. పోయిన కాలం తిరిగిరాదు. ప్రస్తుతం ఉన్నదే మనది. కాబట్టి గతం గతఃహా వదిలేసి, అందరిని మనసారా పలకరిస్తూ కొత్త సంవత్సరాన్ని ప్రారంభించండి. అందమైన కొవ్వొత్తి కరిగిపోయాక మనది కానట్టే... గడిచిన సమయం మనది కాదు. కాలం చాలా విలువైనది. ఆ కాలాన్ని వినియోగించుకున్నవాడు వివేకవంతుడు.

ప్రణాళికలు..



జీవితం అంటే ఏదో ఒక ప్రణాళిక తప్పనిసరి. ప్రణాళిక లేకుంటే ముందుకు వెళ్లడం చాలా కష్టం. జీవితాన్ని ఒక పద్ధతి ప్రకారం అనుసరించకపోతే, జీవించే జీవితానికి అర్థం ఉండదు. చిన్నదైనా, పెద్దదైనా అందుకు సరైన మార్గాన్ని ముందుగానే ఎంచుకోవాలి.

వాయిదాల పని..


పని ఏదయినా చేయాల్సిన టైమ్‌లో చేస్తేనే ఫలితం ఉంటుంది. వాయిదా వేసి ఆపేస్తే ఆ తర్వాత చేసిన ఉపయోగం ఉండదు. ఈ విధంగా మూర్ఖంగా వాదించే వారి సంఖ్యే ఎక్కువ. కాబట్టి ఈ అలవాటును మార్చుకోవడం మంచిది. ఈ కొత్త ఏడాదిలో కొన్ని కొత్తవి, మంచి అలవాట్లను అలవరుచుకోవడం వల్ల జీవితంలో ముందుకు సాగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.



బోరింగ్ లైఫ్

మొదటి రోజు కొత్తగా అనిపించి, అవే రోజులు గడుస్తుంటే బోర్‌గా అనిపిస్తుంది. తొలి రోజును కొత్తగా, ఆనందంగా, సంబరంగా ఆస్వాదించే మనసును చివరి దాకా అదే ఉత్సాహంతో ఉండాలంటే, మనసుని మార్చుకోవాలి. కొన్ని మార్పులు జరిగితేనే బోరింగ్ లైఫ్ నుండి హ్యాప్పీ లైఫ్‌ని ఎంజాయ్ చేయొచ్చు. మార్పు అనేది ఎక్కడో రాదు. ముందుగా మన నుండే రావాలి. అలాంటి మార్పు కోసం ముందుగా మన పరిధులు, పరిమితులు, పరిస్థితులు, రాబోయే వాటి గురించి భయపడడం, సందేహపడడం లాంటివి మానేయాలి. అప్పుడే ఎవరికి వారు తమని తాము సరికొత్తగా చూసుకునే వీలుంటుంది.





ముంగిట్లో ముగ్గు








భాగ్యలక్ష్మి.కె
10వ తరగతి.

'చిటికె'లో సాధ్యం..!



- మజ్జిగపలుచనైతే పది కరివేపాకు రెమ్మలను కాస్త ఉప్పుతో కలిపి ముద్దలా చేసి మజ్జిగలో కలిపితే చిక్కపడుతుంది
- ఇడ్లీ, దోస పిండి పులవకుండా ఉండాలంటే గిన్నెమీద తడిబట్ట కప్పాలి
- అరటి కాయ ముక్కలను కాసేపు మజ్జిగలో వేసి వేయిస్తే చక్కగా వేగుతాయి.

మాటే మంత్రం..



తనని తాను విశ్లేషించుకుంటూ, పొరపాట్లను సరిచేసుకుంటూ, ముందుకు సాగే వ్యక్తి అనుకున్నది సాధిస్తాడు.. విజయాన్ని వరిస్తాడు..



యాక్షన్ హీరో పెళ్లి

తమిళ యాక్షన్ హీరో విశాల్ త్వరలోనే పెళ్లి చేసుకోబోతున్నాడట. ప్రస్తుతం కోలీవుడ్‌లో మరియు సోషల్ మీడియాలో ఈ న్యూసే వైరల్‌గా మారింది. ఇంతకీ విశాల్ చేసుకోబోయే అమ్మాయి ఎవరో అని నెటిజన్లు తెగ సెర్చ్ చేస్తున్నారు. అయితే విశాల్ తండ్రి ప్రముఖ నిర్మాత జికె రెడ్డి మాట్లాడుతూ.. అనిషా అనే అమ్మాయితో విశాల్ పెళ్లి నిశ్చయమైందని త్వరలోనే వారి నిశ్చితార్థం హైదరాబాద్లో ఘనంగా జరుగుతుందని తెలిపారు. మొత్తానికి ఈ స్టార్ హీరో త్వరలో ఒక ఇంటివాడు కాబోతున్నాడన్నమాట. మరి ఇన్నాళ్లు పెళ్లి గురించి అడిగితే నడిగర్ సంఘం భవనం నిర్మించిన తర్వాత చేసుకుంటానంటూ చెప్పే విశాల్.. చెప్పినట్లుగానే నడిగర్ సంఘం భవనం నిర్మిస్తున్నారు.



దుబాయ్‌లో మహేష్ చీర్స్

సూపర్‌స్టార్ మహేష్ కొత్తసంవత్సరం పార్టీ ఎక్కడ? ఘట్టమనేని అభిమానులంతా ఈ ప్రశ్నకు సరైన సమాధానం లేక ఎంతో ఆసక్తిగా వేచి చూస్తున్నారు. మహేష్ ప్రతిసారీ తనకు ఇష్టమైన ఒక అందమైన లొకేషన్ ఎంపిక చేసుకుని కుటుంబ సమేతంగా కొద్దిరోజులు కొత్త సంవత్సరాన్ని ఎంజాయ్ చేసి వస్తుంటారు. ఈసారి ఎక్కడికి వెళ్లారు? అంటే అందుకు లైవ్ లోనే ఆన్సర్ ఇచ్చాడు మహేష్. కొందరు స్నేహితులతో కలిసి ఉన్న ఫోటోని మహేష్ షేర్ చేశారు. దీనికి ఆసక్తికరమైన ట్యాగ్ ని ఇచ్చారు. బూబూచిల్లింగ్ ఎట్ ..మిక్స్ విత్ బోయ్స్.. న్యూ హాట్‌స్పాట్ ఇక్కడే.. దుబాయ్‌లో #NYE సెలబ్రేషన్స్ కి రెడీ" అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఫోటోని పోస్ట్ చేశారు. దీంతో మహేష్ కొత్త సంవత్సర వేడుకలు ఎక్కడో తెలిసిపోయింది. దుబాయ్ లోని ఎగ్జోటిక్ లొకేషన్స్ లో మరోసారి కొత్త సంవత్సర వేడుకల్ని ప్లాన్ చేశారు. అతడు నటించిన మహర్షి ట్రీట్ నేడు గ్రాండ్ గా ఉండనుంది.



జనవరిలోనే ముహూర్తం

స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ మాటల మాంత్రికుడు సుప్రసిద్ధ సినీ దర్శకుడు 'త్రివిక్రమ్'ల కాంబినేషన్‌లో మరో చిత్రం రూపుదిద్దుకోవటానికి సన్నద్ధమవుతోంది. హీరోగా అల్లు అర్జున్ కు ఇది 19 వ చిత్రం కాగా, వీరిద్దరి కాంబినేషన్‌లో మూడవ చిత్రం. జులాయి, సన్నాఫ్ సత్యమూర్తి చిత్రాల విజయాల నేపథ్యంలో ముచ్చటగా మూడోసారి తెరకెక్కనున్న ఈ చిత్రంపై ఇటు సినీ వాణిజ్య రంగాలలోను, అటు ప్రేక్షక వర్గాలలోనూ అంచనాలు ఉన్నత స్థాయిలో ఉన్నాయి. వీటిని నిజం చేసే దిశగా సుప్రసిద్ధ చలన చిత్ర నిర్మాణ సంస్థలు 'హారిక అండ్ హాసిని క్రియేషన్స్, 'గీతాఆర్ట్స్' అధినేతలు అల్లు అరవింద్, ఎస్. రాధాకృష్ణ (చినబాబు)లు సంయుక్తంగా ఈ చిత్రాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే చిత్రం పూర్వ నిర్మాణ కార్యక్రమాలు పూర్తయ్యాయి. చిత్రానికి సంబంధించిన ఇతర తారాగణం, సాంకేతిక నిపుణులు వివరాలు త్వరలోనే మరో ప్రకటనలో అధికారికంగా ప్రకటిస్తాం. 2019 జనవరిలో చిత్రం ప్రారంభ మవుతుందని, అందరికీ 2019 ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు చిత్ర నిర్మాతలు అల్లు అరవింద్, ఎస్. రాధాకృష్ణ (చినబాబు).



సంక్రాంతి అల్లుళ్లు వచ్చేస్తున్నారు దిల్ రాజు

విక్టరీ వెంకటేశ్, మెగా ప్రిన్స్ వరుణ్‌తేజ్ హీరోలుగా తమన్నా, మెహరీన్ హీరోయిన్స్‌లో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్‌రాజు నిర్మాణంలో రూపొందుతోన్న చిత్రం ఎఫ్ 2. ఫన్ అండ్ ఫ్రస్టేషన్ ట్యాగ్ లైన్. అనిల్ రావిపూడి దర్శకుడు. సంక్రాంతి సందర్భంగా జనవరి 12న సినిమా విడుదలవుతుంది. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించిన పాటలను వైజాగ్ ఆర్.కె.బీచ్‌లో జరిగిన విశాఖ ఉత్సవంలో విడుదల చేశారు. ఆడియో సీడీలను ఆంధ్రప్రదేశ్ మంత్రి గంటా శ్రీనివాస్‌రావు విడుదల చేశారు. దిల్‌రాజు మాట్లాడుతూ 2004లో నేను, బన్ని న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ ఇక్కడే చేసుకున్నాం. ఈ వేడుకకి వచ్చేటప్పుడు అదే గుర్తుకు వచ్చింది. 2017 సంక్రాంతికి మూడు సినిమాలు విడుదలైనప్పుడు చాలా పెద్ద కాంపిటీషన్ అని ఫీలయ్యాం. గౌతమిపుత్ర శాతకర్ణి ఓ క్లాసిక్ సినిమాలా నిలిచింది. మెగాస్టార్‌గారి 150వ సినిమా ఖైదీ నంబర్ 150 ఇండస్ట్రీ రికార్డ్ అయ్యింది. శతమానం భవతి మంచి సినిమా అయ్యి నేషనల్ అవార్డ్సను సాధించింది. ఇప్పుడు మళ్లీ 2019లో మూడు సినిమాలు విడుదలవుతున్నాయి. బాలయ్యగారి యన్.టి.ఆర్ బయోపిక్, రామ్‌చరణ్‌గారి వినయవిధేయరామ, మా ఎఫ్2..ఈ సంక్రాంతికి ఈ మూడు సినిమాలు పెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నాను. వెంకటేశ్‌గారితో మా బ్యానర్‌లో చేసిన 'సీతమ్మవాకిట్లో సిరిమల్లెచెట్టు' సంక్రాంతికి విడుదలై పెద్ద విజయాన్ని సాధిస్తే... వరుణ్‌తో ఫిదా సినిమా చేశాం. ఇద్దరూ కలిసి మా బ్యానర్‌లో మల్టీస్టారర్ చేశారు. వారిద్దరి గురించి నేను చెప్పేదేమీ లేదు. ఇద్దరూ నిర్మాతల హీరోలు. ఈ సినిమా జరుగుతున్న రోజులు సరదాగా, ఫ్రెండ్‌లా వెళ్లి సెట్లో ఎంజాయ్ చేసి వచ్చేవాడిని. అంత కంఫర్ట్‌ను క్రియేట్ చేసే హీరోలు వాళ్లు. ఇమిడియేట్‌గా మరో స్క్రిప్ట్ వస్తే మరో సినిమా చేయాలనేంత కోరికగా ఉంది. వరుణ్ నాకు ఫ్యామిలీ మెంబర్. చిరంజీవిగారి నుండి మంచి లక్షణాలు నేర్చుకుని కొత్త కొత్త సినిమాలు చేస్తూ తను ఎదుగుతున్నాడు. ఎఫ్2 ద్వారా ఫ్యామిలీ ఆడియెన్స్‌కు వరుణ్ మరింత దగ్గరవుతాడు. తను మా పవర్‌స్టార్. దర్శకుడు అనిల్ రావిపూడి ఎఫ్ 2 కథ చెబుతున్నప్పుడు నవ్వుతూనే ఉన్నాను. ప్రతి భార్యాభర్త మధ్య ఫన్ ఉంటుంది, ఫ్రస్టేషన్ ఉంటుంది. స్క్రిప్ట్ చెప్పినరోజునే మా బ్యానర్‌లో మరో సూపర్‌హిట్ సినిమా రాబోతుందని తెలుసు. ఫ్యామిలీ ఆడియెన్స్ రెండున్నర గంటల సేపు నవ్వుకుంటారు. అందుకనే సంక్రాంతి అల్లుళ్లు వస్తున్నారు అనే మరో ట్యాగ్‌లైన్ పెట్టాం. ఒకరు ఆంధ్ర అల్లుడైతే, ఒకరు తెలంగాణ అల్లుడు. ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు, నువ్వునాకు నచ్చావ్‌లో వెంకటేశ్‌గారిని చూస్తున్నట్లు ఉంది. అనిల్కి ఇది నాలుగో సినిమా. మా బ్యానర్‌లో మూడో సినిమా. తప్పకుండా హ్యాట్రిక్ కొట్టబోతున్నాం. రాక్స్టార్ దేవిశ్రీప్రసాద్‌తో ఆర్య నుండి ఎఫ్2 వరకు పది సినిమాలు. ముందు తొమ్మిది సినిమాలు సక్సెస్‌ఫుల్ సినిమాలయ్యాయి. దేవి చాలా కేర్ తీసుకుంటాడు. కాబట్టి కాంబినేషన్ కంటిన్యూ అవుతుంది అన్నారు.

డైరెక్టర్ అనిల్ రావిపూడి మాట్లాడుతూ ఎఫ్ 2 కథను వైజాగ్‌లోనే డిస్కస్ చేసి రాసుకున్నాం. మా ఫన్ అండ్ ఫ్రస్టేషన్ ఏంటో బీచ్కు తెలుసు. ఈ బ్యానర్లో ఇది నాది మూడో సినిమా. విక్టరీ వెంకటేశ్‌గారితో పని చేయడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నాను. ఆయన చేయని మేనరిజమ్స్, ఎక్స్‌పెక్టేషన్స్ లేవు. ఆయన కామెడీ టైమింగ్‌ను మనం తోడు కోవాలే కానీ.. ఎంత కావాలో అంత దొరుకుతుంది. ఈ సినిమా చూస్తే .. వెంకటేశ్‌గారు ఓ టైంమిషన్‌లో అబ్బాయిగారు, ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు, నువ్వునాకు నచ్చావ్, మల్లీశ్వరి టైంకు తీసుకెళ్లిపోతారు. అంత కామెడీ ఎనర్జీ సినిమాలో కనపడుతుంది. వరుణ్తేజ్ గురించి చెప్పాలంటే.. తను తొలిసారి కామెడీ జోనర్లో నటిస్తున్నాడు. దేవిశ్రీగారు అందించిన ఆరు సాంగ్స్ బావున్నాయి.

ఈ డిసెంబర్ 31కి తప్పకుండా రెండు సాంగ్స్ పాడుకుంటారు. ఈ సంక్రాంతికి ఫ్యామిలీతో రండి ఆనందంగా నవ్వుకుని వెళతారు.. అన్నారు.

విక్టరీ వెంకటేశ్ మాట్లాడుతూ "తొలి సినిమా కలియుగ పాండవులు నుండి చాలా సినిమాలు స్వర్ణ కమలం, సుందరకాండ, మల్లీశ్వరి, గురు .. ఇలా చాలా చిత్రాలను వైజాగ్‌లో చేశాం. వైజాగ్ ఉత్సవాల్లో మా సినిమా పాటలను విడుదల చేయడం ఆనందంగా ఉంది. ఈ అవకాశాన్ని ఇచ్చిన గంటా శ్రీనివాసరావు గారికి థాంక్స్. ఎఫ్ 2లో అనిల్ వండర్ ఫుల్ స్క్రిప్ట్ రాశాడు. అనిల్ నా గత చిత్రాలన్నింటినీ చూసి వాటిన్నంటి కంటే రెచ్చిపోయేలా ఈ సినిమాలో నటింపచేశాడు. ఈ సినిమాలకు పనిచేస్తున్న సమయంలో ఎంజాయ్ చేశాను. దేవిశ్రీ వండర్‌ఫుల్ మ్యూజిక్ ఇచ్చారు.

దిల్‌రాజు, లక్ష్మణ్, శిరీష్‌లతో సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు తర్వాత చేసిన సినిమా ఇది. ఆ సమయంలో మహేష్ ఓ సోదరుడిని చూసుకున్నాను. ఇప్పుడు 'ఎఫ్2'లో వరుణ్‌తేజ్‌తో మరో సోదరుడిని చూసుకన్నాను. మాతో ఈ సినిమాకు పనిచేసిన నటీనటులు, సాంకేతిక నిపుణు లకు థాంక్స్. జనవరి 12న ఎఫ్ 2 విడుదలవుతుంది. ఇదే సందర్భంలో బాలయ్యబాబుగారు, రజనీకాంత్‌గారు, చరణ్ సినిమాలు విడుదలవుతున్నాయి. వారికి నా అభినందనలు. అందరి సినిమాలు బాగా ఆడాలి. తెలుగు ఇండస్ట్రీ బావుండాలి అన్నారు. మెగాప్రిన్స్ వరుణ్ తేజ్ మాట్లాడుతూ" వైజాగ్ నాకు చాలా క్లోజ్. నేను యాక్టింగ్ ఇక్కడ సత్యానందగారి దగ్గరే నేర్చుకున్నాను. వెంకటేశ్‌గారితో పనిచేయడం గౌరవంగా భావిస్తున్నాను.."అన్నారు.

వైజాగ్‌కి సినీపరిశ్రమ తరలిరావాలి! -గంటా శ్రీనివాసరావు


ఆంధ్రప్రదేశ్ మంత్రి గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ .. వైజాగ్‌కి సినీపరిశ్రమ తరలిరావాలని అన్నారు. ఎఫ్2 వేడుకలో ఆయన మాట్లాడుతూ "విశాఖ ఉత్సవం ఒక బ్రాండ్. వైజాగ్‌కి అంతర్జాతీయంగా కూడా గుర్తింపు తెచ్చిపెట్టిన రాష్ట్ర పండుగ ఇది.

వైజాగ్ స్మార్ట్ సిటీ. ఇండియాలో ఇంత మంచి సిటీ ఉందా అని అందరూ అప్రిషియేట్ చేస్తున్నారు. సినీ పరిశ్రమ వైజాగ్‌కి తరలి రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రామానాయుడుగారు పార్లమెంట్ సభ్యులుగా పనిచేసినప్పుడు ఆయన్ను స్టూడియో పెట్టమని అడిగినప్పుడు ఆయన స్టూడియో పెట్టారు. త్వరలోనే వైజాగ్ స్టూడియోలో నిర్మాణాలు జరిగేలా చూస్తామని వెంకటేష్‌గారు కూడా అన్నారు. వైజాగ్ సినిమాలకు సెంటిమెంట్‌గా మారింది. షూటింగ్‌ల కు అనువుగా ఉండేలా వసతులు ఉన్నాయి. కాబట్టి భవిష్యత్లో ఇక్కడ ప్రతి సినిమాలో కొంత షూటింగ్ చేసుకునేలా ప్లాన్ చేసుకుంటే బావుంటుంది. విశాఖ ఉత్సవంలో చివరిరోజున ఈ ఎఫ్ 2 పాటలను విడుదల చేయడం ఆనందంగా ఉంది.." అన్నారు.



అదా బిగ్ ట్రీట్

కొత్త సంవత్సరంలో అడుగుపెట్టక ముందే అభిమానులకు మతిచెడే ట్రీట్ ఇచ్చింది అదా. ఈసారీ అదాశర్మ బికినీ ట్రీట్‌తో అదరగొట్టింది. అదా ఇలా రెగ్యులర్‌గా ఫోటోషూట్లతో అభిమా నులకు టచ్‌లో ఉంటున్నా కెరీర్ పరంగా మాత్రం జీరో అయిపోయింది. కనీసం 2019లో అయినా ఈ కుర్ర బ్యూటీ బిగ్ గోల్స్ ను సెట్ చేసుకుని కెరీర్ పరంగా ఎదిగేందుకు ఏం చేస్తుందో మాత్రం తేలాల్సి ఉంది. ఇప్పటివరకూ తనకు ఎంతో ఆశావహ అవకాశాల్ని ఇచ్చిన టాలీవుడ్‌లో కొత్త సినిమాకి సంతకం చేసింది లేదు. అటు తమిళం, హిందీలో అవకాశాలు ఉన్నాయని చెబుతున్నా, ఇంతవరకూ ఏదీ రిలీజ్‌కి రాలేదు. ఈ సందిగ్ధావస్త నుంచి అదా బయటపడుతుందనే అభిమానులు భావిస్తున్నారు. తమిళంలో చార్లీ చాప్లిన్ 2 చిత్రంలో నటిస్తోంది. హిందీలో బైపాస్ రోడ్ అనే సినిమాతో పాటు, కమెండో 3 అనే వెబ్ సిరీస్ చేస్తోంది.



నాలుగు లేఖల కథేమి?

ఈశ్వర్, టువ చక్రవర్తి, అంకిత మహారాణా హీరో హీరోయిన్లుగా పరిచయం అవుతున్న ఈ చిత్రాన్ని ఆర్.రఘురాజ్ దర్శకత్వంలో దొమ్మరాజు హేమలత, దొమ్మరాజు ఉదయ్‌కుమార్ నిర్మిస్తున్నారు. చిత్రీకరణను పూర్తయింది. నిర్మాణానంతర కార్యక్రమాలను జరుపుకుంటోంది.

నిర్మాతలు మాట్లాడుతూ "మా బ్యానర్‌లో నిర్మిస్తోన్న తొలి చిత్రం '4 లెటర్స్'. ఈ చిత్రం ద్వారా ఈశ్వర్‌ను హీరోగా పరిచయం చేయడం ఆనందంగా ఉంది. చాలా చక్కగా నటించాడు. సత్యానంద్‌గారి వద్ద శిక్షణ తీసుకున్న ఈశ్వర్.. ఈ సినిమా కోసం చాలా హార్డ్ వర్క్ చేశారు. రేపు థియేటర్లో సినిమా చూస్తే కొత్త హీరోలా కాకుండా అనుభవమున్న హీరో సినిమా చేసినట్లుగా నటించారు. అలాగే "కలుసుకోవాలని'వంటి బ్యూటీఫుల్, క్యూట్ లవ్ స్టోరీని తెరకెక్కించి అందరి మన్ననలు పొందిన దర్శకుడు రఘురాజాగారు మా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. కన్నడ, తెలుగు చిత్రాలకు దర్శకత్వం వహిస్తూ బిజీగా మారిన ఆయన చాలా గ్యాప్ తర్వాత తెలుగులో చేస్తున్న చిత్రమిది. అన్ని అంశాలతో.. కమర్షియల్ హంగులతో యూత్ సహా అన్నీ వర్గాలను ఆకట్టుకునే ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా రూపొందించాం. చిత్రీకరణంతా పూర్తి చేశాం. సీనియర్ ప్రొడక్షన్ కంట్రోలర్ సి.భాస్కర రాజు గారి సహకారం ఈ చిత్ర నిర్మాణంలో మరువలేనిది. ఆయనకు కృతజ్ఞతలు. త్వరలోనే పాటలు, సినిమా విడుదల తేదీని ప్రకటిస్తాం" అన్నారు. దర్శకుడు ఆర్.రఘురాజ్ మాట్లాడుతూ "కలుసుకోవాలని తర్వాత కన్నడ, తమిళ సినిమాలతో బిజీగా మారిపోయాను. చాలా గ్యాప్ తర్వాత తెలుగులో నేను డైరెక్ట్ చేసిన మూవీ. నేటి ట్రెండ్‌కు తగ్గట్లు సినిమాను తెరకెక్కించాను" అన్నారు.



సోనాక్షి కొత్త అవతారం

షాట్‌గన్ డాటర్ సోనాక్షి సిన్హా పరిచయం అవసరం లేదు. ఈ అమ్మడు 'దబాంగ్' సిరీస్ నాయికగా, అటుపై దక్షిణాది డైరెక్టర్లు ప్రభుదేవా, మురుగదాస్ల పాలిట లక్కీ నాయికగా అందరికీ తెలుసు. అప్పట్లో రజనీకాంత్ లింగా చిత్రంలో కథానాయికగా నటించింది. దురదృష్టవశాత్తూ సోనాక్షి డెబ్యూ చిత్రం డిజాస్టర్ రిజల్ట్ అందుకోవడంతో తనని తిరిగి ఓ తెలుగు సినిమాలో వీక్షించే భాగ్యం అభిమానులకు కలగలేదు. అయితే ఆ లోటు తొందరలోనే తీరుతుందని భావించాలి. ప్రస్తుతానికి ఈ భామ వరుసగా మూడు చిత్రాల్లో నటిస్తోంది. అజయ్‌దేవగన్ 'టోటల్ ధమాల్' , కరణ్ జోహార్ హిస్టారికల్ మూవీ 'కళాంక్'లో నటిస్తోంది. మాధురి దీక్షిత్, ఆలియా, వరుణ్ ధావన్ ఈ చిత్రంలో నటిస్తున్నారు. అక్షయ్ కుమార్ నటిస్తున్న 'మిషన్ మంగళ్'అనే స్పేస్ బ్యాక్‌డ్రాప్ చిత్రంలోనూ నాయికగా కనిపించ నుంది. తాజాగా సోనాక్షి ఫోటోషూట్ ఒకటి సామాజిక మాధ్యమాల్లో రివీలైంది. ఈ ఫోటోలో బ్లాక్ అండ్ బ్లాక్ లుక్ లో సోనాక్షి మైమరిపిస్తోంది. బ్లాక్ జిప్డ్ డ్రెస్ లో అదిరిపోయే కిక్కు ఇస్తోంది. ఈ ఫోటో యూత్‌లో జోరుగా వైరల్ అవు తోంది.



'బ్లఫ్ మాస్టర్' సక్సెస్‌మీట్

శ్రీదేవి మూవీస్ సంస్థ అధినేత శివలెంక క ష్ణప్రసాద్ సమర్పణలో, అభిషేక్ ఫిలిమ్స్ అధినేత రమేష్ పిళ్లై నిర్మాతగా తమిళంలో ఘనవిజయం సాధించిన 'చతురంగ వేట్టై'ని ఆధారంగా చేసుకుని గోపీ గణేష్ పట్టాబి దర్శకత్వంలో.. తెలుగులో రూపొందిన చిత్రం 'బ్లఫ్ మాస్టర్'. 'జ్యోతిలక్ష్మీ', 'ఘాజి' చిత్రాల ఫేమ్ సత్యదేవ్ హీరోగా నటించారు. 'ఎక్కడికి పోతావు చిన్నవాడా' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన నందితా శ్వేత ఇందులో నాయిక. 'బ్లఫ్ మాస్టర్' సక్సెస్‌మీట్ సోమవారం ఉదయం హైదరాబాద్‌లో జరిగింది. మారుతి మాట్లాడుతూ "గోపీగణేష్ నాకు ఎప్పటి నుంచో తెలుసు. సినిమాను బాగా తీశాడు. సత్యదేవ్ని చూస్తే జెన్యూన్ ఆర్టిస్టును చూసిన ఫీలింగ్ వచ్చింది. తను పాత్రకు న్యాయం చేశాడు. తమిళ సినిమాను తెలుగు ప్రేక్షకులకు నచ్చేలా తీశారు. ప్రతి పాత్రకూ డీటైలింగ్‌గా పనిచేశారు. ఇలాంటి చిన్న సినిమాలను ఆదరిస్తే వీళ్ల దగ్గర నుంచి మరిన్ని మంచి సినిమాలు వస్తాయి. వీళ్ల కష్టానికి మనం ఇచ్చే ఎనర్జీ థియేటర్కు వెళ్లి సినిమా చూడటమే" అని అన్నారు. శివలెంక కృష్ణప్రసాద్ మాట్లా డుతూ "తమిళ సినిమాను చూడగానే తెలుగులో రీమేక్ చేయాలనుకున్నా. రైట్స్ కోసం తీవ్రంగా ప్రయత్నించాక రమేష్ పిళ్లై దగ్గర ఉన్నాయని తెలిసింది. ఆయన్ని అడిగితే ఇద్దరం కలిసి చేద్దామని అన్నారు. ఇది చిన్న సినిమాల్లో పెద్ద సినిమా. గీతా ఆర్ట్స్, సురేష్ ప్రొడక్షన్స్... చూసిన ప్రతి వాళ్లూ ఎగ్జయిట్ అయ్యారు. అదే ఎగ్జయిట్మెంట్ జనాల్లో కనిపిస్తుంది. నిర్మాతగా మాకు సంతృప్తిని ఇస్తుందని నమ్ముతున్నాం" అని చెప్పారు. గోపీగణేష్ మాట్లాడుతూ "సినిమాకు వస్తున్న స్పందన సంతోషాన్నిచ్చింది.



కోడిగుడ్లు రిటైల్ ధర (100కు)			
హైదరాబాద్	439	విజయవాడ	453
ముంబయి	494	ఢిల్లీ	460
చెన్నై	455	బెంగళూరు	445



బ్రాయిలర్ చికెన్ ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.			
హైదరాబాద్	108	ఢిల్లీ	115
కరీంనగర్	110	ముంబయి	100
వరంగల్	105	చెన్నై	105

సెన్సెక్స్ –8.39
36,068.72



నిఫ్టీ +2.65
10,862

రూపాయి
₹69.78
(ఒక అమెరికా డాలర్‌కు)



పసిడి
32,680.00
(హైదరాబాద్‌లో) 10 గ్రాములకు/(రూ.)లలో

రుణం కోసం ఎదురుచూస్తున్న జెట్ ఎయిర్‌వేస్



ముంబై: ఆర్థిక కష్టాల్లో చిక్కుకున్న విమాన సంస్థ జెట్ ఎయిర్‌వేస్.. రూ.1,500 కోట్ల రుణం కోసం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ)తో సంప్రదింపులు జరుపుతోందని విశ్వసనీయవర్గాలు తెలిపాయి. నిర్వహణ మూలధనంతో పాటు బకాయిల చెల్లింపుల అవసరాల కోసం సంస్థ ఈ రుణాన్ని సేకరించాలనుకుంటున్నట్లు చెప్పారు. జెట్ ఎయిర్‌వేస్‌లో 24 శాతం వాటా కలిగిన గల్ఫ్ ఎయిర్‌లైన్ 'ఎతిహాద్'.. ఈ రుణానికి గ్యారెంటీ ఇవ్వనున్నట్లు సమాచారం.సంస్థ పద్దులపై అంతర్జాతీయ సంస్థ ఈవై ఫోరెన్సిక్ జరుపుతోంది. నరేశ్ గోయల్‌కు చెందిన ఈ విమాన సంస్థ ఆర్థిక ఇబ్బందుల కారణంగా గత కొన్ని నెలల నుంచి పైలెట్లు, ఇతర సిబ్బందికి సకాలంలో జీతాలు కూడా చెల్లించలేకపోతోంది. మూడు త్రైమాసికాల నుంచి రూ.1,000 కోట్లకు పైగా నష్టాలను ప్రకటించింది. ఈ సెప్టెంబర్ 30 నాటికి కంపెనీపై రూ.8,052 కోట్ల రుణభారం ఉంది.

పాత ఓఎస్ ఫోన్‌లకు.. వాట్సప్ సెలవ్..



ఢిల్లీ: కొన్ని నిర్ధారిత ప్లాట్‌ఫామ్స్‌కు నేటి నుంచి సేవలు నిలిపివేస్తున్నట్టు వాట్సప్ ప్రకటించింది. 'నోకియా ఎస్ 40'లో నేటి నుంచి వాట్సప్ పనిచేయదు. ఆండ్రాయిడ్ ఓఎస్ వెర్షన్ 2.3.7తో పాటు దాని కంటే పాత ఓఎస్‌లో కూడా వాట్సప్ రాదు. భవిష్యత్తులో తాము ప్రవేశపెట్టబోయే ఫీచర్లను పాత ఐఓఎస్ సపోర్ట్ చేయబోదని ఇంతకు వాట్సప్ తన బ్లాగ్‌లో పేర్కొంది. తమ సేవలు కొనసాగాలంటే ఓఎస్ 4.0 ప్లస్, ఐఓఎస్ 7 ప్లస్ లేదా విండోస్ ఫోన్ 8.1 ప్లస్‌కు అప్‌డేట్ చేసుకోవాలని సూచించింది.ఆండ్రాయిడ్ వెర్షన్ 2.3.3 కంటే పాత ఓఎస్‌లో వాట్సప్ పనిచేయదు. విండోస్ ఫోన్ 7, ఐఫోన్ 3జీఎస్/ఐఓఎస్ 6, నోకియా సింబియన్ ఎస్ 60 వెర్షన్లలో కూడా వాట్సప్ రాదు. ఐఓఎస్ 7, పాత వెర్షన్లల్లోనూ 2020, ఫిబ్రవరి 1 నుంచి వాట్సప్ సేవలు నిలిచిపోనున్నాయి. ఐఫోన్ 4, ఐఫోన్ 4ఎస్, ఐఫోన్ 5, ఐఫోన్ 5సీ, ఐఫోన్ 5ఎస్.. ఐఓఎస్ 7 ఆధారంగా నడుస్తున్నాయి.ఆండ్రాయిడ్ రన్నింగ్ ఓఎస్ 4.0 ప్లస్, ఐఫోన్ రన్నింగ్ ఐఓఎస్ 8 ప్లస్, విండోస్ ఫోన్ 8.1 ప్లస్, జియో ఫోన్, జియో ఫోన్ 2లకు వాట్సప్ సేవలు కొనసాగుతాయి. అయితే ఈ ఫోన్‌లలో చాట్ హిస్టరీని ట్రాన్స్‌ఫర్ చేసుకునే అవకాశం లేదని వాట్సప్ వెల్లడించింది. చాట్ హిస్టరీని ఈమెయిల్‌కు పంపుకోవచ్చని సూచించింది.

జీడీపీ వృద్ధి వేగవంతానికి
ఏడు కీలక విధాన చర్యలు సూచించిన సీఐఐ

- జీడీపీ వృద్ధి రేటు పెరుగుతుంది: సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్



ఢిల్లీ: సర్వీసుల రంగం పటిష్టమైన పనితీరుతో పాటు లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వినియోగ డిమాండ్ మెరుగుదల కారణంగా 2019లో జీడీపీ వృద్ధి 7.5 శాతానికి చేరుతుందని సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్ర జిత్ బెనర్జీ పేర్కొన్నారు. జీఎస్టీ అమలులో క్రమేపీ అడ్డంకులు తొలగడం, మౌలిక సదుపాయాల కల్పనలో పెట్టుబడులు పెరగడం, రుణ సమీకరణ ప్రత్యేకించి సర్వీసుల రంగంలో 24 శాతానికి పెంచుకోవడం వంటి అంశాలు బలమైన ఆర్థికాభి వృద్ధికి బాట వేస్తున్నాయని ఆయన వివరించారు. పలు అంతర్జాతీయ ప్రతికూల సంఘటనలు జరిగినప్పటికీ, ఈ ఏడాది వేగవంతమైన వృద్ధి సాధించిన ఆర్థిక వ్యవస్థగా గుర్తింపుపొందిన భారత్ 2019లో సైతం ఇదే జోరును ప్రదర్శించగలదని పరిశ్రమల సమాఖ్య సీఐఐ అంచనావేసింది. 2018లో పలు ప్రధాన దేశాల మధ్య వాణిజ్య యుద్ధం మొదలుకావడం, చమురు ధరలు పెరగడం, అమెరికా కేంద్ర బ్యాంకు ఫెడరల్ రిజర్వ్ కఠినతర ద్రవ్య విధానం వంటి ప్రతికూలాంశాల నడుమ భారత్ ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధిచెందిందని సీఐఐ గుర్తుచేసింది.

2019లో జీడీపీ వృద్ధి వేగవంతంకావడానికి ఏడు కీలక విధాన చర్యల్ని సీఐఐ సూచించింది. ఇంధనం, రియల్ ఎస్టేట్, విద్యుత్, ఆల్కహాల్ విభాగాలను జీఎస్టీ పరిధిలోకి తేవడం, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు రుణ లభ్యతను పెంచడం, పీసీఏ పరిధిలో వున్న బ్యాంకులపై నియంత్రణలను సరళీకరించడంతో పాటు మ్యూచువల్ఫండ్స్‌ సహా ఆర్థిక సంస్థలకు అత్యవసర నిధుల్ని అందుబాటులో ఉంచాలని సీఐఐ కోరింది. ల్యాండ్ రికార్డుల్ని డిజిటలైజ్ చేయడం, రాష్ట్రాల్లో ఆన్లైన్ సింగిల్ విండో వ్యవస్థల్ని ఏర్పాటుచేయడం వంటివి జరగాలని సీఐఐ ఆకాంక్షించింది.

సెన్సెక్స్ 8 పాయింట్ల నష్టం... నిఫ్టీ 3 పాయింట్ల లాభం

- 13 పైసలు కోలుకున్న రుపాయి
- నష్టాలతో భారత్ పెట్రోలియం, టీసీఎస్



ముంబయి: ఆసియా మార్కెట్ల సానుకూల సంకేతాలతో సోమవారం ఉదయం స్టాక్ మార్కెట్లు లాభాలతో ప్రారంభమయ్యాయి. అయితే మార్కెట్ ఆరంభంలో సెన్సెక్స్ 150 పాయింట్లకు పైగా లాభంతో ట్రేడ్ అయ్యింది. నిఫ్టీ కూడా 10,900 పాయింట్ల స్థాయిని దాటి కొనసాగింది. అయితే సూచీల జోరు ఎంతోసేపు నిలువలేదు. కీలక రంగాల షేర్లలో మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో మార్కెట్లు ఒత్తిడికి గురయ్యాయి. ఫలితంగా సూచీల ఆరంభ లాభాలు ఆవిరయ్యాయి. నిఫ్టీ 10,900 మార్క్‌ను కోల్పోయింది. అలా ట్రేడింగ్‌లో చాలా సేపు ఒడుదొడుకులకు లోనైన సూచీలు చివరకు ఫ్లాట్‌గా ముగిశాయి. సోమవారం నాటి సెషన్‌లో సెన్సెక్స్ అత్యల్పంగా 8 పాయింట్లు నష్టపోయి 36,068 వద్ద స్థిరపడగా.. నిఫ్టీ 3 పాయింట్ల లాభంతో 10,862 వద్ద ముగిసింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 13పైసలు కోలుకుని 69.78గా కొనసాగుతోంది. ఎన్ఎస్ఈలో టైటాన్, సన్‌ఫార్మా, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, జీ ఎంటర్‌టైన్‌మెంట్స్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు లాభపడగా.. భారతీ ఇన్ఫ్రాటెల్, భారత్ పెట్రోలియం, టీసీఎస్, బజాజ్ ఆటో, ఏషియన్ పెయింట్స్ షేర్లు స్వల్పంగా నష్టపోయాయి. దీంతో ఈ ఏడాది చివరి రోజును దేశీయ మార్కెట్లు ఫ్లాట్‌గా ముగించాయి.

స్పోర్ట్స

టీం ఇండియాతో వన్డేలకు కమిన్స్, హెజిల్‌వుడ్ దూరం

మెల్‌బోర్న్: టీమిండియాతో జరిగే మూడు వన్డేల సిరీస్‌కు ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్లు పాట్ కమిన్స్, మిచెల్ మార్ష్, జోస్ హేజిల్‌వుడ్ దూరమయ్యారు. 2019లో ఎక్కువ క్రికెట్ ఆడాల్సి ఉండటంతో వీరి పని భారాన్ని తగ్గించాలని క్రికెట్ ఆస్ట్రేలియా నిర్ణయించింది. ముగ్గురు బౌలర్లకు విశ్రాంతినిస్తే ఆటగాళ్ల ఎంపికలో ఇబ్బంది పడాల్సి వస్తోందని ఆ జట్టు కోచ్ జస్టిన్ లాంగర్ అన్నాడు. 'ఎవరిని ఎంపిక చేయాలో గందరగోళంగా ఉంది. మా బౌలర్ల పనిభారాన్ని పర్యవేక్షించాల్సి ఉంది. ఆ ముగ్గురికి వన్డే సిరీస్‌లో విశ్రాంతినిస్తే తర్వాతి రెండు టెస్టులకు ఉత్సాహంగా ఉంచగలం. కమిన్స్ అద్భుతంగా ఆడాడు. ప్రతి మ్యాచ్‌కు అతడిని ఎందుకు ఎంపిక చేయరని మీరు ప్రశ్నిస్తారు? కానీ మనకు వచ్చే ఏడాది ప్రపంచకప్, యాషెస్ ఉన్నాయి. అందుకే కమిన్స్‌ను ఉల్లాసంగా, తాజాగా ఉంచడం మా బాధ్యత' అని లాంగర్ పేర్కొన్నాడు. 2019లో బిజీ షెడ్యూల్ కారణంగా కమిన్స్ ఐపీఎల్‌కు దూరంగా ఉంటున్నాడు. జనవరి 12 నుంచి మూడు వన్డేల సిరీస్ ఆరంభం కానుంది.

మళ్లీ కోహ్లియే..నం.1



దుబాయ్: టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి టెస్టుల్లో నంబర్ వన్ ర్యాంక్‌తో 2018కు ముగింపు పలికాడు. అటు బౌలర్ల లిస్ట్‌లో సౌతాఫ్రికా బౌలర్ కాగిసో రబాడా టాప్ ప్లేస్‌లో నిలిచాడు. మెల్‌బోర్న్ టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో 82 పరుగులు చేసిన కోహ్లి.. రెండో ఇన్నింగ్స్‌లో డకౌటైన విషయం తెలిసిందే. దీంతో అతను మూడు పాయింట్లు కోల్పోయాడు. అయితే రెండో స్థానంలో ఉన్న కేన్ విలియమ్సన్ కంటే ఇప్పటికే 34 పాయింట్ల ఆధిక్యంలో కోహ్లి ఉన్నాడు. విరాట్ 2018లో టెస్టుల్లో 1322 పరుగులు చేశాడు. దీంతో కెరీర్లోనే కాదు 937 పాయింట్లతో ఆల్ టౌమ్ బెస్ట్ ఇండియన్ ప్లేయర్‌గా కోహ్లి నిలిచాడు. గత ఆగస్ట్‌లో స్మిత్ నుంచి నంబర్ వన్ స్థానాన్ని అందుకున్న కోహ్లి.. 135 రోజులుగా అదే స్థానంలో కొనసాగుతుండటం విశేషం. ఇక 2018లో పది టెస్టుల్లో 52 వికెట్లు తీసుకున్న సౌతాఫ్రికా పేసర్ కాగిసో రబాడా బౌలర్ల లిస్ట్‌లో తొలి స్థానంలో ఉన్నాడు. అటు బాక్సింగ్ డే టెస్ట్‌లోనూ సెంచరీ చేసిన టీమిండియా నయా వాల్ చెటేశ్వర్ పుజారా నాలుగో స్థానంలో కొనసాగుతున్నాడు. యువ వికెట్ కీపర్ రిషబ్ పంత్ పది స్థానాలు ఎగబాకి 38వ స్థానానికి చేరగా.. తొలి మ్యాచ్‌లోనే అదరగొట్టిన మయాంక్ అగ్వారల్ 67వ స్థానంతో ర్యాంకింగ్స్‌లో అడుగుపెట్టాడు. మూడో టెస్ట్‌లో మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచిన జస్‌ప్రీత్ బుమ్రా 28వ స్థానం నుంచి 12వ ర్యాంక్‌కు చేరాడు.

స్మృతి మందనకు అరుదైన గౌరవం



దుబాయ్: టీం ఇండియా మహిళ జట్టు ఓపెనర్ స్మృతి మందనకు అరుదైన గౌరవం దక్కింది. 2018 సంవత్సరానికిగాను ఆమెకు ఐసీసీ ఉమెన్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు దక్కింది. 2018 జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకూ ఇందుకోసం ఐసీసీ పోల్స్ నిర్వహించింది. ఈ ఏడాది మందన 12 వన్డేల్లో 66.90 యావరేజ్‌తో 669 పరుగులు, 25 టీ20ల్లో 130.67 స్ట్రైక్ రేట్‌తో 622 పరుగులు చేసింది. పేసర్ ఝులన్ గోస్వామి తర్వాత ఈ అవార్డు దక్కించుకున్న రెండో భారత మహిళ క్రికెటర్ మందననే. ఇక ఆస్ట్రేలియాకు చెందిన అలెసా హేలీకి ఐసీసీ ఉమెన్స్ టీ20 ప్లేయర్ అవార్డు. ఇంగ్లండ్ స్పిన్నర్ సోఫీ ఎస్లే స్టోన్‌కు ఎమెర్జింగ్ ప్లేయర్ అవార్డులు దక్కాయి. తనకు ఈ అవార్డు రావడంపై మందన హర్షం వ్యక్తం చేసింది. "అవార్డులు అనేవి క్రీడాకారులకి ఎంతో ప్రోత్సాహాన్నిస్తాయి. జట్టు కోసం పరుగులు చేసినప్పుడు మన జట్టు గెలవాలని ఆకాంక్షిస్తాము. ఇలా మన కష్టానికి గుర్తింపు వచ్చినప్పుడు.. ఇంకా కష్టపడి మరిన్ని ఘనతలు సాధించాలని అనిపిస్తుంది" అని మందన తెలిపింది.

సిడ్నీ టెస్ట్‌కు రోహిత్ దూరం




సిడ్నీ: ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్‌లో భాగంగా చివరిదైన నాలుగో టెస్టుకు టీమిండియా క్రికెటర్ రోహిత్ శర్మ దూరం కానున్నాడు. అతని భార్య రితిక ఆదివారం ఆడబిడ్డకు జన్మనివ్వడంతో వారిని చూసేందుకు భారత్‌కు రానున్నాడు. ఈ మేరకు సోమవారం భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు(బీసీసీఐ) ఓ ప్రకటనలో వెల్లడించింది. 7'ఆస్ట్రేలియా నుంచి భారత్‌కు రోహిత్ శర్మ త్వరలో వెళ్లనున్నాడు. అతని భార్య రితిక ఆదివారం ఓ పండంటి ఆడబిడ్డకి జన్మనిచ్చింది. దీంతో.. పాపని చూసేందుకు రోహిత్ శర్మ వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్‌లో అతని రాకతో భారత్ జట్టులో సమతూకం వచ్చింది. సిడ్నీ టెస్టులోనూ అతను ఆడితే బాగుంటుంది.

కానీ.. తొలి బిడ్డకి జన్మనిచ్చిన ఈ సమయంలో రితిక పక్కన రోహిత్ ఉండటం చాలా ముఖ్యం' అని బీసీసీఐ తెలిపింది. జనవరి 8వ తేదీన రోహిత్ శర్మ తిరిగి ఆస్ట్రేలియాకు వస్తాడని పేర్కొంది. దాదాపు తొమ్మిది నెలలు తర్వాత భారత టెస్టు జట్టులోకి ఇటీవల పునరాగమనం చేసిన రోహిత్ శర్మ.. ఆస్ట్రేలియాతో అడిలైడ్ వేదికగా జరిగిన తొలి టెస్టులో (రెండు ఇన్నింగ్స్‌లో 37, 1) 38 పరుగులతో నిరాశపరిచాడు. ఆపై గాయం కారణంగా పెర్త్‌లో జరిగిన రెండో టెస్టుకి దూరమైన రోహిత్ శర్మ.. ఆదివారం మెల్‌బోర్న్‌లో ముగిసిన మూడో టెస్టులో తొలి ఇన్నింగ్స్‌లో రోహిత్ (63 నాటౌట్) రాణించాడు. జనవరి మూడో తేదీ నుంచి సిడ్నీ వేదికగా నాలుగో టెస్టు ఆరంభం కానున్న సంగతి తెలిసిందే.

క్షమాపణలు చెప్పిన కెర్రీ ఓకీఫ్

మెల్‌బోర్న్: భారత దేశవాళీ క్రికెట్‌ను ఉద్దేశించిన కించపరిచే వ్యాఖ్యలు చేసిన ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్, వ్యాఖ్యాత కెర్రీ ఓకీఫ్ తనను క్షమించాలంటూ బహిరంగ లేఖ రాశాడు. తాను ఉద్దేశపూర్వకంగా ఆ వ్యాఖ్యలు చేయలేదన్న ఓకీఫ్.. నోరు జారడం పొరపాటేనని అంగీకరించాడు. బాక్సింగ్ డే టెస్టు మొదటి రోజు అరంగేట్రం ఆటగాడు మయాంక్ బ్యాటింగ్ చేస్తున్న సమయంలో అతడు రంజీల్లో రైల్వే క్యాంటీన్ జట్టుపై త్రిశతకం చేశాడని ఎగతాళి చేశాడు. రంజీ క్రికెట్ స్థాయిని తక్కువ చేశాడు. దీంతో పెద్ద ఎత్తున అతడిపై విమర్శలు చెలరేగాయి. దీనిపై వివరణ ఇచ్చుకున్న ఓకీఫ్.. భారత క్రికెటర్లతో పాటు అభిమానులకు క్షమాపణలు తెలియజేశాడు. 'భారత్, ఆస్ట్రేలియా మూడో టెస్టు సందర్భంగా నేను చేసిన వ్యాఖ్యల స్పందనకు కుంగిపోయా. నా మాటల్లో ఉద్దేశాన్ని వ్యతిరేకంగా ప్రతిబింబించారు. నా అసలు ఉద్దేశం వేరు. తీవ్రంగా సాగుతున్న వ్యాఖ్యానాన్ని సరదాగా మార్చాలని అనుకున్నా. ఈ క్రమంలో నోరు జారి రైల్వే క్యాంటీన్ పదాల్ని వాడాను. అంతే తప్ప భారత క్రికెట్‌ను అగౌరవ పరచలేదు. ఒక పాఠశాల విద్యార్థిగా నేను పర్యటించిన భారత్..ఇప్పుడు అద్భుతమైన క్రికెట్ దేశంగా ఎదిగింది. సిరీస్‌కు ముందు ఆటగాళ్లపై ఎంతో పరిశోధన చేస్తా. రవీంద్ర జడేజా, చతేశ్వర్ పుజారాను అవమానించలేదు. నాపై నేనే జోక్ వేసుకున్నా' అని ఓకీఫ్ పేర్కొన్నాడు.



ఐసీసీ టీ20 కెప్టెన్‌గా
హర్మన్ ప్రీత్ కౌర్

దుబాయ్: భారత మహిళా క్రికెటర్ హర్మన్ ప్రీత్ కౌర్ అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసీసీ) టీ20 కెప్టెన్‌గా ఎంపికయ్యారు. ఈ ఏడాదికిగాను అత్యుత్తమ మహిళా క్రికెట్ జట్లను ఐసీసీ ఎంపిక చేయగా, అందులో టీ 20 విభాగంలో హర్మన్ ప్రీత్ కెప్టెన్‌గా నియమించబడ్డారు. ఈ మేరకు సోమవారం అత్యుత్తమ మహిళా వన్డే, టీ20 జట్లను ఐసీసీ ప్రకటించింది. టీ 20 ఫార్మాట్లో భారత్ నుంచి హర్మన్‌తో పాటు స్మృతీ మంధాన, పూనమ్ యాదవ్‌లకు చోటు దక్కింది. ఇక వన్డే విభాగంలో భారత్ నుంచి స్మృతీ మంధాన, పూనమ్ యాదవ్‌లకు మాత్రమే స్థానం దక్కగా, కెప్టెన్‌గా న్యూజిలాండ్ మహిళా క్రికెటర్ సుజీ బేట్స్ నియమించబడ్డారు. 2018గాను క్రీడాకారిణుల ప్రదర్శనలో భాగంగా మీడియా బ్రాడ్ కాస్టర్ సభ్యులతో కూడిన బృందం విడివిడిగా రెండు అత్యుత్తమ జట్లను ఓటింగ్ ద్వారా ఎన్నుకుంది.

నవంబర్‌లో జరిగిన ఐసీసీ మహిళల వరల్డ్ టీ20లో భారత జట్టు సెమీ ఫైనల్స్‌కు చేరడంలో హర్మన్ ప్రీత్ కీలక పాత్ర పోషించారు. ఆ టోర్నమెంట్లో కౌర్ 160.5 స్ట్రైక్‌రేట్‌తో 183 పరుగులు చేశారు. 2018లో హర్మన్ ప్రీత్ 25 టీ20 మ్యాచ్‌లు ఆడి 126.1 స్ట్రైక్‌రేట్‌తో 663 పరుగులు సాధించారు. మరొకవైపు ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో కౌర్ మూడో స్థానంలో కొనసాగుతున్నారు.



ఐసీసీ మహిళా టీ20 జట్టు: హర్మన్ ప్రీత్ కౌర్(కెప్టెన్, భారత్), స్మృతీ మంధాన(భారత్), అలైస్సా హేలీ(ఆస్ట్రేలియా, వికెట్ కీపర్), సుజీ బేట్స్(న్యూజిలాండ్), నాటేటీ స్కీవర్ (ఇంగ్లండ్), ఎలైసె పెర్రీ (ఆస్ట్రేలియా), అష్లే గార్డనర్(ఆస్ట్రేలియా), కాస్పెర్క్ (న్యూజిలాండ్), మెగాన్ స్కట్(ఆస్ట్రేలియా), రుమానా అహ్మద్(బంగ్లాదేశ్), పూనమ్ యాదవ్(భారత్).

Printed and Published By Chilappagari Laxmi Rajam, on behalf of Intercontinental Publications Private Limited, Printed at Intercontinental Publications Private Limited, Survey No .713/P, Dundigal Grama Panchayat, Qutubullapur Mandal, Medchal – Malkajgiri District 500043, Published at Plot No. 1267/A, Road No. 63/A, Jubilee Hills, HYDERABAD–500033, Telangana State. Editor: Chilappagari Laxmi Rajam, RNI NO: TELTEL /2018/75203, Ph: +91 40 2355 6603, Fax No. +91 4023556604, Toll Free: 1800 599 3399.